అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 01-01-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 02 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50



అత్యంత సంపన్న సీఎం చంద్రబాబే



న్యూఢిల్లీ : దేశంలో అత్యంత సంపన్నుడైన ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నిలిచారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేదవారేనని ఏడీఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్ (న్యూ) తెలిపాయి. ఆయా నేతలు ఎన్నికల కమిషన్‌కు అందజేసిన అఫిడవిట్ల ఆధారంగా ఏడీఆర్ ఈ వివరాలను బహిర్గతం చేసింది. ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు కాగా మమత ఆస్తుల విలువ కేవలం పదిహేను లక్షల రూపాయలు మాత్రమే. ఒమర్ ఆస్తుల విలువ రూ.55 లక్షలు. వీరిద్దరినీ మినహాయిస్తే దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 29 మంది ముఖ్యమంత్రులు కోటీశ్వరులేనని ఏడీఆర్ తెలిపింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అందరు సీఎంల కంటే అత్యధికంగా 89 క్రిమినల్ కేసులు నమోదయ్యాయని ఏడీఆర్ తెలిపింది. వీటిలో 72 కేసులు ఐపీసీ కింద నమోదు చేసిన తీవ్రమైన ఆరోపణలకు సంబంధించినవే. చంద్రబాబుకు కేవలం రూ.10 కోట్ల అప్పులు మాత్రమే ఉన్నాయి. కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆస్తుల విలువ రూ.51 కోట్లు. అధిక ఆస్తులు కలిగిన సీఎంల జాబితాలో ఈయనది మూడో స్థానం. రూ.332 కోట్ల ఆస్తులతో అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రేమా ఖండూ రెండో స్థానంలో ఉన్నారు.

అయితే అధిక అప్పులు కలిగిన సీఎంల జాబితాలో ఈయనదే మొదటి స్థానం. ఖండూ అప్పులు ఏకంగా రూ.180 కోట్లు. సిద్ధరామయ్య అప్పుల విలువ రూ.23 కోట్లు మాత్రమే.కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు కోటి రూపాయల విలువ కలిగిన ఆస్తులు మాత్రమే ఉన్నాయి. దేశంలోని 31 మంది ముఖ్యమంత్రుల ఆస్తుల మొత్తం విలువ రూ.1,630 కోట్లు. వీరిలో కేవలం ఇద్దరు మాత్రమే మహిళలు ఉన్నారు. తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని 13 మంది సీఎంలు (42 శాతం) ప్రకటించారు. వీరిలో పది మందిపై తీవ్రమైన క్రిమినల్ అభియోగాలు ఉన్నాయి. వీటిలో హత్యాయత్నం, కిడ్నాపింగ్, ముడుపులు, భయభ్రాంతులకు గురిచేయడం వంటి తీవ్రమైన నేరాలు ఉన్నాయి. బెదిరింపులకు సంబంధించి రేవంత్ రెడ్డిపై 34 క్రిమినల్ కేసులు నమోదు చేశారు (ఐపీసీ సెక్షన్ 506). ఐపీసీ సెక్షన్ 505 (2) కింద 22 కేసులు, ఐపీసీ సెక్షన్ 505 కింద మూడు కేసులు ఉన్నాయి. ఐపీసీ సెక్షన్ 420 కింద రెండు, ఐపీసీ సెక్షన్ 477-ఏ, సెక్షన్ 285-ఏ కింద ఒక్కో కేసు పెట్టారు. అత్యధిక కేసులున్న సీఎంలలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ది రెండో స్థానం. ఆయనపై 47 కేసులు ఉన్నాయి. వీటిలో 11 కేసులు ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద పెట్టినవే.

నేటి నుంచి సివిల్ సప్లై, జీసీసీ హమాలీల సమ్మె

సివిల్ సప్లయీస్, జీసీసీ హమాలీ వర్కర్స్ యూనియన్ల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



సివిల్ సప్లయీస్, జీసీసీ హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతికి సంబంధించిన నూతన రేట్ల ఒప్పందాన్ని అమలు చేస్తూ జీవో విడుదల చేయాలని సివిల్ సప్లయీస్, జీసీసీ హమాలీ వర్కర్స్ యూనియన్ల జేఏసీ డిమాండ్ చేసింది. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ సంఘాల నేతలు బాలరాజు, వంగూరి రాములు, కె సూర్యం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీలందరూ పనులు బంద్ చేసి బుధవారం నుంచి జరిగే సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పాత రేట్ల ఒప్పందం ముగిసినందున 2024-25 సంవత్సరాలకు సంబంధించిన నూతన రేట్లను పెంచాలని కోరుతూ హమాలీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనేక దఫాలుగా విన్నవించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని తెలిపారు. ఈ నేపథ్యంలో నూతన రేట్లు, ఇతర సమస్యల పరిష్కారం కోసం 10 నెలల తర్వాత 3-10-2024న అన్ని కార్మిక సంఘాల సమక్షంలో చర్చలు జరిపి ఎగుమతి, దిగుమతి నూతన రేట్లను రూ.26 నుంచి రూ.29 లకు పెంచేందుకు అంగీకారం కుదిరిందని తెలిపారు. పెరిగిన రేట్లను 2024 జనవరి నుంచి అమలు చేస్తామనీ, ఏరియర్స్ సహా చెల్లిస్తామనీ, మహిళా స్వీపర్లకు గోదాముల సామర్థ్యాన్ని బట్టి ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలపై రూ.వెయ్యి అదనంగా పెంచారని చెప్పారు. బోనస్ రూ.6,500 నుంచి రూ.7,500కు, యూనిఫామ్ కుట్టు కూలి చార్జీలు రూ.1,300 నుంచి రూ.1,600కు, దసరా పండుగ సందర్భంగా ఇచ్చే స్వీట్ బాక్స్ రూ.800 నుంచి రూ.900కు పెంచుతూ సివిల్ సప్లయీస్ హమాలీల మాదిరిగానే జీసీసీ హమాలీలకు పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామంటూ కమిషనర్, సంబంధిత అధికారులు అంగీకరించినట్టు గుర్తు చేశారు. ఈ హామీలన్నింటినీ వారం రోజుల్లో అమలు చేస్తామని సివిల్ సప్లయ్ అధికారులు చెప్పి మూడు నెలలు కావస్తున్నా జరిగిన ఒప్పందం ప్రకారం నేటికీ ప్రభుత్వం కనీసం జీవో విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. పెరిగిన ధరలకనుగుణంగా తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు పి సుధాకర్, టీయూసీఐ నాయకులు డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖాజాగూడలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

- 9 ఎకరాల 7 గుంటల భూమి హైడ్రా స్వాధీనం

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ఈ ఏడాది చివరి రోజు కూడా హైడ్రా కొరడా ఝులిపించింది. మంగళవారం సుమారు 9 ఎకరాల 7గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నది. హైడ్రా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని ఖాజాగూడ, నానక్‌రాంగూడ మధ్యనున్న భగీరథమ్మ చెరువు 35 ఎకరాల వరకు ఉంటుంది. సర్వే నెంబర్ 18లో కొందరు వ్యక్తులు చెరువు బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టి తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేశారు. ఇటీవల స్థానికులు ఈ విషయంపై హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో హైడ్రా అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి, ఆక్రమణలు నిజమేనని నిర్ధారించి, అక్కడి వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు ఇచ్చిన 24 గంటల్లోనే కూల్చివేతలు చేపట్టారు. మంగళవారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకున్న హైడ్రా సిబ్బంది.. జేసీబీల సాయంతో చెరువుపై ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. హైడ్రా సిబ్బందిని అడ్డుకునేందుకు వ్యాపారులు యత్నించినా సిబ్బంది తమ కూల్చివేతలను కొనసాగించారు. కూల్చివేతలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. నాలుగు ఎకరాల్లో 20కి పైగా దుకాణాలను తొలగించారు. అయితే ఖాజాగూడ కూల్చివేతల వద్ద తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఎన్నో ఏండ్లుగా ఉన్న తమ నిర్మాణాలు ఎలా కూల్చివేస్తారంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.

కూల్చివేతలు ఆపేయండి

ఖాజాగూడలో హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం

- ఆ నిర్మాణాలు చట్టవిరుద్ధమని ఆధారాలేవి?
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నట్టు మీరెలా నిర్ధారిస్తారు?
- ఇలాంటి చర్యలు మళ్లీ జరిగితే రంగనాథ్‌పై కఠిన చర్యలు : హైకోర్టు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఆ నిర్మాణాలు చట్టవిరుద్ధమని ఆధారాలేవి? ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఆ నిర్మాణాలున్నాయని మీరెలా నిర్ధారిస్తారు? ఇలాంటి చర్యలు మళ్లీ జరిగితే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కఠిన చర్యలు తీసుకుంటాం' అని హైకోర్టు హెచ్చరించింది. ఖాజాగూడ సరస్సు వద్ద హైడ్రా కూల్చివేతలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఖాజాగూడ సరస్సు ప్రాంతంలో ఇటీవల హైడ్రా సంస్థ చేపట్టిన కూల్చివేత చర్య చట్టబద్ధతను ప్రశ్నిస్తూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఎఫ్‌టీఎల్(ఫ్లడెడ్ ట్యాంక్ లెవెల్), బఫర్ జోన్‌లోని ఆస్తులపై కూల్చివేతపై సాక్ష్యాలేని ప్రశ్నించింది. "ఈ ఆస్తులు ఎటువంటి ఆధారాలు అందించకుండా ఎఫ్‌టీఎల్ సరిహద్దులో ఉన్నాయని మీరు ఎలా క్లెయిమ్ చేస్తారు?" అని నిలదీసింది. కూల్చివేతలకు సంబంధించిన చట్టపరమైన ప్రాతిపదికపై సందేహాలను లేవనెత్తుతూ పిటిషనర్ అవసరమైన అన్ని పత్రాలను సమర్పించారని తెలిపింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిమితుల యొక్క సరైన ధ్రువీకరణ లేకుండా కూల్చివేతలను అమలు చేయడాన్ని తప్పుబట్టింది. కూల్చివేతలను నిలిపివేయాలని కమిషనర్‌ను ఆదేశించింది. "మరోవిధంగా ఆదేశాలున్నప్పటికీ కూల్చివేతలు కొనసాగితే, నేను తదనుగుణంగా చర్యలు తీసుకుంటాను. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కమిషనర్ రంగనాథ్‌పై కఠిన చర్యలు తీసుకుంటాం' అని జస్టిస్ లక్ష్మణ్ హెచ్చరించారు. పిటిషనర్ జీహెచ్‌ఎంసీ నిబంధనలను అనుసరించి అధికారిక అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని కోర్టు స్పష్టం చేసింది. పిటిషనర్ నిర్మించిన తాత్కాలిక నిర్మాణాలను 24 గంటల్లోగా తొలగించాలని కూడా జస్టిస్ లక్ష్మణ్ పేర్కొన్నారు.

విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించవద్దు

- కేంద్రం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్
- విద్యుత్ కార్మికుల పోరాట సంఘీభావ దినం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీలు

నవతెలంగాణ- విలేకరులు

కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణ చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో నిరసన తెలిపారు. కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద విద్యుత్ కార్మికుల పోరాట సంఘీభావ దినం సందర్భంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ.. మూడోసారి కేంద్రంలో ఏర్పడిన మోడీ ప్రభుత్వం గతంలో కన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలను అవలంబిస్తోందన్నారు. తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో డిస్కంల ప్రయివేటీకరణకు బీజం వేసిందన్నారు. అదానీ లాంటి కార్పొరేట్లకు దొడ్డిదారిన టెండర్లు కట్టబెడుతూ విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా ప్రయత్నాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ, అదానీ నుంచి విద్యుత్ రంగాన్ని కాపాడుకుందామంటూ పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చౌరస్తా వద్ద సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు.

విద్యుత్ రంగ ప్రయివేటీకరణను ఆపాలని సీఐటీయూ వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. విద్యుత్తు కార్మికుల పోరాట సంఘీభావ దినంలో భాగంగా నిరసన చేపట్టారు. విద్యుత్తు రంగాన్ని కాపాడుకుందాం ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదామని సీఐటీయూ మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పిలుపునిచ్చారు. విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయం ముందు నిరసన తెలిపారు.

విద్యుత్ రంగ ప్రయివేటీకరణ ఆపివేయాలని టీజీయుఈఈయు నాయకులు డిమాండ్ చేశారు. చండీఘడ్, ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ రంగాన్ని ప్రవేటీకరించడానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యుత్ రంగ కార్మికులు పోరాటం చేస్తున్నారని తెలిపారు. వారికి మద్దతుగా టీజీయూఈఈయూ-సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మెదక్ జిల్లాలోని మెదక్, తూప్రాన్‌లో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో టీజీయూఈఈయూ(సీఐటీయూ) యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, టీజీయూఈఈయూ(సీఐటీయూ) యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నర్సింలు, గూడాల రవీంద్రప్రసాద్ మాట్లాడారు.

కొండాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లోని రాజ రాజేశ్వరి కాలనీలో ఉన్న గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ప్రజలు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ రాజేశ్వరి కాలనీలో ఉన్న గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ 9వ అంతస్తులో మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి.

రాజకీయ కుట్రతోనే బీఎస్పీ కార్యాలయంపై దాడి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజకీయ కుట్రతోనే బీఎస్పీ కార్యాలయంపై దాడి చేశారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. డిసెంబర్ 28న బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడి వెనుక మనువాదుల, అధికార పార్టీ నాయకుల కుట్ర దాగి ఉన్నదని విమర్శించారు. రాష్ట్రంలో బహుజన ఉద్యమం బలోపేతమవుతున్న సందర్భంలో కార్యకర్తలను ప్రజలను గందరగోళానికి గురి చేసే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తోందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ని అవమానించేలా మాట్లాడటం ఇందులో భాగమేనన్నారు. జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఆదేశాల మేరకు మంగళవారం 40మందిపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

ఈ ఘటనపై ఇద్దరు రాష్ట్ర కో ఆర్డినేటర్లతో సెంట్రల్ కో ఆర్డినేటర్ రాం జీ గౌతమ్ కమిటీ వేశారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ్ కృష్ణ, ప్రధాన కార్యదర్శిలు అడ్వకేట్ నిషాని రామచంద్రం, గొల్ల సతీష్, అంతటి నాగన్న, జక్కుల వెంకట్ రాష్ట్ర కోశాధికారి నాయిని ప్రణయ్, అన్ని జిల్లాల ఇంచార్జ్‌లు అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రజలకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 సంవత్సరం తన రాజకీయ జీవితంలో కీలకమైందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో విజయాలు సాధించాలనీ, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. 'అధినాయకులు, తోటి రాజకీయ మిత్రులు, స్నేహితులు, మీడియా ప్రోత్సాహం తనకు జీవితాంతం గుర్తుంటుంది. గత ఏడాదిలో ఎన్నో విజయాలు, ఎన్నో అనుభవాలు సాధించాం. ఒక రాజకీయ నాయకుడిగా చట్టసభలో అడుగుపెట్టా. ఒక కాంగ్రెస్ కార్యకర్తగా గొప్ప పీసీసీ పదవిలో రాష్ట్ర అధ్యక్షులుగా అడుగుపెట్టా. ఇది తన జీవితంలో అత్యంత గొప్ప సంఘటన. అన్ని విధాలుగా సహకారాన్ని అందించిన ఏఐసీసీ, టీపీసీసీ పెద్దలకు, రాజకీయ తోడ్పాటు అందించిన రాష్ట్ర నాయకుల సహకారాన్ని ఎన్నటికీ మరువలేను. వచ్చే కొత్త సంవత్సరం తెలంగాణ ప్రజలకు అంతా మంచి జరగాలని కోరుకుంటున్నా' అని ఆకాంక్షించారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 01-01-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 02 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50



పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర (2025) శుభాకాంక్షలు
- చీఫ్ జనరల్ మేనేజర్, నవతెలంగాణ.

కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దు

తీర్పు వచ్చే దాకా ఆగండి

మధ్యంతర ఉత్తర్వులను పొడిగించిన న్యాయమూర్తి



రోజంతా సుదీర్ఘ వాదనలు

ఫార్ములా ఈ రేసింగ్ కేసుపై తీర్పు రిజర్వు

నవతెలంగాణ-హైదరాబాద్

ఫార్ములా ఈ-రేస్ అక్రమాలపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) వేసిన పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది. మంగళవారం హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు సుదీర్ఘంగా జరిగాయి. అనంతరం తీర్పును తరువాత వెలువరిస్తామని న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ప్రకటించారు. తీర్పు వెలువడే వరకు పిటిషనర్ కేటీఆర్‌ను అరెస్టు చేయరాదని ఏసీబీని ఆదేశించారు. ఈ మేరకు గతంలో వెలువడిన మధ్యం తర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్టు ప్రకటించారు. ఏసీబీ దర్యాప్తును కొనసాగించుకో వచ్చన్నారు. ఆ దర్యాప్తునకు కేటీఆర్ సహకరించాలనీ, అతని వద్ద ఉన్న పత్రాలను ఏసీబీకి అందజేయాలని కోర్టు ఆదేశించింది.

వ్యక్తిగత, రాజకీయ కక్షసాధింపు-దవే

పిటిషనర్ కేటీఆర్ తరఫును సుప్రీంకోర్టు ... 15లో

జనవరి 4న మంత్రివర్గం భేటీ

రైతు భరోసా, రేషన్‌కార్డులపై చర్చ



సంక్షేమ, అభివృద్ధి పథకాల నిధుల సమీకరణపై కసరత్తు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జనవరి 4న సాయంత్రం 4గంటలకు సచివాలయంలో జరగనుంది. కొత్త సంవత్సరంలో జరిగే ఈ భేటీలో పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, భూమిలేని పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులు, టూరిజం పాలసీపై చర్చించే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం కిసాన్, ప్రధాన మంత్రి బీమా యోజన పథకంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌కం ట్యాక్స్ చెల్లించే వారు, ఉద్యోగులను దీని నుంచి మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. రైతు భరోసాకు ఇదే విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నప్పటికి పలువురు మంత్రులు అభ్యంతరం తెలిపినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రైతు భరోసాపై తీసుకునే నిర్ణయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కొత్త రేషన్ కార్డులకు ... 15లో



మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు కె.హేమలత

ఆశాలను వర్కర్లుగా గుర్తించాలి

ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు : సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు కె. హేమలత

ముగిసిన ఆశా వర్కర్స్ యూనియన్ బస్సు జాతా

డబ్బుల్లేవంటూ బీజేపీ సర్కారు కుంటిసాకులు

కోటీశ్వరులకు రూ.లక్షల కోట్ల రాయితీలకు డబ్బులెక్కడివి?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆశాలను వర్కర్లు, కార్మికులు, ఉద్యోగులుగా గుర్తించేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు నిరాకరిస్తున్నదని సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు కె.హేమలత తెలిపారు. వర్కర్లు, కార్మికులు, ఉద్యోగులుగా స్కీం వర్కర్లను గుర్తిస్తే వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించాల్సి వస్తుందనీ, వాటి కోసం తమ వద్ద బడ్జెట్ లేదంటూ కుంటిసాకులు చెబుతున్నదని చెప్పారు. కేంద్రం వద్ద తగినంత బడ్జెట్ లేకుంటే శత కోటీశ్వరులకు, సహస్ర కోటీశ్వరులకు రూ.లక్షల కోట్ల పన్ను రాయితీలు ఎలా ఇచ్చారని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో 26 వేల మంది ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలనీ, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో డిసెంబర్ 15న నిర్మల్ జిల్లాలో ప్రారంభమైన ఆ యూనియన్ అధ్యక్షురాలు పి.జయలక్ష్మితో సహా ఏడుగురు మహిళా ఆశా నాయకుల బస్సు యాత్ర మంగళవారం హైదరాబాద్‌లో ముగిసింది. ఇందిరాపార్క్ వద్ద గల ధర్నాచౌక్‌లో తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ ... 7లో

తాకట్టులో బంగారం

తలకిందులౌతున్న ప్రజల ఆర్థిక స్థితిగతులు.. పెరుగుతున్న పసిడి రుణ బాకీలు

దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థ మందగించడం, ఆదాయాలు తగ్గడం, అప్పులు పెరగడంతో బంగారం రుణాల్లో భారీగా మొండి బాకీలు పెరుగుతున్నాయి. మరోవైపు తాకట్టు పెట్టిన బంగారం వేలానికి వస్తోంది. గతేడాది 2024 ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంకులు, బ్యాంకింగేతర విత్త సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల పసిడి రుణాల నిరర్థక ఆస్తులు 30 శాతం ఎగిసి రూ.6,696 కోట్లకు చేరాయి. ఇంతక్రితం మార్చి ముగింపు నాటికి రూ.5,149 కోట్ల నిరర్థక ఆస్తులు చోటు చేసుకున్నాయి.

ఆర్బీఐ గణంకాల ప్రకారం.. 2022-23లో బంగారం రుణాల జారీలో 14.6 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు సమాచార హక్కు చట్టం కింద ఆర్బీఐ ఇచ్చిన వివరాల మేరకు.. 2024 జూన్ ముగింపు నాటికి వాణిజ్య బ్యాంక్‌ల బంగారం రుణాల ఎన్పీఏలు రూ.2,445 కోట్లకు చేరాయి. 2024 మార్చి నాటికి రూ.1,513 కోట్ల ఎన్పీఏలు నమోదయ్యాయి.



ఇదే సమయంలో ఎన్‌బీఎఫ్‌సీల పసిడి రుణ ఎన్పీఏలు 3,636 కోట్లుగా ఉండగా.. జూన్ ముగింపు నాటికి రూ.2,445 కోట్లకు చేరాయి. బంగారం రుణాలు తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతలు విఫలం కావడమే ఇందుకు ప్రధాన కారణం.

పెరుగుతున్న డిఫాల్టర్లు

ఆర్థిక వ్యవస్థ మందగించడం ఆదాయ స్థాయిలను ప్రభావితం చేయడంతో ఖాతాదారులు తిరిగి చెల్లించడం కష్టతరంగా మారడంతో బంగారం రుణాల డిఫాల్ట్‌లు పెరుగుతున్నాయని ఆ పరిశ్రమ వర్గాల అంచనా. బంగారం ధరలు పెరగడంతోనూ ప్రజలు ఇంటి ఖర్చులు, పాఠశాల, విద్య ఫీజులు, వైద్య అవసరాల కోసం తమ బంగారాన్ని తాకట్టు పెట్టారు. అక్టోబర్ 2024 నాటికి బ్యాంకుల్లో బంగారం రుణాలు రూ.1,54,282 కోట్లకు పెరిగాయి. మార్చి 2024 నాటికి రూ.1,02,562 కోట్లుగా నమోదయ్యాయి. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల బంగారు రుణ పుస్తకం కలిపి రూ.3 లక్షల కోట్ల మార్కును దాటినట్లు అంచనా.

23 శాతం పెరిగిన బంగారం ధర

గడిచిన ఏడాది 2024లో బంగారం ధరలు 23 శాతం పెరిగాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యాక జాతీయంగా, అంత ర్జాతీయంగా బంగారం ధరలు కొంత దిగి వచ్చాయి. 2025లో తులం బంగారం ధర రూ.90 వేలకు చేరుతుందని బులియన్ మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భౌగోళిక ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక రంగంలో ఒడి దొడుకులు ఇలాగే కొనసాగడంతో పాటు అమెరికా డాలర్‌పై రూపా యి మారకం విలువ పతనం వంటి కారణాలతో 2025లో దేశీయ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.85 వేల నుంచి రూ.90 వేల వరకూ చేరొచ్చని అంచనా. ప్రస్తుతం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.79,350గా ఉంది. 2024 జనవరి ఒకటో తేదీన తులం బంగారం ధర రూ.63,870 పలికింది. నాటి నుంచి ఇప్పటి వరకూ బంగారం ధర 23 శాతం పెరిగింది. అక్టోబర్ 30న తులం బంగారం ధర రూ.82,400కి చేరి జీవిత కాల గరిష్టాన్ని తాకింది.





సీపీఐ(ఎం) 4వ రాష్ట్ర మహాసభల సందర్భంగా 2కే రన్ ప్రారంభిస్తున్న ఆహ్వాన సంఘం అధ్యక్షులు చుక్కరాములు

ఎర్రజెండా ప్రాధాన్యత పెరిగింది

చైనా ఆర్థిక వ్యవస్థ అమెరికానే సవాల్ చేస్తోంది • నేపాల్, శ్రీలంకలోనూ ఎర్రజెండా రెపరెపలు

వివరాలు 7లో..

చిత్ర పరిశ్రమను వివాదాల్లోకి లాగొద్దు

కేటీఆర్ వ్యాఖ్యలు బాధాకరం: ఎఫ్‌డీసీ చైర్మెన్ దిల్ రాజు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చిత్ర పరిశ్రమను రాజ కీయ వివాదాల్లోకి లాగొద్దని తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొ రేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మెన్ దిల్ రాజు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జరిగిన తెలుగు చిత్ర పరిశ్రమ సమావేశంపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ఆయన ఎక్స్‌లో ... 15లో



సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ

కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు

మొదటి దశలో నాలుగు జిల్లాల్లో నిర్మాణం

రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారికి సకల సౌకర్యాలు : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి వెల్లడి 7లో..

కూల్చివేతలు ఆపేయండి

ఖాజాగూడలో హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం

వివరాలు 2లో..


అత్యంత సంపన్న సీఎం చంద్రబాబే

2లో..

ఏడోస్థానంలో సీఎం రేవంత్ రెడ్డి.. ఆయనపై అత్యధిక కేసులు

పినరయి ఆస్తుల విలువ కోటి : సీఎంలపై ఏడీఆర్ నివేదిక





జాతీయ రహ దాడులు

హైకోర్టు ఆర్డర్స్ ఉన్నా రైతుల భూములపై దౌర్జన్యం

గుట్టుచప్పుడు కాకుండా మార్కింగ్, హద్దురాళ్లు

పరిహారం తీసుకోవాలని రైతులపై ఒత్తిడి

వ్యక్తిగతంగా ఫోన్లు..

మభ్యపెట్టే యత్నాలు

కోర్టుకు వెళ్లిన 130 మంది రైతుల్లో ఐక్యతను దెబ్బతీసే కుట్ర

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి వరకు నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ హైవే (ఎన్‌హెచ్ 163జీ) భూసేకరణ విషయంలో ప్రభుత్వం నిర్వాసిత రైతులపై దౌర్జన్యాలకు పాల్పడుతోంది. సుమారు 130 మంది రైతులు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ భూములపై హైకోర్టు స్టేఆర్డర్ ఉన్నా అవేవీ పట్టించుకోకుండా నేషనల్ హైవే అధికారులు రైతుల భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా మార్కింగ్ చేయటం, హద్దురాళ్లు పాతడం వివాదాస్పదమైంది. దీనిపై సంబంధిత రైతులు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్



ఇండియా ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్-2 డైరెక్టర్ రామాంజనరెడ్డిని కలిసి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్, చింతకాని తదితర మండలాల్లో గ్రీన్‌ఫీల్డ్ అలైన్‌మెంట్ ... 15లో

అరకొర పరిహారంతోనే సరి..

2019 జూన్ 27న మొదటి గెజిట్ జారీ చేశారు. ఏడాది కాలపరిమితితో కూడిన ఈ గెజిట్ రైతుల ఆందోళనలు, పోరాటాల ఫలితంగా రద్దయింది. తిరిగి 2020 మే 17వ తేదీన కరోనా లాక్‌డౌన్ సమయంలో రెండోసారి భారత రాజపత్రం విడుదలైంది. ఈ మేరకు రైతుల నుంచి భూములు రాబట్టేందుకు జిల్లా అధికారులు విశ్వప్రయత్నం చేశారు. కానీ రైతులు అలైన్‌మెంట్ మార్చండి లేదంటే బహిరంగ మార్కెట్లో ఉన్న ధర ప్రకారం ఎకరం రూ.1.50 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ ఎన్‌హెచ్ అధికారులు రిజిస్ట్రేషన్ విలువపై రెండు రెట్లు మాత్రమే అధికంగా ఇస్తామంటున్నారు. ఎకరం రూ.11 లక్షలు రిజిస్ట్రేషన్ వాల్యూ ఉన్న చోట మార్కెట్ విలువ రూ.3 కోట్లకు పైగా ఉండగా, ఎన్‌హెచ్ అధికారులు రూ.33 లక్షలు మాత్రమే చెల్లిస్తామంటున్నారు.


ఆశలతో అడుగేద్దాం

సంపాదకీయం

'చాపకింద నీరోలే..
చీకట్లు అలుముకోకుండా..
పసిగట్టి ఊడ్చిపారెయ్యాలి..
బంగారానికి మెరుగుపెట్టినట్టు..
పోరాటానికి పుటం పెట్టుకోవాలి..
ఊట చెలిమల్ని తరిమి..
ఊపిరులను ఊదుకోవాలి..
పోరు దారిలో దివిటి లెక్క
వెలుగుపూలై పూయాలి' అని కవి పిలుపిచ్చినట్టు గత స్మృతులను నెమరేస్తూనే కొత్త ఆశలకు ఊపిరి పోసుకోవాలి. అనుభవాల నుండి గుణపాఠాలు నేర్చుకోవాలి. జ్ఞాపకాల్లో ఉండే ప్రయోజనం అదే మరి. ఈ ఉదయం ఒక్కసారి వెనక్కి చూసి ముందుకు పురోగమించాలి. కొత్త వత్సరాన్ని ఉత్సాహంగా పరిగెత్తించాలి.

రాజకీయంగా చూస్తే గత పదేండ్ల నుండి దేశంలో తమకు తిరుగులేదని, తాము చేసిందే శాసనమని విర్ర వీగే మతతత్వ, నిరంకుశ శక్తులకు 2024 ఎన్నికల్లో ప్రజలు కీలెరిగి వాత పెట్టారు. గతేడాది మనకందించిన ఓ స్ఫూర్తిదాయకమైన తీర్పుగా దీన్ని చెప్పుకోవచ్చు. అయితే ఎన్ని వాతలు పెట్టినా కాషాయ దళం మాత్రం ప్రజలను విచ్ఛిన్నం చేసే విధానాల నుండి వెనక్కు తగ్గకపోవడం గమనిం చాల్సిన విషయం. ఫెడరల్ వ్యవస్థకు విఘాతం కలిగించే జమిలి ఎన్నికల అజెండాను పదే పదే ముందుకు తెస్తూనే ఉన్నారు. ఏదో ఒక రూపంలో దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు. న్యాయవ్యవస్థలోనూ మార్పులు తెచ్చారు. కార్మికుల గొంతు కోసేందుకు నాలుగు నల్ల చట్టాలు తెచ్చిపెట్టారు. ఇలా రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానిస్తున్నారు. ప్రజలు గతేడాది ఎంత అప్రమత్తంగా ఉన్నా చాపకింద నీరులా బీజేపీ ప్రభుత్వం తన విధానాలను అమలు చేస్తూనే ఉంది. ఇలా మతోన్మాద ప్రమాదం వెన్నంటే ఉంటూ ప్రజలపై దాడి కొనసాగి స్తోంది. దేశ ఆర్థిక పరిస్థితులూ దిగజారిపోతున్నాయి.

> సీపీఐ(ఎం)కు ప్రతిభావంతంగా నేతృత్వం వహించిన ఏచూరి మరణం దేశ మతో న్మాద వ్యతిరేక ఉద్యమాలకు తీరని నష్టం. ఇటీవల మనల్ని వదిలి వెళ్లిపోయిన లౌకికవాది, మాజీ ప్రధాని మన్మో హన్ మరణం మరో దెబ్బ. అలాగే మన దేశ కళను విశ్వవ్యాపితం చేసిన జాకీర్ హుస్సేన్ మరణం, సినీ ప్రపంచంలో ఓ ప్రత్యామ్నాయానికి మార్గం వేసిన శ్యాంబెనగల్‌లను కోల్పోవడం గతం మిగిల్చిన చేదు జ్ఞాపకాలు. వీరి మరణం దేశ అభ్యుదయ ఉద్యమాలకు, రాజకీయ, కళా రంగాలకు తీరని లోటు.



ఒకవైపు రూపాయి విలువ పాతాళానికి పడిపోతున్నది. మరోవైపు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

గత కాలపు పీడననొకమారు పరామర్శిస్తే.. మహిళలు, బలహీన వర్గాలు, దళితులు, గిరిజనులు, ఆదివాసీలపై దాడులు విపరీతమైన పెరిగిపోయాయి. కోల్‌కతా మహిళా డాక్టర్ ఉదంతం దీనికి ఓ ఉదాహరణైతే.. గురువు చేత విద్యార్థి కాళ్లు పట్టించిన దారుణ ఘటన మన పాలకుల మతోన్మాద విధానాలకు పరాకాష్టగా చెప్పుకోవచ్చు. మణి పూర్ మంటలు ఇంకా చల్లారలేదు. అక్కడి సమస్య రావణకాష్టంలా రగులుతూనే ఉంది. నిజానికి మన పాలకులకు కావల్సింది కూడా ఇదే. కాశ్మీర్‌లో ఉగ్రదాడులూ ఆగలేదు. ఒక్క మన దేశమే కాదు ప్రపంచం యావత్తు అభద్రతలోనే ఉంది. బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం కొనసాగుతుంటే పాలస్తీనా, ఉక్రెయిన్ వంటి దేశాల్లో ఏండ్ల తరబడి సాగుతున్న యుద్ధాలు అక్కడి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ యుద్ధాల్లో బలైపోతుంది సామాన్య, సాధారణ, బలహీన ప్రజలే. అందునా పిల్లలు, మహిళలే. పాలుతాగే పసిపిల్లల శవాలు మన కండ్ల ము ందు నిత్యం కదలాడుతూనే ఉన్నాయి. ఈ అంతర్జాతీయ యుద్ధాలకు సామ్రాజ్య వాదాలు కారణమైతే మన దేశంలో జరుగుతున్న అరాచకాలకు, విధ్వంసాలకు కారకులు ఫాసిస్టు శక్తులుగా ఉన్న మతోన్మాదులనేది జగమెరిగిన సత్యం.

ఇటువంటి పరిస్థితుల్లో సీపీఐ(ఎం)కు ప్రతిభా వంతంగా నేతృత్వం వహించిన ఏచూరి మరణం దేశ మతో న్మాద వ్యతిరేక ఉద్యమాలకు తీరని నష్టం. ఇటీవల మనల్ని వదిలి వెళ్లిపోయిన లౌకికవాది, మాజీ ప్రధాని మన్మో హన్ మరణం మరో దెబ్బ. అలాగే మన దేశ కళను విశ్వవ్యాపితం చేసిన జాకీర్ హుస్సేన్ మరణం, సినీ ప్రపంచంలో ఓ ప్రత్యామ్నాయానికి మార్గం వేసిన శ్యాంబెనగన్‌లను కోల్పోవడం గతం మిగిల్చిన చేదు జ్ఞాపకాలు. వీరి మరణం దేశ అభ్యుదయ ఉద్యమాలకు, రాజకీయ, కళా రంగాలకు తీరని లోటు.

గత అనుభవాలను పరిశీలిస్తే.. ప్రజలు ఎక్కడైతే చైతన్యయుతంగా పోరాటం చేస్తున్నారో అక్కడ పాలకులు వెనకడుగు వేస్తున్నారనేది కూడా గతేడాది నుండి మనం నేర్చుకున్న పాఠం. అక్కడక్కడ తమ పోరాటాలతో ప్రజలు పాలకుల మెడలు వంచుతున్నారనే నిజాన్ని ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవాలి. ఈ పాఠాన్ని మనం 2024 నుండి నేర్చుకోవల్సిన అవసరం ఉంది. రాబోయే కాలంలోనూ పాలకుల విధానాలను తిప్పికొట్టేందుకు పోరాటాలే మార్గమని ఈ అనుభవాలే చెబుతున్నాయి. కనుక గతేడాది ఘటనలు, ప్రభుత్వ విధానాల నుంచి గుణపాఠాలు తీసుకొని, వచ్చే ఏడాదికి మరింత చైతన్యవంతమై పోరాడాల్సిన అవసరం ఉన్నది. ఇదే సందర్భంలో లౌకికశక్తులు మరింత బలపడాల్సిన అవసరమూ కనిపిస్తున్నది. 2025లో మరింత సంఘటితమై ప్రజలు పోరాడకపోతే మరిన్ని దాడులు జరిగే ప్రమాదముంది. ఐక్య పోరాటాలే నేడు ప్రజల ముందున్న కర్తవ్యం.



కొత్తపొద్దు కోసం

ఇవాల్టి దు:ఖం
రేపటికి మాసిపోవాల
అటకెక్కిన ఆనందం
ఒక్కో మెట్టు దిగి రావాల
గలుమ కాడికొచ్చిన కొత్త పొద్దు
తోరణాలు కట్టుకున్న
దర్వాజాను తాకుతూ
నట్టింట్లో నాట్య మాడాల

కొత్తదనపు కుతి తీరేదాకా
పొద్దు తిరుగుడు పువ్వోలె
ఇటు నుంచి అటేపు
పెయ్యిని తిప్పుతూ వుండాల

చాప కింద నీరోలే
చీకట్లు అలుముకోకుండా
పసిగట్టి ఊడ్చి పారేయాల

బంగారానికి వనమ బెట్టినట్టు
పోరాటానికి పుటం బెట్టుకోవాల
మన మాగాణంలో
పిడికెడు మట్టి తొవ్వుకొని
గడ్డిపరకల పక్కనే
గడ్డపారల్ని నాటుకోవాల

ఊట చెలిమల్ని తడిమి
ఊపిర్లను ఊదుకోవాల
బంతికొట్టినట్టు బతుకుల్ని
సుబ్బరంగా దులుపుకోవాల

ఊగి సొలుగుతున్న పెయ్యినీ
నిటారుగా వెన్నుపూసపై
నిలబెట్టుకోవాల
మంచు దుప్పట్ల మధ్య
చలి నెగళ్లు వేసుకున్నట్లు
ఆవరించిన చీకట్లను చీల్చుకొని
పోరు దారిలో దివిటీ లెక్క
వెలుగు పూలై పోయాల
కొత్త పొద్దులో
మనమే కోడై కూయాల...!

- డా.రమేష్ కటుకోర్యువ్వల,
9949083327

ఎత్తిన ఎర్రజెండా దించం అమెరికాకు ఏనాటికీ తలవంచం!



ఎం.కోటేశ్వరరావు
8331013288

క్యూబా సోషలిస్టు విప్లవం 66వ ఏడాదిలో ప్రవేశించింది. 1953 జూలై 26న నియంత బాటిస్టా పాలనకు వ్యతిరేకంగా ప్రారంభమైన తిరుగుబాటు 1959 జనవరి ఒకటిన విప్లవోద్యమ నేత ఫిడెల్ కాస్ట్రో అధికారానికి రావటంతో ముగిసింది. ఐదు సంవత్సరాల, ఐదు నెలల, ఐదవ రోజు 1958 డిసెంబరు 31న బాటిస్టా ప్రభుత్వాన్ని కూల్చివేశారు. విప్లవాన్ని మొగ్గలోనే తుంచి వేసేందుకు వెంటనే అమెరికా ఆర్థిక దిగ్బంధనాన్ని ప్రారంభించి, క్రమంగా తీవ్రతరం కావించింది. నాటి నుంచి నేటి వరకు అక్కడ ఏనుగు పార్టీ (రిపబ్లికన్)-గాడిద పార్టీ(డెమోక్రటిక్) ఎవరు అధికారంలో ఉన్నా మానవాళి చరిత్రలోనే అత్యంత సుదీర్ఘ దిగ్బంధనం కొనసాగుతూనే ఉంది. అమెరికాకు క్యూబా కూతవేటు దూరంలో ఉంది. రెండు దేశాల సమీప భూభాగాల మధ్య దూరం కేవలం 90 మైళ్లు లేదా 145 కిలోమీటర్లు మాత్రమే. కరీబియన్ సముద్ర మెక్సికో అఖాతం, అట్లాంటిక్ మహాసముద్రం కలిసే ప్రాంతంలో ఉన్న కోటీ 12లక్షల జనాభాతో ప్రధాన భూ భాగానికి అనుబంధంగా 4,195 చిన్నా, పెద్ద దీవులు ఉన్న దేశం. నవరంధ్రాలు మూసివేసి ప్రాణాలు తీసినట్లుగా అన్ని రకాల దిగ్బంధాలతో అక్కడి జనాన్ని మాడిస్తే వారు తిరుగుబాటు చేసి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చివేసి తమ ఒడిలో కూర్చుంటారని 65 ఏండ్లుగా అమెరికా చూస్తున్నది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అగ్రరాజ్యానికి తలొగ్గకుండా ఆత్మగౌరవంతో పితృదేశమా (కొన్ని దేశాలు పితృసామిక వ్యవస్థను అనుసరించి అలా పిలుచుకుంటాయి.దేశ భక్తిలో ఎలాంటి తేడా ఉండదు) లేక మరణమా అన్న ఆశయంతో ముందుకు సాగుతున్నది.

క్యూబా విప్లవానికి ఒక ప్రత్యేకత ఉంది. కమ్యూనిస్టుల నాయకత్వాన విముక్తి పోరాటాలు జరగటం అధికారానికి రావటం సాధారణంగా జరిగింది. అదే క్యూబాలో అధికారానికి వచ్చిన తరువాత కాస్ట్రో తదితర విప్లవకారులు కమ్యూనిస్టులుగా మారారు.1952లో ఎన్నికల ద్వారా పాలకులను ఎన్నుకోవటాన్ని సహించని మిలిటరీ జనరల్ ఫల్జునేసియో బాటిస్టా కుట్రద్వారా అధికారాన్ని స్వాధీనం చేసుకున్నాడు. దాన్ని వ్యతిరేకించిన ప్రజాస్వామికవాదుల్లో కాస్ట్రో ఒకరు. కొంత మంది కోర్టులో సవాలు చేసి బాటిస్టాను గద్దె దింపాలని చూసి విఫలమయ్యారు.తరువాత 1953 జూలై 26న సోదరుడు రావుల్‌తో కలసి కాస్ట్రో తదితరులు మంకాడా మిలిటరీ బారక్స్ మీద విఫల దాడి చేశారు. దాంతో వారందరినీ అరెస్టు చేసి జైల్లో పెట్టారు. అక్కడే జూలై 26 ఉద్యమం పేరుతో సంఘటితమయ్యారు. కేసు విచారణ సందర్భంగా కోర్టులో రెండు గంటల పాటు కాస్ట్రో తిరుగుబాటు కారణాలను వివరించి దేశమంతటా ప్రాచుర్యం పొందారు.పౌరుల్లో వచ్చిన సానుభూతిని చూసిన తరువాత తిరుగుబాటు చేసిన వారిని విడుదల చేసి ప్రజామద్దతు పొందాలని బాటిస్టా క్షమాభిక్ష ప్రకటించాడు. విప్లవకారులు మెక్సికో, తదితర దేశాలకు ప్రవాసం వెళ్లి 1956లో తిరిగి గ్రాన్మా అనేక నౌకలో తిరిగొచ్చారు.(తరువాత కాలంలో ఆ నౌక పేరుతోనే పత్రిక నడుపుతున్నారు) మెక్సికోలో పరిచయమైన చే గువేరా కూడా వారితో వచ్చాడు. బాటిస్టా మిలిటరీ వారిని ఎదుర్కోవటంతో సియెరా మెస్ట్రా అనే ప్రాంతానికి వెళ్లి అక్కడ బాటిస్టాను వ్యతిరేకించే పాపులర్ సోషలిస్టు పార్టీ వంటి వారందరినీ కూడా గట్టి దాడులకు దిగారు.చివరికి 1958 డిసెంబరు 31న విజయం సాధించటంతో బాటిస్టా దేశం వదలి పారిపోయాడు. 1959 జనవరి ఒకటిన కాస్ట్రో అధికారానికి వచ్చాడు.జూలై 26 ఉద్యమం పేరుతో ఉన్న వారు కీలక పాత్ర పోషించారు. తర్వాత మార్క్సిజం-లెనినిజాన్ని ఆమోదించి 1965 అక్టో బరులో క్యూబా కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారు. అయితే విప్లవంలో కీలక ఘట్టమైన జూలై 26వ తేదీని విప్లవదినంగా పరిగణించారు.

'మేం వైద్యులను ఎగుమతి చేస్తాం, తప్ప బాంబులను కాదని' అర్జెంటీనా రాజధాని బ్యూనోస్‌ఎయిర్స్ నగరంలో 2003లో క్యూబా అధినేత ఫిడెల్ కాస్ట్రో చెప్పాడు. 'మా దేశం ఇతర దేశాల పౌరుల మీద బాంబులు వేయదు లేదా నగరాల మీద బాంబులు వేసేందుకు వేలాది విమానాలను పంపదు. మాకు అణు, రసాయన లేదా జీవ ఆయుధాలు లేవు. ప్రాణాలను రక్షించేందుకు లక్షలాది మంది వైద్యులను మా దేశంలో తయారు చేశాము. మనుషులను చంపే బాక్టీరియా, వైరస్, ఇతర పదార్థాలను సృష్టించేందుకు శాస్త్రవేత్తలు, వైద్యులను తయారు చేయాలనే అవగాహనకు భిన్నంగా మేము పని చేస్తున్నాము' అని కాస్ట్రో ఆ సభలో చెప్పాడు. హవానా నగరంలో నిర్వహిస్తున్న లాటిన్ అమెరికా మెడికాలేజీ 25వ వార్షికోత్సవాన్ని నవంబరు నెలలో నిర్వహించారు. "జీవిత సంరక్షకులు-మెరుగైన ప్రపంచ సృష్టికర్తలు" అనే ఇతివృత్తంతో ఒక సదస్సును ఏర్పాటు చేశారు. సామాన్య జనం కోసం వైద్యం చేయాలనే లక్ష్యంతో అనేక దేశాల నుంచి విద్యార్థులు అక్కడ చేరుతున్నారు. కరీబియన్ ప్రాంతం లోని దేశాలకు తరచూ వస్తున్న హరికేన్‌ల వలన జరుగు తున్న అపార నష్టాన్ని చూసిన తరువాత అలాంటి సమయాల్లో వైద్యుల అవసరాన్ని గుర్తించి ఈ కాలేజీని ప్రారంభించారు. మొత్తం లాటిన్ అమెరికా, కొందరు ఆఫ్రికా, అమెరికా నుంచి కూడా వచ్చి చేరుతున్నారు.

గత పాతికేండ్లలో 120దేశాలకు చెందిన వారు 31,180 మంది వైద్యులుగా తయారు కాగా ప్రస్తుతం 1,800 మంది విద్యార్థులు న్నారు. హవానాకు పశ్చిమంగా ఉన్న నౌకా కేంద్రాన్ని కాలేజీగా మార్చారు. మొదటి రెండేండ్లు అక్కడ ఆసుపత్రులతో అవసరం లేని బోధన చేస్తారు. నాలుగేండ్ల పాటు క్యూబాలోని బోధనా ఆసుపత్రు లలో శిక్షణ ఇస్తారు. ఈ కాలేజీ విద్యార్థి, ప్రస్తుతం హోండూరాస్‌లో శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రిగా పని చేస్తున్న లూథర్ కాస్టిల్లో హారీ పాతికేండ్ల వార్షికోత్సవంలో మాట్లాడుతూ అసాధ్యాలకు వ్యతిరేకంగా పోరాడినపుడే సుసాధ్యాలతో లబ్ధి పొందుతామని, ప్రతి ఒక్కరూ క్యూబా విప్లవ రాయబారిగా పనిచేస్తూ ప్రపంచంలో అతి గొప్ప శాస్త్రీయ సంస్థను ఏర్పాటు చేయాలని ఆకాంక్షించాడు. హరికేన్ కారణంగా చేపడుతున్న సహాయ చర్యల కారణంగా ఈ ఉత్సవానికి హాజరు కాలేకపోయిన క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్ సందేశాన్ని పంపారు. మీ మీ దేశాలలో జీవితాల, ఆరోగ్య సంరక్షకులుగా తయారైన మిమ్మల్ని చూసి ఫిడెల్ కాస్ట్రో బతికి ఉంటే ఎంతో సంతోషించేవారన్నాడు. మూడంచెల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో భాగంగా 69 వైద్య ప్రత్యేక చికిత్స కేంద్రాలు, 149 ఆసుపత్రులు, 451పాలిక్లినిక్‌లు, 11,315 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో నాలుగు లక్షల మంది సిబ్బంది పని చేస్తున్నారు. ప్రతివెయ్యి మందికి -మొత్తం 80వేల మంది-ఒక వైద్యుడు లేదా వైద్యురాలు ఉన్నారు. పదమూడు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి, 2,767 వైద్య పరిశోధనా ప్రాజెక్టులు, 82క్లినికల్ ప్రయోగాలు నడుస్తున్నాయి. నూటఅరవై దేశాలలో ఆరులక్షల మంది క్యూబన్లు వైద్య సేవలందిస్తున్నారు.

క్యూబా సర్కార్ జనానికి అందిస్తున్న సబ్సిడీ ఆహార పథకాన్ని 'అదిగో రద్దు చేస్తున్నారు ఇదిగో రద్దు చేస్తున్నారంటూ' గత రెండు దశాబ్దాలుగా అమెరికా, దాని ఉప్పు తింటున్న మీడియా కథనాలు రాస్తూనే ఉంది. కొన్ని సందర్భాలలో దుర్వినియోగం జరిగినపుడు పథకాన్ని సవరించటం గురించి మాట్లాడారు తప్ప ఎత్తివేత గురించి కాదు. ఉదాహరణకు ప్రతినెలా 18 ఏండ్లు దాటిన వారికి ఆహార వస్తువులతో పాటు 80 సిగరెట్లు కూడా నామమాత్ర ధరలకు సరఫరా చేసే వారు. కొందరు పొగతాగని వారు వాటిని తీసుకొని బహిరంగ మార్కెట్లో విక్రయించి సొమ్ము చేసుకొనే వారు. ఇలాంటి వాటిని అరికట్టాలను కోవటం సబ్సిడీ ఎత్తివేత కిందకు రాదు. సోవియట్, ఇతర తూర్పు ఐరోపా సోషలిస్టు రాజ్యాలు కూలిపోయిన తరువాత క్యూబా అనేక తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నమాట నిజం. అవి ఉనికిలో ఉన్నపుడు కూడా ఉన్నదేదో కలసి తింటాం లేకుంటే కాళ్లు ముడుకు పడుకుంటాం తప్ప అమెరికా ముందు చేయిచాచం అని ఫిడెల్ కాస్ట్రో దశాబ్దాల క్రితమే చెప్పారు. దానిలో భాగంగానే ఆహార సబ్సిడీ-పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. దాన్నే రేషన్ బుక్ అని పిలుస్తున్నారు. ప్రతి ఏటా ఒక పుస్తక రూపంలో కూపన్లు ఇస్తే దుకాణాల్లో వాటితో సరకులు తీసుకుంటారు.1962 నుంచి ఈ పథకం అమల్లో ఉంది.ప్రతి ఒక్కరికీ ప్రతినెలా బియ్యం, బీన్స్, బంగాళాదుంప, అరటికాయలు, బఠాణీ గింజలు, కాఫీ, వంటనూనె, గుడ్లు, మాంసం, కోడి మాంసం, పిల్లలకు పాలు సరఫరా చేస్తున్నారు.2010 వరకు సబ్సిడీ ధరలకు సిగిరెట్లు కూడా సరఫరా చేశారు. ఈ మధ్య పోషకాహారలేమి వలన క్యూబాలో మరణాల రేటు 2022 నుంచి 2023కు 74.42శాతానికి పెరిగిందంటూ కొన్ని పత్రికలు పతాక శీర్షికలతో వార్తలను ఇచ్చాయి.అక్కడ సంభవిస్తున్న మరణాలకు కారణాలలో పోషకాహార లేమి 20వదిగా ఉంది. ఇంతకూ పైన పేర్కొన్న సంవత్సరాలలో మరణించిన వారి సంఖ్య 43నుంచి 75కు పెరిగింది (74.42 శాతం). కోటి మంది జనాభా, అష్టకష్టాలు పడుతూ,80శాతం ఆహారాన్ని దిగుమతి చేసుకుంటున్న అక్కడ మరణాలు అవి. ప్రపంచానికి ఆహారాన్ని అందచేసే స్థితిలో ఉన్నామని మన ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించిన మన దేశంలో 140 కోట్ల జనాభాలో పోషకాహార లేమి కారణంగా ఎందరు మరణిస్తున్నారో తెలుసా! హిండ్‌రైజ్ డాట్ ఓఆర్‌జి సమాచారం ప్రకారం మనదేశంలో రోజుకు ఏడువేల మంది మరణిస్తున్నారు. ఐదేండ్లలోపు వయస్సున్న పిల్లల మరణాలలో 69శాతం పోషకాహార లేమి కారణమని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా సుప్రీంకోర్టుకు 2022లో తెలిపింది.ఒక సోషలిస్టు వ్యవస్థకు అంతకంటే మెరుగైనది సర్వేజనా సుఖినో భవంతు సమాజం ఉంది అనుకుంటున్న మన వ్యవస్థకు ఉన్న అంతరం ఏమిటో వేరే చెప్పాలా?



క్యూబా సోషలిస్టు విప్లవానికి 65 ఏండ్లు

> ప్రపంచానికి ఆహారాన్ని అందచేసే స్థితిలో ఉన్నామని మన ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించిన మన దేశంలో 140 కోట్ల జనాభాలో పోషకాహార లేమి కారణంగా ఎందరు మరణిస్తున్నారో తెలుసా! హిండ్‌రైజ్ డాట్ ఓఆర్‌జి సమాచారం ప్రకారం మనదేశంలో రోజుకు ఏడువేల మంది మరణిస్తున్నారు. ఐదేండ్లలోపు వయస్సున్న పిల్లల మరణాలలో 69శాతం పోషకాహార లేమి కారణమని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా సుప్రీంకోర్టుకు 2022లో తెలిపింది.ఒక సోషలిస్టు వ్యవస్థకు అంతకంటే మెరుగైనది సర్వేజనా సుఖినోభవంతు సమాజం ఉంది అనుకుంటున్న మన వ్యవస్థకు ఉన్న అంతరం ఏమిటో వేరే చెప్పాలా?

మన దేశంలో ఆహార భద్రతా చట్టం అమల్లో ఉంది. దానిలో భాగంగా 80 కోట్ల మందికి గతంలో సబ్సిడీ బియ్యం లేదా గోధుమలు ఇవ్వగా ఇప్పుడు ఉచితంగా ఇస్తున్నారు. అయినా మనదేశం 2024 ప్రపంచ ఆకలి సూచిక 127దేశాలలో 105వదిగా ఉంది. పదేండ్ల అచ్చేదిన్‌లో ఆకలి తీవ్రంగా ఉన్న దేశాల సరసన మనదేశాన్ని ఉంచిన ఘనత 'విశ్వగురువు' నరేంద్రమోడీకి దక్కింది. వరల్డ్ పాపులేషన్ రివ్యూ డాట్‌కామ్ సమాచారం ప్రకారం 171దేశాల జాబితాలో మన దేశంలో పోషకాహార లోపం ఉన్నవారు 2011లో 18.35 కోట్ల మంది ఉంటే, 2023లో 19.46 కోట్ల మందికి పెరిగారు. నిజానికి ఈ సంఖ్య ఇంకా ఎక్కువ. పోషకాహార లేమి నామమాత్రంగా ఉన్నప్పటికీ ఆయా దేశాలలో 2.5శాతం మంది ఉన్నట్లు లెక్కిస్తారు. అలాంటి దేశాల జాబితాలో చైనా, క్యూబా ఇంకా అనేక దేశాలు ఉన్నాయి. మనదేశంలో పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ దాన్ని గుర్తించటానికి మోడీ సర్కార్ ససేమిరా అంటున్నది. క్యూబా ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారటానికి, ఇతర సమస్యలకు కారణం అమెరికా విధించిన ఆర్థిక దిగ్బంధనమే. ఆంక్షలను తొలగించాలని ప్రతియేటా ఐరాసలో తీర్మానం పెట్టటం, అమెరికా, దాని తొత్తు ఇజ్రాయిల్ వ్యతిరేకించటం మిగిలిన దేశాలన్నీ సమర్థించటం తెలిసిందే. అయితే ఐరాస సాధారణ అసెంబ్లీ తీర్మానాలకు పూచికపుల్ల పాటి విలువ కూడా లేదు. వాటిని దిక్కరించిన దేశాలను చేసేదేమీ లేదు. అమెరికా దిగ్బంధనం వలన ప్రపంచంలో మరోదేశమేదీ క్యూబా మాదిరి నష్టపోవటం లేదు. ఎందుకు ఇలా జరుగుతోంది ? ప్రపంచ మంతటా కమ్యూనిజాన్ని అరికడతానంటూ బయలు దేరిన అమెరికన్లకు తమ పెరటితోట వంటి క్యూబాలో కమ్యూనిస్టులు అధికారంలో ఉండటం అవమాన కరంగా మారింది. గతంలో డోనాల్డ్ ట్రంప్ అమలు జరిపిన కఠిన ఆంక్షలను సడలిస్తానని జో బైడెన్ ప్రకటించినప్పటికీ అలాంటిదేమీ జరగలేదు, పదవీ కాలం ముగియనుంది, తిరిగి ట్రంప్ గద్దె నెక్కనున్నాడు. అమెరికా దిగ్బంధనం కారణంగా ప్రతి నెలా క్యూబా 42 కోట్ల డాలర్లు నష్టపోతున్నదని అంచనా, ఎన్నాళ్లీ దుర్మార్గం!

రైల్వే రహస్య బ్యాలెట్ ఎన్నికలు- రెండు సీఐటీయూ యూనియన్ల గుర్తింపు

ఆర్.ఇలంగోవన్

సీఐటీయూ అనుబంధ సంఘమైన దక్షిణ్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ (డీఆర్ఈయూ) దాఖలు చేసిన కేసును అనుసరించి రైల్వే ట్రేడ్ యూనియన్‌ల గుర్తింపు (భారతీయ రైల్వేలో సభ్యత్వం ధృవీకరణ) కోసం రహస్య బ్యాలెట్ ఎన్నికలను నిర్వహించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ ఎన్నికలు 2024 డిసెంబర్ 4,5,6 తేదీల్లో పదిహేడు జోన్లతో పాటు రెండు ఉత్పత్తి యూనిట్లు చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ అండ్ రైల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలాలలో జరిగాయి.సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2007 నుంచి భారతీయ రైల్వేలో రహస్య బ్యాలెట్ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 2013లో రెండోసారి ఎన్నికలు జరగ్గా, నిర్ణయించిన విధివిధానాల ప్రకారం మూడవ ఎన్నికలు 2019లో జరగాల్సి ఉంది. అయితే 2020 పారిశ్రామిక సంబంధాల కోడ్‌పై ఆధారపడి గుర్తింపు కోసం నిబంధనలు ఉండాలనే సాకుతో రైల్వే మంత్రిత్వ శాఖ ఎన్నికలను నిర్వహించకూడదని భావించింది. కానీ కార్మిక సంఘాల నుండి తీవ్ర వ్యతిరేకత రావటంతో రాష్ట్ర ప్రభుత్వాలు నిబంధనలను తయారు చేయలేదు. ఫలితంగా కేంద్రం తమ ఆలోచనను అమలు చేయలేక పోయింది. ఇప్పటికే ఉన్న నిబంధనల ఆధారంగా ఎన్నికలను నిర్వహించాలని డీఆర్ఈయూ అభ్యర్థించడానికి ఈ జాప్యం వెసులుబాటు కల్పించింది. వర్షాకాలం, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, గూడ్స్ కార్యకలాపాలు ఉధృతంగా ఉండటం మొదలైన కారణాలను చూపుతూ ఎన్నికలను వాయిదా వేయడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఎంతో ప్రయత్నించినప్పటికీ, చివరికి ఎన్నికలను నిర్వహించాలని కోర్టు ఆదేశించింది.

నిబంధనల ప్రకారం, నిర్దిష్ట పరిస్థితులలో రెండు యూనియన్లను గుర్తించవచ్చు. అవి ప్రధానంగా రైల్వే జోన్ లేదా ప్రొడక్షన్ యూనిట్‌లో మొత్తం ఓటర్లలో ముప్పై శాతం ఓట్లను రెండు యూనియన్‌లు పొందినట్లయితే, రెండూ గుర్తించబడతాయి. ఒక యూనియన్ మొత్తం ఓటర్లలో ముప్పై శాతం సాధించి, మరొక యూనియన్ పోలైన చెల్లుబాటయ్యే ఓట్లలో 35 శాతం సాధించినట్లయితే కూడా రెండు యూనియన్లు గుర్తించబడతాయి. మొత్తం ఓటర్లలో పదిహేను శాతం ఓట్లు పొందిన యూనియన్‌కు నోటీసు బోర్డులను పెట్టుకోవటానికి, గేట్ మీటింగ్‌లను నిర్వహించడానికి అర్హత లభిస్తుంది. ఈ నిబంధన చిన్న సంఘాలకు ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, ప్రధానంగా ఆరెస్సెస్ మద్దతు గల భారతీయ రైల్ మజ్దూర్ సంఘ్ (బీఆర్ఎంఎస్)కు అనుకూలంగా ప్రవేశపెట్టబడింది.భారతీయ రైల్వే ఎన్నికల్లో ప్రధాన పోటీదారులు ఎఐఆర్ఎఫ్‌తో పాటు ఎన్ఎఫ్ఐఆర్ యూనియన్లు.ఎఐఆర్ఎఫ్ అనేది హెచ్ఎంఎస్‌కి అనుబంధంగా ఉండగా, ఎన్ఎఫ్ఐఆర్-ఐఎన్‌టీయూసీకి అనుబంధం. ఈ రెండు ఫెడరేషన్లు ఎన్నికలు లేకుండానే గుర్తింపు హోదాను కొనసాగించాయి. ఇది రైల్వే కార్మికులలో వాటి అపకీర్తికి దారితీశాయి. అవి ఏకీకృత పెన్షన్ స్కీమ్ అండ్ నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్)కి మద్దతు ఇస్తున్నాయి. అలాగే ప్రయివేటీకరణ, ఔట్ సోర్సింగ్, ఖాళీలను భర్తీ చేయకపోవడం, పోస్టులను సృష్టించటంపైన నిషేధం, భద్రతా నిబంధనల ఉల్లంఘనలను సమర్థవంతంగా ప్రతిఘటించ లేదని, పెట్టుబడి విస్తరణ, భద్రత కోసం మౌలిక సదుపాయాలు కల్పనా కోసం డిమాండ్ చేయటంలో విఫలమైనట్టు విమర్శలెదుర్కొన్నాయి.

మరో ఫెడరేషన్, భారతీయ రైల్ మజ్దూర్ సంఘ్ (బీఆర్ ఎంఎస్), ఆరెస్సెస్ అనుయాయి అయిన బీఎంఎస్‌కి అను బంధంగా ఉంది. రైల్వేలో దీని ఉనికి చాలా తక్కువ. అయిన ప్పటికీ, బీఆర్ఎంఎస్‌కి మద్దతివ్వాలని రైల్వే మంత్రి అఖిల భారత ఎస్సీ,ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్‌తో అఖిల భారత ఓబీసీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్‌ను ఆదేశించి నట్టు సమాచారం. అనేక రైల్వే జోన్లలో బలమైన ప్రత్యామ్నాయం లేకపోవడంతో, ఎఐఆర్ఎఫ్, ఎన్ఎఫ్ఐఆర్ ఒక్కొక్కటి పదమూడు రైల్వే జోన్లలో గుర్తింపు పొంద గలిగాయి. నిబంధనల ప్రకారం ఈ రెండు ఫెడరేషన్లు గుర్తింపు పొందుతాయి, ఒక సమాఖ్య కనీసం ఆరు రైల్వేలలో గుర్తింపు పొందాలి. అలాగే భారతీయ రైల్వేలలో పోల్ చేయబడిన మొత్తం చెల్లుబాటయ్యే ఓట్లలో పదిహేను శాతం గుర్తింపు పొందాలి.భారతీయ రైల్వేలతో పాటు ఉత్పత్తి యూనిట్లలో రెండు సీఐటీయూ అను బంధ సంఘాలున్నాయి. దక్షిణరైల్వేలో దక్షిణ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ (డీఆర్ఈయు) అండ్ చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్‌లో చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ లేబర్ యూనియన్ (సీఎల్‌డబ్ల్యూఎల్‌యూ) ఈ ఎన్నికల్లో రెండు యూనియన్లు మంచి గుర్తింపు తెచ్చుకున్నాయి.



దక్షిణ్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ (డిఆర్ఈయు) అనేది 1918లో స్థాపించబడిన ఒక చారిత్రాత్మక యూనియన్. 106 ఏండ్లు పూర్తిచేసుకుంది. స్వాతంత్ర్య పోరాటాన్ని కార్మికుల డిమాండ్లతో ముడిపెట్టి, రాజీలేని పోరాటాలను ప్రారంభించిన గొప్ప వారసత్వం ఈ యూనియన్‌కు ఉన్నది. స్వాతంత్ర్యా నంతరం, రైల్వే కార్మికుల సమస్యలను నిరంతరం పరిష్కరి స్తూనే, డిఆర్ఈయు కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటంలో అగ్రగామిగా నిలిచింది. యూనియన్ నేషనల్ పెన్షన్ స్కీమ్(ఎన్‌పిఎస్) యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్), ప్రయివేటీకరణ, ఔట్ సోర్సింగ్ వంటి నయా ఉదారవాద విధానాలకు వ్యతిరే కంగా వివిధ పోరాటాలకు నాయకత్వం వహించింది. రైల్వే చట్టం కింద పెద్ద సంఖ్యలో రిక్రూట్ చేయబడిన క్యాజువల్ కార్మికులను పర్మినెంట్ చేయటంలోనూ, అలాగే అప్రెంటీస్‌ల ఉపాధి అవకాశాలను మెరుగుపరచటంలోనూ విజయ వంతమైన పాత్ర పోషించింది.

> భారతీయ రైల్వే ఎన్నికలలో ప్రధాన పోటీదారులు ఎఐఆర్ఎఫ్‌తో పాటు ఎన్ఎఫ్ఐఆర్ యూనియన్లు.ఎఐఆర్ఎఫ్ అనేది హెచ్ఎంఎస్‌కి అనుబంధంగా ఉండగా, ఎన్ఎఫ్ఐఆర్-ఐఎన్‌టీయూసీకి అనుబంధం. ఈ రెండు ఫెడరేషన్లు ఎన్నికలు లేకుండానే గుర్తింపు హోదాను కొన సాగించాయి. ఇది రైల్వే కార్మికులలో వారి అపకీర్తికి దారితీశాయి.

ఈ కృషి 2007 మొదటి రహస్య బ్యాలెట్ ఎన్నికలతో పాటు ఇప్పుడు మూడో ఎన్నికల్లోనూ డిఆర్ఈయు విజయం సాధించడంలో తోడ్పడింది. ఎఐఆర్ దాని అనుబంధ సంస్థ ఎస్ఆర్ఎంయు కార్మిక వ్యతిరేక వైఖరి కార్మికుల్లో బట్టబయలవటంతో డిఆర్ఈయు విజయానికి దోహదపడింది. ఈ ఎన్నికలలో, డిఆర్ఈయుకి ఆలిండియా స్టేషన్ మాస్టర్స్ అసోసియేషన్ (ఎఐఎస్ఎంఎ), ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఎఐఎల్ఆర్ఎస్ఎ), ఆర్ఎల్ఎల్ఎఫ్ (విసికె పార్టీతో అనుబంధం) సహా తొమ్మిది యూనియన్లు మద్దతిచ్చాయి. కేవలం పదిహేనువేల సభ్యత్వం మాత్రమే ఉన్న డిఆర్ఈయు ఈ ఎన్నికల్లో 26,151 ఓట్లను సాధించింది. ఇది మొత్తం 76,653 మంది ఓటర్లలో 34.11 శాతం. అయితే, దీనికి విరుద్ధంగా ఎఐఆర్ఎఫ్-అనుబంధ ఎస్ఆర్ఎంయు, ఓట్లను పొందేందుకు నగదు, బిర్యానీ, మద్యాన్ని పంపిణీ చేసినట్లు ఆరోపణలు వచ్చినప్పటికీ, డిఆర్ఈయు కంటే 107 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో 34.25 శాతం సాధించగలిగింది. ఇది 2013 ఎన్నికల్లో ఎస్ఆర్ఎంయు 43 శాతం ఓట్లతో ఏకైక యూనియన్‌గా అవతరించినప్పటికీ, తమ ఆధిపత్యం కోల్పోయినట్టు ఇది సూచిస్తుంది.

ఎన్ఎఫ్ఐఆర్ (ఐఎన్‌టీయూసీ యూనియన్) అనుబంధ సంస్థ ఎస్ఆర్ఈఎస్- ఎఐఆర్ఎఫ్ యూనియన్‌కు తానే ప్రత్యర్థిగా ప్రచారం చేసుకునప్పటికీ, కేవలం పదహారు శాతం ఓట్లను మాత్రమే సాధించింది. వరుసగా మూడో ఎన్నికల్లో గుర్తింపు సాధించడంలో విఫలమైంది. ఎస్సీ,ఎస్టీ యూనియన్ మద్దతు తీసుకొని కూడా బీఆర్ఎంఎస్(ఆరెస్సెస్ మద్దతుగల) కార్మిక సంఘ్ కేవలం నాలుగు శాతం ఓట్లను మాత్రమే సాధించింది.భారీ వర్షం ఉన్నప్పటికీ 2024 డిసెంబర్ 18న చెన్నైలోని జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద భారీ విజయోత్సవ ర్యాలీతో పాటు బహిరంగ సభ జరిగింది. సమావేశానికి వర్కింగ్ ప్రెసిడెంట్ జానకిరామన్ అధ్యక్షత వహించారు. సమావేశంలో మాజీ ఎంపీ టి.కె. రంగరాజన్, జి సుకుమారన్, అధ్యక్షుడు, సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎ కె పద్మనాభన్, డిఆర్ఇయు ప్రధాన కార్యదర్శి వి హరిలాల్ ప్రసంగించారు. దక్షిణ రైల్వేలోని కార్మికులందరి సంక్షేమం కోసం కృషి చేస్తామని నేతలందరూ హామీ ఇచ్చారు. చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ (సిఎల్‌డబ్ల్యూ, సిఎల్‌డబ్ల్యూ లేబర్ యూనియన్ (సిఎల్‌డబ్ల్యూఎల్‌యు) 7,551కి 3,026 ఓట్లను (43.2శాతం) సాధించింది. ఎఐఆర్ఎఫ్- అనుబంధ యూనియన్ 138 ఓట్లను మాత్రమే సాధించింది అయితే ఎన్ఎఫ్ఐఆర్-అనుబంధ యూనియన్ 2,895 ఓట్లను (41శాతం) పొందింది. యూనియన్ కోర్టు విజయం తర్వాత గుర్తింపు కోసం ఎన్నికలను తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇది సిఎల్‌డబ్ల్యూలో మొదటి రహస్య బ్యాలెట్ ఎన్నికగా గుర్తించబడింది.

సిఎల్‌డబ్ల్యూను ప్రభుత్వ రంగంలో నిలుపుకోవాలనే పోరాటంలో సీఐటీయూ అనుబంధ యూనియన్‌గా సిఎల్‌డబ్ల్యూఎల్‌యూ అగ్రగామిగా నిలిచింది. ఇది కార్మికుల హక్కులను నిరంతరం సమర్థించింది. ఎఐఆర్ఎఫ్ అండ్ ఎన్ఎఫ్ఐఆర్ ప్రభుత్వ అనుకూల విధానాలను బహిర్గతం చేసింది. కేంద్ర ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలను గట్టిగా వ్యతిరేకించింది. అందుకే కార్మికులు సిఎల్‌డబ్ల్యూ ఎల్‌యూకు ఫెడరేషన్ లేకపోయినా అత్యధికంగా ఓట్లు వేశారు. డిఆర్ఈయుతో పాటు సీఎల్‌డబ్ల్యూఎల్‌యూ రెండూ ఇప్పుడు రైల్వే కార్మికులను సంఘటితం చేయటంలో ప్రత్యామ్నాయాలుగా ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయి. ప్రయివేటీకరణ, నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్), యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ని నిరోధించడంతో పాటు ఇతర కేంద్ర ప్రభుత్వ సంఘాలతో కలిసి ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు కోసం ప్రయత్నించడం ఇప్పుడు వాటి ముందున్న ప్రధాన లక్ష్యం.

అనువాదం : పద్మశ్రీ, 9490098687

మార్చి నాటికి ఎస్ఎల్‌బీసీ పనులు ప్రారంభిస్తాం

- 4 లక్షల ఎకరాలకు సాగునీరు, నల్లగొండకు తాగునీరు అందిస్తాం
- లిఫ్టుల కోసం రూ.45 కోట్లు మంజూరు
- కుట్రపూరితంగా నిర్లక్ష్యం చేసి రైతులకు ద్రోహం చేసిన బీఆర్ఎస్ : నల్లగొండ పార్లమెంటు పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి కోమటిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మార్చినాటికి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు ప్రాంతానికి బేరింగ్ తెచ్చి పనులను పున్ణ ప్రారంభిస్తామని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నాలుగు లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా సాగునీరు, నల్లగొండ జిల్లాకు తాగునీరు ఇచ్చే ప్రాజెక్టు అని చెప్పారు. బ్రాహ్మణవెల్లంల ద్వారా లక్ష ఎకరాలకు నీరు అందిస్తామని వివరించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌ను ప్రారంభించారని అన్నారు. ఎస్-ఎల్‌బీసీ, బ్రాహ్మణవెల్లంల, గందమల్ల ప్రాజెక్టులు పూర్తయితే నల్లగొండ జిల్లా ఉభయగోదావరి జిల్లాలను మరిపిస్తదని చెప్పారు. మంగళవారం నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష అనంతరం మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ్ కుమార్ రెడ్డి సాగునీటి పారుదలశాఖ మంత్రి అయిన తర్వాత నల్లగొండ ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని అన్నారు. ఒక పక్క గత ప్రభుత్వం నీటిపారుదల శాఖలో చేసిన విధ్వంసాలను సరిదిద్దుతూ మరోపక్క సాగునీటి ప్రాజెక్టులను నిర్మించే పని చేస్తున్నారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల తెలంగాణ రూ.లక్షన్నర కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. అది కూలిపోయిన సందర్భంలో తదుపరి చేపట్టాల్సిన చర్యలపై దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీర్లు, నిపుణులతో మాట్లాడారనీ, సాగునీటి శాఖను సమర్థంగా నడిపిస్తున్నారని వివరించారు. 70 శాతం పూర్తయిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పూర్తి చేయడానికి గత ప్రభుత్వం మీనమేషాలు లెక్కించిందన్నారు. దీంతో గత పదేండ్లలో 10 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం కూడా పూర్తి కాలేదని చెప్పారు. అదే పూర్తయితే, గతేడాది నల్లగొండ జిల్లాలో మూడు లక్షల ఎకరాలకు క్రాప్ హాలీడే ప్రకటించే అవసరముండేది కాదన్నారు. శ్రీశైలంలో డెడ్ స్టోరేజీ ఉన్నా సొరంగం నుంచి నల్లగొండకు నీళ్లిచ్చే ప్రాజెక్టు ఇదని అన్నారు. 2005లో తాను వైఎస్ రాజశేఖర్ రెడ్డితో కొట్లాడి ఈ ప్రాజెక్టును మంజూరీ చేయించానని గుర్తు చేశారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగా నిర్లక్ష్యం చేసి నల్లగొండ రైతులకు ద్రోహం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం మళ్లీ వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బేరింగ్ సమకూర్చేందుకు తనను అమెరికా పంపించారని అన్నారు. తాను అక్కడ రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మిషన్ సంస్థతో మాట్లాడి బేరింగ్ ఏర్పాటు చేశానని వివరించారు. ప్రస్తుతం బేరింగ్ షిప్ ద్వారా అమెరికా నుంచి వస్తున్నదనీ, జనవరి చివరలో చెన్నై షిప్ యార్డ్‌కు చేరుకుంటుందని చెప్పారు. వచ్చే మార్చినాటికి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు ప్రాంతానికి బేరింగ్ తెచ్చి పనులు పున్ణ ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో లిఫ్టుల కోసం రూ.45 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ఇవన్నీ త్వరలోనే పూర్తిచేసి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని అన్నారు. 1.52 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండించడం ద్వారా తెలంగాణ దేశంలో నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. కేసీఆర్ రూ.లక్షన్నర కోట్లు ఖర్చుపెట్టి కాళేశ్వరం కడితే.. కేవలం 96 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు మాత్రమే నీళ్లిచ్చారని చెప్పారు. ఆర్ఆర్ఆర్ భూసేకరణ, విషయంలో మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలపై విలేకర్లు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ ఆయన మంత్రిగా ఎప్పుడూ పనిచేయలేదని కోమటిరెడ్డి సమాధానమిచ్చారు. ఆయన కేసీఆర్ యజ్ఞయాగాలు, పూజలు పునస్కారాలు, హోమాలను చూసిన దేవాదాయశాఖ మంత్రిగా వ్యవహరించారని అన్నారు. ఆయన యుటిలిటీ ఛార్జీలు కట్టకుంటే ప్రాజెక్టు ఆగిపోయిందనీ, తాను వెళ్లి గడ్కరీని విజ్ఞప్తి చేసి ప్రాజెక్టును పట్టాలెక్కించానని వివరించారు. కేటీఆర్‌పై విలేకరులు అడిగిన ప్రశ్నలకు చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా ప్రశాంతంగా గడపనీయండి అంటూ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలు, మీడియా మిత్రులకు మంత్రి కోమటిరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 2025లో ప్రజలందరికీ మంచి చేకూరాలనీ, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోడీ కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. 2024 సంవత్సరం తెలంగాణలో బీజేపీకి మధుర స్మృతులను మిగిల్చిందనీ, 2025లోనూ తమ పార్టీకి అండగా నిలవాలని ప్రజలను కోరారు.

సంక్రాంతికి ఆర్టీసీ 6432 ప్రత్యేక బస్సులు

- 557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం
- జిల్లాల నుంచి హైదరాబాద్‌కు ఎలక్ట్రిక్ బస్సులు
- మహాలక్ష్మి యథాతథం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే వారి కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్‌ఆర్టీసీ) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పండుగ రద్దీ దృష్ట్యా 6432 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. వాటిలో 557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. గత ఏడాది సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ 4484 ప్రత్యేక బస్సులను నడపాలని ప్రణాళికలు రూపొందించగా, ప్రయాణీకుల రద్దీ పెరగడంతో మొత్తం 5246 ప్రత్యేక బస్సులను నడిపింది. గత అనుభవాల దృష్ట్యా ఈసారి మరిన్ని రూట్లలో ఎక్కువ బస్సుల్ని నడపాలని నిర్ణయించారు. జనవరి 9నుంచి 15వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. హైదరాబాద్‌లో ఎమ్‌జీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్‌రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురం, కాకినాడ, కందుకూరు, నర్సాపురం, పోలవరం, రాజమండ్రి, రాజోలు, ఉదయగిరి, విశాఖపట్నం, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, శ్రీశైలం, తిరుపతి తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుస్తాయి. అలాగే కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ నుంచి ఎలక్ట్రిక్ బస్సుల్ని నడపాలని ప్రణాళికలు రూపొందించారు. అలాగే బస్టాండ్లలో ప్రయాణీకుల మౌలిక సౌకర్యాలపైనా ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని బస్‌భవన్ అధికారులు ఆయా డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు.

మహాలక్ష్మి యథాతథం

రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం అమల్లో ఉంటుందని ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని అధికారులు కోరారు. అదే సందర్భంలో ప్రయాణీకులు ప్రయివేటు వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని సూచించారు. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను www.tgsrtcbus.in వెబ్ సైట్‌లో చేసుకోవాలనీ, ఇతర వివరాల కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శ్రీతేజ్‌ను పరామర్శించిన మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంధ్యా థియేటర్ ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) మంగళవారం పరామర్శించారు. ఆమె వెంట మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ ఉన్నారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని చూసి మంత్రి భావోద్వేగానికి లోనయ్యారు. అందుతున్న వైద్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. శ్రీతేజ్ తండ్రికి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సినిమా రిలీజ్ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి మరణించడం అత్యంత దురదృష్టకరమన్నారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గతం కంటే కొంత మెరుగుపడిందన్నారు. అతని కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా నిలుస్తున్నదన్నారు.

ఎమ్ఎమ్‌టీఎస్‌కు కొత్త టైంటేబుల్

- జనవరి 1 నుంచి అమల్లోకి...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎమ్ఎమ్‌టీఎస్ రైల్వే నూతన పబ్లిక్ టైమ్ టేబుల్‌ను జనవరి 1నుంచి అమల్లోకి తెస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే మంగళవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం మొత్తం 88 ఎమ్ఎమ్‌టీఎస్ సర్వీసులు పని చేస్తున్నాయని పేర్కొన్నారు. వీటిలో సికింద్రాబాద్ - మేడ్చల్, ఫలక్‌నుమా-ఉందానగర్, ఘట్‌కేసర్ - లింగంపల్లిలో విస్తరించిన నూతన సబర్బన్ సెక్షన్ కూడా ఉందని తెలపారు. ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్ల సమయాలను ప్రయాణికుల సమయాలను దృష్టిలో ఉంచుకుని, నూతనంగా ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్లను అనుసంధానం చేయడం కోసం సవరించామని వివరించారు. రైళ్లకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత స్టేషన్లలో సమయాల్లో మార్పులను ఐ.ఆర్.సి.టి.సి వెబ్‌సైట్ (www.irctc.co.in)ను, నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ సిస్టమ్ (ఎన్.టి.ఈ.ఎస్)ను సందర్శించడం ద్వారా లేదా సంబంధిత రైల్వే స్టేషన్లలోని స్టేషన్ మేనేజర్, విచారణ కేంద్రాన్ని సంప్రదించడం ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి రోడ్డు భద్రతా మాసం

- రాష్ట్రవ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలు
- ఉద్యోగులు కొత్త లోగో ధరించాలి : అధికారులతో రవాణాశాఖ మంత్రి పొన్నం జూమ్ సమావేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసాన్ని నిర్వహిస్తున్నట్టు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వర్క్‌షాప్‌లు ,సెమినార్లు, డ్రైవర్లకు, స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, నేత్రపరీక్ష శిబిరాలు నిర్వహించాలని అధికారుల్ని ఆదేశించారు. మంగళవారంనాడాయన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో కలిసి రవాణాశాఖ, ఆర్టీసీ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. రోడ్డు భద్రతా మాసంలో పోలీసులు, విద్యాశాఖ అధికారులు భాగస్వామ్యం కావాలని చెప్పారు. జనవరి 1వ తేదీ నుంచి రవాణా శాఖ ఉద్యోగులు తప్పనిసరిగా కొత్త లోగోతో యూనిఫాం ధరించాలని ఆదేశించారు.

సుపరిపాలన సూచీకి మంగళం

తదుపరి సూచిక వచ్చే సంవత్సరమే



న్యూఢిల్లీ : 2023వ సంవత్సరానికి సంబంధించిన సుపరిపాలన సూచీని విడుదల చేయరాదని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ద్వైవార్షిక సూచికలను సుపరిపాలన వారంలో (డిసెంబర్ 19 నుండి డిసెంబర్ 25 వరకూ) విడుదల చేయాల్సి ఉండగా ఆ పని జరగలేదు. కాగా దీనిని వచ్చే సంవత్సరం ప్రచురించాలని కేంద్రం భావిస్తోంది. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా 2019 డిసెంబర్ 25న సుపరిపాలన సూచీని విడుదల చేయడం ప్రారంభించారు. ఆ రోజునే సుపరిపాలన దినంగా పాటిస్తున్నారు. వ్యవసాయం, ఆర్థిక పాలన, ప్రజారోగ్యం, పౌరుల కేంద్రంగా పరిపాలన వంటి వివిధ రంగాలకు చెందిన యాభై సూచికలను పరిగణనలోకి తీసుకుంటారు. పెద్ద రాష్ట్రాలకు సంబంధించి 2019 ర్యాంకింగ్స్‌లో తమిళనాడు, 2021 ర్యాంకింగ్స్‌లో గుజరాత్ మొదటి స్థానంలో నిలిచాయి.

సుపరిపాలన సూచీని విడుదల చేయాలని సిబ్బంది, ప్రజా సమస్యలు, పెన్షన్ల మంత్రిత్వ శాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవియన్సెస్ (డీఏఆర్‌పీజీ) డిసెంబర్ 7న భావించింది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 19-24 తేదీల మధ్య దేశవ్యాప్త ప్రచారం చేపడతామని ప్రకటించింది. ఆ వారంలో ప్రత్యేక ప్రచారం 4.0, 2023 సుపరిపాలన సూచీ, సీపీజీఆర్‌ఏఎంఎస్ వార్షిక నివేదిక విడుదల చేస్తామని పత్రికా ప్రకటనలో ప్రకటించింది కూడా. దానికి ముందే నవంబరులో మంత్రిత్వ శాఖ వార్షిక నివేదిక (2023-24)ను విడుదల చేశారు. 'మొదటి జీజీఐని 2019లో, రెండో దానిని 2021లో విడుదల చేశాము. 2023కు సంబంధించిన మూడో జీజీఐని రూపొందించడం జరిగింది. దానిని త్వరలోనే విడుదల చేస్తాం' అని ఆ నివేదికలో మంత్రిత్వ శాఖ తెలిపింది. డిసెంబర్ 23న జీజీఐని విడుదల చేయాలని భావించారని, అయితే ప్రభుత్వం అందుకు సుముఖత చూపలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2023కు సంబంధించి రాష్ట్రాల నుండి సమాచారాన్ని సేకరించడం, దానికి సంబంధించిన సూచీని 2024 చివరలో విడుదల చేయడం అంటే ఆ సమాచారం పాతబడిపోయిందని, దానికి కాలం చెల్లిందని అర్థమని ఆ వర్గాలు వివరించాయి. మళ్లీ కసరత్తు ప్రారంభించి కొత్త సమాచారాన్ని సేకరించడం జరుగుతుందని తెలుస్తోంది.

దీనిపై డీఏఆర్‌పీజీ కార్యదర్శి వి.శ్రీనివాస్‌ను సంప్రదించగా 'రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై అంచనాలు వేసి రెండు సంవత్సరాలకు ఒకసారి జీజీఐని ప్రచురించడం జరుగుతుంది. తదుపరి ఎడిషన్ 2025 చివరలో ప్రచురితమవుతుంది. 2021, 2019 నివేదికలను డీఏఆర్‌పీజీ విడుదల చేసింది. 2021-2024కు సంబంధించి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, జమ్మూకాశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల జిల్లా సుపరిపాలన సూచీలను ప్రచురించడం జరిగింది' అని చెప్పారు. 2021 సూచీని ఆ సంవత్సరం డిసెంబర్ 25న కేంద్ర హోం మంత్రి అమిత్ షా విడుదల చేశారు. పది రంగాలకు చెందిన 58 సూచికలను అది క్రోడీకరించింది. గుజరాత్ మొదటి స్థానంలో నిలవగా 2019తో పోలిస్తే పది రాష్ట్రాలు మెరుగైన ఫలితాలు సాధించాయి.

మరింత క్రియాశీల సూక్ష్మ ఆర్థిక విధానాలు

- **5శాతం వృద్ధిరేటు లక్ష్యం :**

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపు



బీజింగ్ : కొత్త సంవత్సరంలో మరింత క్రియాశీలమైన సూక్ష్మ ఆర్థిక విధానాలను చైనా అమలు చేయాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపిచ్చారు. కొత్త ఏడాదిని పురస్కరించుకుని ఉన్నత రాజకీయ సలహా మండలినుద్దేశించి ఆయన ప్రసంగించారు. రియల్ ఎస్టేట్ మార్కెట్ సంక్షోభం వల్ల తలెత్తిన ఆర్థిక మాంద్యం నుండి బయటపడేందుకు దేశం ఈ ఏడాది చాలా పోరాటం చేయాల్సి వచ్చిందని ఆయన గుర్తు చేసుకున్నారు. అలాగే బలహీనంగా వున్న వినిమయం, పెరుగుతున్న ప్రభుత్వ రుణ భారం కూడా పెను ముప్పులుగా తయారయ్యాయన్నారు. ఆర్థిక వృద్ధిని పెంచడమే లక్ష్యంగా ఇటీవలి మాసాల్లో ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుందన్నారు. వడ్డీరేట్లలో కోత, ఇళ్ళ కొనుగోలుపై ఆంక్షలను రద్దు చేయడం, స్థానిక ప్రభుత్వాలపై రుణా భారాన్ని సడలించడం వంటి చర్యలు అమలు చేసిందన్నారు. అయితే చైనా ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ పూర్తి స్థాయిలో జరగాలంటే దేశీయ వినిమయం పెరగడం అవసరమని, దాన్ని లక్ష్యంగా పెట్టుకుని మరింత ప్రత్యక్ష ఆర్థిక ఉద్దీపన చర్యలు చేపట్టాలని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది 5శాతం జాతీయ వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యాన్ని సాధించగలమని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు, అయితే ఆర్థికవేత్తలు మాత్రం లక్ష్యసాధనలో వెనుకబడవచ్చని భావిస్తున్నారు. ఈ ఏడాది 4,8శాతం మేరా వచ్చే ఏడాది 4.5శాతం మేరా చైనా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా వేసింది. "మనం తప్పనిసరిగా సమగ్రంగా సంస్కరణలను అమలు చేయాల్సిన అవసరం వుంది. ఉన్నత స్థాయిలో అవకాశాలను విస్తరించాలి. అభివృద్ధిని, భద్రతను మరింత మెరుగైన రీతిలో సమన్వయం చేయాలి.మరింత క్రియాశీలమైన, సమర్థవంతమైన సూక్ష్మ ఆర్థిక విధానాలను అమలు చేయాలి." అని జిన్‌పింగ్ పిలుపిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వ మీడియా వార్తలను ప్రసారం చేసింది.



మహేంద్ర సింగ్ ధోనీ అభిమాన సంఘమైన తెలుగు ఎంఎస్‌డియన్స్ రూపొందించిన 2025 క్రికెట్ క్యాలెండర్‌ను హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ఉప్పల్ స్టేడియంలో తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు.

అగ్రస్థానంలో వైశాలి

- హంపి, హారిక నిష్క్రమణ
- అర్జున్, ప్రజ్ఞానందకు నిరాశ

ప్రపంచ చెస్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్స్



వేగం, కచ్చితత్వంతో పాటు కూసింత అదృష్టం సైతం తోడైతేనే బ్లిట్జ్ ఫార్మాట్‌లో ఎత్తులు వేయగలం. చదరంగంలో అత్యంత కఠినమైన ఫార్మాట్ బ్లిట్జ్. ఈ పోటీల్లో ప్రపంచ విజేతగా నిలిచేందుకు భారత గ్రాండ్‌మాస్టర్ రమేశ్‌బాబు వైశాలి ముందంజలో కొనసాగుతోంది. ఓపెన్ విభాగంలో భారత్ నుంచి ఎవరూ బ్లిట్జ్ నాకౌట్ దశకు చేరుకోలేదు.

నవతెలంగాణ-న్యూయార్క్

ఫిడె ప్రపంచ చెస్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్స్‌లో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ ఆర్. వైశాలి ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. బ్లిట్జ్ చాంపియన్‌షిప్స్ తొలి రోజు పోటీల్లో 11 రౌండ్లలో ఏకంగా 9.5 పాయింట్లు సాధించిన వైశాలి స్పష్టమైన ముందంజ వేసింది. మహిళల విభాగంలో అగ్రస్థానంలో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్ కోనేరు హంపి తొమ్మిదో స్థానంలో నిలిచి నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది. ఓపెన్ విభాగంలో తెలుగు తేజం అర్జున్ ఎరిగేశి సహా ఆర్. ప్రజ్ఞానంద అంచనాలను అందుకోలేదు. మహిళల విభాగం క్వార్టర్‌ఫైనల్లో జు జినర్ (చైనా)తో వైశాలి పోటీపడనుంది.

వైశాలి నం.1

మహిళల చెస్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్స్‌లో 107 మంది పోటీపడగా.. భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. వైశాలి అగ్రస్థానంలో నిలిచింది. తొలి రోజు పోటీల్లో మహిళల విభాగంలో 11 రౌండ్ల పోటీలు జరిగాయి. ఎనిమిది గేముల్లో విజయాలు సాధించిన వైశాలి.. మూడు గేములను డ్రాగా ముగించింది. తొలి రోజు ఒక్క ఓటమి చవిచూడని వైశాలి 9.5 పాయింట్లతో టాప్ లేపింది. రెండో స్థానంలో నిలిచిన చైనా గ్రాండ్‌మాస్టర్ లీ కంటే 1.0 పాయింట్ల ముందంజలో కొనసాగుతుంది. 11 రౌండ్ల పోటీల అనంతరం టాప్-8లో నిలిచిన వారు నాకౌట్ దశకు అర్హత సాధిస్తారు. ర్యాపిడ్ చెస్ చాంపియన్ కోనేరు హంపి ఆ మార్క్ దాటలేదు. 8 పాయింట్లు సాధించిన హంపి తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఏడు పాయింట్లతో ద్రోణవల్లి హారిక 22వ స్థానంలో నిలువగా.. దివ్య దేశ్‌ముఖ్ (18), అగర్వాల్ (19)వ స్థానాలు సాధించారు.



'బ్లిట్జ్ ఫార్మాట్‌లో నేను గొప్ప ప్లేయర్‌ను కాదు. పోటీలో ఎంతోమంది మెరుగైన ప్లేయర్స్ ఉన్నారు. ఈ రోజు నాకు కొంత అదృష్టం కలిసొచ్చిందని అనుకుంటున్నాను. నేను వేసిన ఎత్తులు పని చేశాయి. ఈ రోజు ఫలితాలతో ఎంతో సంతోషంగా ఉన్నాను. నాకౌట్ పోటీల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఇటువంటి ఫలితాలను నిజంగా ఊహించలేదు' అని తొలి రోజు పోటీల అనంతరం రమేశ్‌బాబు వైశాలి తెలిపింది.

అర్జున్ ఇంటికి

బ్లిట్జ్ ఓపెన్ విభాగం చాంపియన్‌షిప్స్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు తేలిపోయారు. పురుషుల విభాగంలో తొలి రోజు 13 రౌండ్ల పోటీలు జరిగాయి. 186 మంది గ్రాండ్ మాస్టర్లు, ఇంటర్నేషనల్ మాస్టర్లు పోటీపడిగా.. టాప్-8 ప్లేయర్లు నాకౌట్ దశకు అర్హత సాధించారు. టాప్-9లో భారత్ నుంచి ఎవరూ అర్హత సాధించలేదు. ఆర్. ప్రజ్ఞానంద 8.5 పాయింట్లతో 23వ స్థానంలో నిలిచాడు. భారత్ నుంచి ప్రజ్ఞానందదే ఉత్తమ ప్రదర్శన కావటం గమనార్హం. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగేశి ఏడు పాయింట్లతో 64వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ 9.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఇయాన్ (9.5), ఫాబియానో (9.5) పాయింట్లతో టాప్-2లో నిలిచారు. వరల్డ్ నం.3 హికారు నకముర (అమెరికా)పై అన్‌సీడెడ్ భారత గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చితాంబరం అద్భుతం చేశాడు. బ్లిట్జ్ చాంపియన్‌షిప్స్‌లో హికారు నకమురపై విజయం సాధించాడు. ఈ ఓటమితో కంగుతిన్న నకముర.. టాప్-8లో చోటు కోల్పోయాడు. 8.5 పాయింట్లతో 21వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.



320 ఉఫ్!

కర్నాటకపై హైదరాబాద్ గెలుపు

అహ్మదాబాద్ : విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ అదిరే విజయం సాధించింది. అగ్రజట్టు కర్నాటకపై 321 పరుగుల లక్ష్యాన్ని ఊదేసింది. భారీ ఛేదనలో ఆలెగాని వరుణ్ గౌడ్ (109 నాటౌట్, 82 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ తిలక్ వర్మ (99, 106 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. తన్మయ్ అగర్వాల్ (35), తనయ్ త్యాగరాజన్ (25) రాణించారు. వరుణ్, తిలక్ మెరుపులతో 49.4 ఓవర్లలోనే హైదరాబాద్ లక్ష్యాన్ని చేరుకుంది. 322/7తో మూడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కర్నాటక 50 ఓవర్లలో 320/8 పరుగులు చేసింది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (124, 112 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆర్ స్మారన్ (83, 75 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) రాణించారు. గ్రూప్-సిలో ఐదు మ్యాచుల్లో హైదరాబాద్‌కు ఇది మూడో విజయం. వరుణ్ గౌడ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

సంక్రాంతి సందడికి సై..



'డాకు మహారాజ్'లో బాలకృష్ణ


'గేమ్ ఛేంజర్'లో రామ్‌చరణ్, కియారా అద్వానీ

'సంక్రాంతికి వస్తున్నాం'లో ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి, వెంకటేష్

కాసుల వర్షానికి కేరాఫ్ సంక్రాంతి సీజన్.. దీన్ని క్యాష్ చేసుకోవడానికి మూడు పెద్ద సినిమాలు బరిలోకి దిగుతున్నాయి. దాదాపు రూ.800 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమాలు ఈసారి ఎటువంటి బెనిఫిట్ షోలు, అధిక టికెట్ ధరలు లేకుండానే పోటీకి సై.. అనడం విశేషం.

ప్రతి ఏడాది మాదిరిగానే ఈ నూతన ఏడాదిలో కూడా సంక్రాంతి పోటీ రసవత్తరంగానే ఉండనుంది. భారీ అంచనాలు ఉన్న ముగ్గురు అగ్ర హీరోల సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చి సందడి చేయబోతున్నాయి. అలాగే ఓ అగ్రహీరో నటించిన తమిళ సినిమా కూడా ఈ సంక్రాంతి బరికి సై..అంటోంది.

ఇటీవల జరిగిన సంధ్య థియేటర్ తొక్కిసలాట నేపథ్యంలో ఇకపై బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపుదల ఉండవని తెలంగాణ సర్కార్ తేల్చి చెప్పింది. ఈ నిర్ణయం సంక్రాంతికి విడుదలయ్యే సినిమాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. అధిక ధరలతో టికెట్లు, బెనిఫిట్ షోల వల్ల మొదటి మూడు రోజుల్లోనే అనూహ్య రీతిలో కలెక్షన్లను కొల్లగొట్టొచ్చు. 'పుష్ప2: ది రూల్' సినిమా సాధించిన కలెక్షన్లలో ఇవే కీలక పాత్ర పోషించాయి. అంతటి ప్రాధాన్యత ఉన్న బెనిఫిట్ షోలు, అధిక టికెట్ ధరల పెంపు వెసులబాటు లేకపోవడం నిర్మాతల పాలిట శాపంగా మారితే, డిస్ట్రిబ్యూటర్లకు, ఎగ్జిబిటర్లకు వరంగా మారింది.



'విదాముయర్చి'లో త్రిష, అజిత్

ఇక సంక్రాంతి బరిలోకి ముందుగా రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్'తో ఈనెల 10న దిగబోతున్నారు. రామ్‌చరణ్, కియారా అద్వానీ జంటగా శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. రామ్‌చరణ్ ద్విపాత్రాభియంతో అలరించబోతున్నారు. బాలకృష్ణ, బాబీ కొల్లి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'డాకు మహారాజ్'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫోర్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈనెల 12న రిలీజ్ కానుంది. ఇందులో బాలకృష్ణ సైతం భిన్న పాత్రలతో కనువిందు చేయనున్నారు.

అలాగే ఈనెల14న వెంకటేష్ 'సంక్రాంతికి వస్తున్నాం'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. మీనాక్షిచౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలుగా నటించిన ఈచిత్రానికి అనిల్‌రావిపూడి దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మించారు. వీటితోపాటు అజిత్ నటించిన 'విదాముయర్చి' తెలుగు వెర్షన్ కూడా సంక్రాంతి బరిలోకి దిగి అమీతుమీ తేల్చుకోనుంది.

నవచిత్రం

ఈ డ్రగ్స్ అవసరమా డార్లింగ్స్?



ప్రభాస్

సమాజ హితం కోరే ఏ కార్యక్రమానికైనా తన వంతు సహకారం అందించేందుకు ఎప్పుడూ ముందుంటారు హీరో ప్రభాస్. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమానికి ప్రభాస్ మద్ధతు ప్రకటించారు.

ఈ కార్యక్రమాన్ని సపోర్ట్ చేస్తూ డ్రగ్స్ వద్దు అనే సందేశాన్ని వీడియో రూపంలో అందించారు. 'లైఫ్ లో మనకు బోలెడన్ని ఎంజాయ్‌మెంట్స్ ఉన్నాయి. కావాల్సి నంత ఎంటర్‌టైన్‌మెంట్ ఉంది. మనల్ని ప్రేమించే మనషులు, మన కోసం బతికే మన వాళ్లు ఉన్నప్పుడు ఈ డ్రగ్స్ అవసరమా డార్లింగ్స్?, డ్రగ్స్‌ను ఈ రోజు నుంచే వదిలేయండి. మీకు తెలిసిన ఎవరైనా డ్రగ్స్‌కు బానిసలు అయితే టోల్ ఫ్రీ నెంబర్ 8712671111కు కాల్ చేయండి. వారు పూర్తిగా కోలుకునే విధంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతుంది' అని వీడియోలో ప్రభాస్ సందేశమిచ్చారు.

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలకు సినీ తారలు సైతం ప్రచారం కల్పించాలని ఇటీవల జరిగిన భేటీలో సినీ ప్రముఖులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరిన విషయం తెలిసిందే.

దీనికి స్పందిస్తూ యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమ ప్రచారానికి హీరో ప్రభాస్ తొలి అడుగు వేశారు.

'కల్కీ' సినిమాతో గతేడాది రూ.1100 కోట్ల గ్రాస్‌ని కలెక్ట్ చేసి, హీరోగా తనకంటూ ఓ ప్రత్యేకస్థానాన్ని సొంతం చేసుకున్న ప్రభాస్ త్వరలోనే 'రాజాసాబ్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.

'నా గుండె జారిపోయిందే..'



మమతా, వరుణ్ రాజ్

వరుణ్ రాజ్ హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న సినిమా 'పోకిరి'. మమతా హీరోయిన్. వికాస్ దర్శకులు. వరుణ్ రాజ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా నుంచి మొదటి పాటని విడుదల చేసారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ డైరెక్టర్ వికాస్ మాట్లాడుతూ, 'మేం కథ రాసుకున్నప్పటి నుంచే 'పోకిరి' అనే టైటిల్ అనుకున్నాం. ఈ సినిమా బాగా హిట్ అవుతుందని నమ్ముతున్నాం' అని అన్నారు.

'ఈ సినిమాతో గట్టిగా హిట్ కొడతాం. ఈ సినిమా హిట్ అవుతుందని మాకు కాన్ఫిడెన్స్ ఉంది. నేను పవన్ కళ్యాణ్‌కే కాదు, చిరంజీవి, మహేష్ బాబుకి కూడా అంతే అభిమానిని. ఈ సినిమా టైటిల్ లోనే దమ్ముంది. 'పోకిరి'కి ఓనర్ మహేష్ బాబే. మేమంతా అభిమానులం అంతే' అని హీరో, నిర్మాత వరుణ్ రాజ్ చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, 'ఈ సినిమాకి పని చేయడం చాలా సంతోషంగా ఉంది. నేను మాట్లాడటం కన్నా నా మ్యూజిక్ మాట్లాడితే బాగుంటుంది అని ఆశిస్తున్నాను. మా సినిమా హిట్ కావడం ఖాయం' అని తెలిపారు.



ఓ వ్యవసాయ కుటుంబ కథ..

'బాపు'ని కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ తమ మూడవ ప్రొడక్షన్‌ని అనౌన్స్ చేసింది. ఇది డార్క్ కామెడీ-డ్రామా, హ్యూమర్, ఎమోషన్స్‌తో యూనిక్ బ్లెండ్‌గా ప్రేక్షకులను అలరించనుంది. లీడ్ రోల్స్‌లో బ్రహ్మాజీ ఒకరుగా నటిస్తున్న ఈ చిత్రానికి దయా దర్శకత్వం వహిస్తున్నారు. రాజు, సిహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కథలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

హీరో రానా దగ్గుబాటి 'బాపు' ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్ చేశారు. నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో ఓ వ్యవసాయ కుటుంబం తాలూకా ఎమోషనల్ జర్నీగా ఉంటుంది. ఓ కుటుంబ సభ్యుడు ఇతరుల మనుగడ కోసం తమ జీవితాన్ని త్యాగం చేయవలసి వచ్చినప్పుడు ఫ్యామిలీ డైనమిక్స్ ఎలా మారుతుందో ఎమోషనల్‌గా హత్తుకునే నెరేటివ్‌తో సినిమా ఉండబోతోంది.

ఈ చిత్రానికి నిర్మాతలు: రాజు, సిహెచ్. భాను ప్రసాద్ రెడ్డి, రచన, దర్శకత్వం: దయా, సంగీతం: ధ్రువన్, సినిమాటోగ్రఫీ: వాసు పెండెం, ఎడిటింగ్: అనిల్ ఆలయం, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీపాల్ మాచర్ల, లిరిక్స్: శ్యామ్ కాసర్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: భరత్ రెడ్డి.

'పా.. పా' రిలీజ్‌కి రెడీ



అపర్ణ దాస్, కవిన్

తమిళంలో సంచలన విజయం సాధించిన 'డా..డా' చిత్రాన్ని తెలుగులో 'పా.. పా..' టైటిల్‌తో జెకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత నీరజ కోట విడుదల చేయబోతున్నారు. ఈనెల 3న ఈ సినిమా ఆంధ్ర, తెలంగాణతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా థియేటర్‌లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల డైరెక్టర్ మారుతి విడుదల చేసిన ఈ చిత్ర ట్రైలర్‌కు భారీ రెస్పాన్స్ రావడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.

'కవిన్, అపర్ణ దాస్ ప్రధాన పాత్రదారులుగా డైరెక్టర్ గణేష్ కె బాబు తెరకెక్కించిన చిత్రమిది. అతి తక్కువ బడ్జెట్‌తో నిర్మితమైన ఈ సినిమా సుమారు రూ.30 కోట్లు వసూళ్లు సాధించి, బ్లాక్ బస్టర్ విజయాన్ని నమోదు చేసుకుంది. తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కి తమిళంలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన 'డా..డా' చిత్రం 'పా.. పా..' పేరుతో తెలుగు ప్రేక్షకులను కూడా బాగా ఆకట్టుకుంటుంది. భావోద్వేగం, ప్రేమ, కామెడీ.. ఇవన్నీ సరైన స్థాయిలో మిక్స్ చేసిన ఈ ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా ఇది. ఈ మూవీని తెలుగు రాష్ట్రాల్లో ఎంజీఎం సంస్థ నుంచి అచ్చిబాబు రిలీజ్ చేస్తున్నారు' అని నిర్మాత నీరజ కోట తెలిపారు.

ఆశాలను వర్కర్లుగా గుర్తించాలి



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కోశాధికారి పి.గంగమణి అధ్యక్షతన ముగింపు సభ నిర్వహించారు. ఈ సభలో సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు కె.హేమలతతో పాటు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు జె.వెంకటేష్, ఎస్వీ రమ, భూపాల్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, రాష్ట్ర నాయకులు సునీత, సాధన, బాలమణి, పద్మ, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన వేలాది మంది ఆశాలు తమను రెగ్యులరైజ్ చేయాలనీ, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ ఆశాల సేవలను ప్రపంచం గుర్తించినా కేంద్ర ప్రభుత్వం సరైన గుర్తింపు, ప్రతిఫలం ఇవ్వడం లేదని చెప్పారు. ఒక ఇల్లు గడవడానికి నెలకు కనీసం రూ.26 వేలు అవసరమనీ, అందుకే కనీస వేతనం రూ.26 వేలు ఉండాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. ఆశాలను ఉద్యోగులుగా గుర్తించకుండా కేవలం చురుకైన కార్యకర్తలంటూ కార్మిక చట్టాలు వర్తించకుండా అన్యాయం చేస్తున్నదని చెప్పారు. 2013-14లో ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ దేశంలో స్కీం వర్కర్లు 80 లక్షల మందిని ఉద్యోగులుగా గుర్తించాలని చేసిన సిఫారసును అమలు చేయలేదనీ, మళ్లీ అలాంటి కాన్ఫరెన్స్ నిర్వహించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలనీ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా అమలు చేయలేదని తెలిపారు. గుజరాత్ హైకోర్టు అంగన్‌వాడీలను రెగ్యులరైజ్ చేసి వేతనాలు ఫిక్స్ చేయాలని తీర్పు ఇచ్చినా పట్టించుకోలేదని చెప్పారు. దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాడితేనే డిమాండ్లను సాధించుకోగలుగుతామని సూచించారు. ప్రభుత్వ విధానాలు ఆశాలకే కాకుండా అంగన్‌వాడీలు, మిడ్డే మీల్స్ వర్కర్లు తదితరులందరికీ వ్యతిరేకంగా ఉన్నాయని వివరించారు.

లేబర్ కోడ్‌లకు, నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికులు, రైతులందరితో కలిసి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న మిగిలిన కార్మిక సంఘాలతో కలిసి పోరాటాల్లో పాల్గొనాలన్నారు.

మోడీ విధానాలను అనుసరిస్తున్న సీఎం : పాలడుగు భాస్కర్

కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అవలంబిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాలనే రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్నారని పాలడుగు భాస్కర్ విమర్శించారు. మతోన్మాదులు, కార్పొరేట్ శక్తుల కలయికతో నిండిన బీజేపీ కార్మికులకు వ్యతిరేకంగా నడుస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో 1.20 కోట్ల మంది కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పోరాడితే పదేండ్లు బీఆర్ఎస్ పట్టించుకోలేదనీ, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా పట్టించుకోవడం లేదన్నారు. స్కీం వర్కర్లకు బడ్జెట్ తగ్గిస్తే రేవంత్ రెడ్డి ప్రశ్నించలేదనీ, లేబర్ కోడ్‌లు అమలు మంచిదని బహిరంగంగా చెబుతున్నారని తప్పుపట్టారు. సీఎం వైఖరి మార్చుకోకుంటే ఢిల్లీపై పోరాటం చేస్తున్నట్టే రేవంత్ రెడ్డిపై పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. వర్కింగ్ ఉమెన్ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని తెలిపారు. ప్రభుత్వం మొండికేస్తే అంతకంటే మొండిగా ఉంటామని హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర ఆఫీస్ బేరర్ భూపాల్ మాట్లాడుతూ వెయ్యి మందికి ఒకరు చొప్పున రాష్ట్రంలో 40 వేల మంది ఆశాలుండాలనీ, ప్రస్తుతం 26 వేల మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. మరో 14 వేల మందిని తీసుకుని ఆశాలపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సభలో నీలాదేవితో పాటు నాయకులు సునీత, సాధన, పద్మ, బాలమణి తదితరులు మాట్లాడారు. ముగింపు సభలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి, ఆఫీస్ బేరర్లు కొండా లక్ష్మి (భూపాలపల్లి), వరలక్ష్మి (సంగారెడ్డి), సునీత (గద్వాల), లత (జగిత్యాల), ఎం.వీ.అప్పారావు (భద్రాద్రి కొత్తగూడెం), ఆశాలత (కరీంనగర్), హేమలత (మేడ్చల్), నర్సమ్మ (మెదక్), కళావతి (నాగర్ కర్నూల్), కవిత (రంగారెడ్డి), సీఐటీయూ ఆఫీస్ బేరర్లు జె.వెంకటేష్, కూరపాటి రమేష్, కె.ఈశ్వర్ రావు, ఎం.వెంకటేష్, వి.ఎస్.రావు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కుమార్, పి.సుధాకర్, వై.సోమన్న, ఎస్ఎస్ఆర్ఏ ప్రసాద్, ఎ.సునీత, జిల్లా నాయకులు టి.యాదమ్మ (హైదరాబాద్), మీనా (హైదరాబాద్ సౌత్), రేవతి (మేడ్చల్) తదితరులు పాల్గొన్నారు.

పోరాటం తీవ్రతరం

జనవరిలో ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నాలు : పి.జయలక్ష్మి



ఆశాల పోరాటాన్ని తీవ్రతరం చేయనున్నట్టు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి ప్రకటించారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్‌పై పోరాటం చేస్తున్న ఆశాల దగ్గరికి కాంగ్రెస్ నాయకులు వచ్చి హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. ఏడాది గడిచినా రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, ఇతర హామీలు నెరవేర్చకపోవడంతో బస్సు యాత్ర చేపట్టినట్టు తెలిపారు. 17 రోజుల పాటు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో యాత్ర నిర్వహించినా ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు, సెలవులు, రూ.50 లక్షల బీమా, మరణిస్తే మట్టి ఖర్చులకు రూ.50 వేలు, ఏఎన్ఎం పూర్తి చేసిన అనుభవమున్న ఆశాలకు వెయిటేజీ, పదోన్నతులు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర న్యాయమైన డిమాండ్ల సాధించుకునే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కేసులతో సంబంధం లేకుండా పనిగంటలను, శ్రమను పరిగణనలోకి తీసుకుని నెల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ తో పాటు పలు రాష్ట్రాలు ఫిక్స్‌డ్ వేతనం ఇస్తున్నాయని గుర్తుచేశారు. జనవరిలో ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నాలు, ఒక రోజు పాదయాత్ర నిర్వహించనున్నట్టు జయలక్ష్మి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. బడ్జెట్ సమావేశాలకు ముందు రిలే నిరాహారదీక్షలు చేపడతామని తెలిపారు. బడ్జెట్ రోజు కలెక్టరేట్ గేట్ల ముందు నిరసనలు, అనంతరం చలో హైదరాబాద్ నిర్వహిస్తామని తెలిపారు.

సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాల యాలను కార్పొరేట్ హంగులతో అధునా తనంగా నిర్మించ బోతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాల యంలో జిల్లా రిజిస్ట్రార్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాకు పెద్ద మొత్తంలో ఆదాయాన్ని అందిస్తున్న ఈ శాఖను మరింత పటిష్ట పరచాలని అధికారులకు సూచించారు. రిజిస్ట్రేషన్లకు వచ్చేవారికి కూర్చోవడానికి కనీసం కుర్చీలు కూడా లేకపోవడంతో చెట్ల కింద, నీడ దొరికిన చోట నిరీక్షిస్తున్నారనీ, ఇకపై ఆ పరిస్థితి ఉండకూడదని అన్నారు. "రాష్ట్రంలో మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులున్నాయి. వీటిలో 38 ఆఫీసులు మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయి. మిగతా 105 ఆఫీసులు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 52 చోట్ల ఆఫీసులకు అవసరమయ్యే భవనాల నిర్మాణానికి ప్రభుత్వం భూమి కేటాయించింది" అని మంత్రికి అధికారులు వివరించారు. భూములు సిద్ధంగా ఉన్న చోట వీలైనంత త్వరగా మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసులను నిర్మించాలనీ, మిగతా 52 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సరిపడే స్థలాలను అన్వేషించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. మొదటి దశలో సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్ కార్యాలయాలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఫోర్త్ సిటీలో, గండిపేట, శేరిలింగంపల్లి, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు మూడు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) కార్యాలయంలో నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు.

హైదరాబాద్ జిల్లాకు సంబంధించి బంజారా హిల్స్, ఎస్ఆర్‌నగర్, గోల్కొండ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను షేక్ పేట్ ప్రాంతంలో ఒకేచోట నిర్మించేందుకు నిర్ణయించామని తెలిపారు. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిని నిర్మూలించేం దుకు వీలుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను తక్షణమే రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామరెడ్డి, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్, రంగారెడ్డి హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో నవతెలంగాణ విలేకరి మృతి

శాయంపేట రిపోర్టరుగా బాల్నే తిలక్‌బాబు విధులు

- 'ప్రజాశక్తి, నవతెలంగాణ'తో 18ఏండ్ల అనుబంధం
- ఆయనకు పత్రికా యాజమాన్యం, వరంగల్ రీజియన్ సిబ్బంది,పలు జర్నలిస్టు సంఘాలు, తోటి విలేకర్ల ఘన నివాళి



నవతెలంగాణ-వరంగల్

నవతెలంగాణ దినపత్రిక హనుమకొండ జిల్లా శాయంపేట మండల విలేకరి, సీనియర్ జర్నలిస్ట్, టీడబ్ల్యూజేఎఫ్ హనుమకొండ జిల్లా కోశాధికారి బాల్నే తిలక్‌బాబు(52) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. శాయంపేట గ్రామంలోని తిలక్ స్వగృహంలో మంగళవారం తెల్లవారుజామున పలువురు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మృతిపట్ల నవతెలంగాణ సీజీఎం, ఎడిటర్, రాష్ట్ర బాధ్యులు, వరంగల్ రీజియన్ సిబ్బంది, తోటి జర్నలిస్టులతో పాటు పలు జర్నలిస్టు సంఘాల నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తిలక్‌బాబు మృతి తీరని లోటని, వారి కుటుంబీకులకు సంతాపం తెలిపారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

'నవతెలంగాణ' సంతాపం

వరంగల్ రీజియన్ శాయంపేట విలేకరి తిలక్‌బాబు మృతి బాధాకరమని నవతెలంగాణ దినపత్రిక సీజీఎం పి. ప్రభాకర్, ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. మొదట ప్రజాశక్తి, ఆతర్వాత నవతెలంగాణలోనూ 18 ఏండ్లుగా రిపోర్టర్‌గా కొనసాగుతూ సంస్థ, పత్రిక పట్ల అంకితభావంతో పనిచేశారని అన్నారు. విధుల్లో అత్యంత చురుకైన పాత్ర పోషించి పత్రిక అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో న్యూస్ ఎడిటర్ ఆర్.రమేష్, మఫిషియల్ ఇన్‌చార్జి వేణుమాధవ్‌రావు, ఎడిటోరియల్ బోర్డు సభ్యులు, జనరల్ మేనేజర్లు వెంకటేష్, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. నవతెలంగాణ వరంగల్ జిల్లా రీజియన్ మేనేజర్ బోయినిపల్లి దేవేందర్‌రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రాంతీయ ప్రతినిధి బొక్క దయాసాగర్, వరంగల్ డెస్క్ సిబ్బంది, విలేకరులు, అడ్వర్‌టైజ్ మెంట్ ఇన్‌చార్జీలు, తదితరులు నివాళులర్పించారు.

సీపీఐ(ఎం), జర్నలిస్టు సంఘాల సంతాపం

జర్నలిస్టు తిలక్ మృతి బాధాకరమని సీపీఐ(ఎం) హన్మకొండ, భూపాలపల్లి జిల్లా కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, బందు సాయిలు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తిలక్ భౌతికకాయానికి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బొట్ల చక్రపాణి, డి తిరుపతి పూలమాలవేసి నివాళులర్పించారు. తిలక్‌బాబు అకాల మరణం అతని కుటుంబానికి తీరని లోటని, నిరుపేద కుటుంబానికి చెందిన తిలక్ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి, నవతెలంగాణ వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి బొక్క దయాసాగర్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు టీవీ రాజు గౌడ్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపల్లి మధు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సాగర్, టీయూడబ్ల్యూజే(143) రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్ లెనిన్, డెస్క్ జర్నలిస్టు సోమ నరసయ్య తెలిపారు.

ఎర్రజెండా ప్రాధాన్యత పెరిగింది

చైనా ఆర్థిక వ్యవస్థ అమెరికానే సవాల్ చేస్తోంది

- నేపాల్, శ్రీలంకలోనూ ఎర్రజెండా రెపరెపలు
- దోపిడీ ఉన్నంత కాలం పోరాటం
- సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా సంగారెడ్డిలో 2కె రన్ ప్రారంభించిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఆహ్వాన సంఘం చైర్మెన్ చుక్క రాములు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అంతర్జాతీయంగా, జాతీయంగా ఎర్రజెండా, వామపక్షాల ప్రాధాన్యత పెరుగుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల ఆహ్వాన సంఘం చైర్మెన్, ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న పార్టీ రాష్ట్ర మహాసభల సందర్భంగా మంగళవారం నిర్వహించిన 2కె రన్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి, అనంతరం 2కె రన్ కార్యక్రమాన్ని ఎర్రజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం న్యూ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఎర్రజెండా నాయకత్వాన చైనా ఎంతో పురోగమిస్తుందని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో దూసుకుపోతున్న చైనా దేశం అమెరికాను సవాల్ చేస్తుందని తెలిపారు. మరో పక్క నేపాల్, శ్రీలంక లాంటి దేశాల్లోనూ ఎర్రజెండా నీడన ప్రజా ప్రభుత్వాలేర్పడ్డాయన్నారు. దేశంలోనూ వామపక్షాలు, ఎర్రజెండా ప్రాధాన్యత పెరిగిందన్నారు. దోపిడి ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందన్నారు. కార్మికులు, కర్షకులు, రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలు, మైనార్టీలు, దళితులు, గిరిజనులు ఇలా అనేకమంది ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబాటుకు గురవుతున్న పరిస్థితి ఉందన్నారు. వారి పక్షాన సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) అనేక ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో సీపీఐ(ఎం) ఔనత్యాన్ని పెంచేందుకు దోహదపడే సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

శారీరక, మానసిక ఆరోగ్యం కోసం వ్యాయమం అనివార్యమని, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు కొన్ని పథకాలు పెట్టినా అవి ప్రజల అవసరాలకు అందుతున్న పరిస్థితిలేదన్నారు. ముఖ్యంగా నాణ్యమైన వైద్యం అందాలన్నారు. సంగారెడ్డిలో తొలిసారి నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల్ని జయప్రదం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా మెడికల్, రక్తదాన శిబిరాలు, సెమినార్లు, మాస్ క్యాంపెయిన్, కోలాట శిక్షణ, 2కె రన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్ని కలుస్తున్నామని తెలిపారు. వీర నారి ఐలమ్మ విగ్రం నుంచి న్యూ బస్టాండ్ వరకు సాగిన 2కె రన్‌లో వందలాది మంది సీపీఐ(ఎం) శ్రేణులు రెడ్ టీ షర్ట్స్ ధరించి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, నాయకులు బి.మల్లేశం, ఎ.మాణిక్, జి.సాయిలు, ఎం.నర్సింహులు, ఎం.యాదగిరి, బాగారెడ్డి, కృష్ణ, అశోక్, మహేష్, రమేష్ గౌడ్, రాజయ్య, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలి

- టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యారంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ ప్రాథమిక బడుల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని దోమల్‌గూడలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌తోపాటు అధ్యాపక దర్శినిని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎం వెంకట్, ఉపాధ్యక్షులు కె జంగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో నర్సిరెడ్డి మాట్లాడుతూ డైరీ అంటే దినచర్య రాసుకునేదని అన్నారు. వ్యక్తిగత చిట్టాపద్దులు, జ్ఞాపకాలను రాసుకుంటారని చెప్పారు. డైరీ అంటే జీవితాన్ని తీర్చిదిద్దుకునేదని వివరించారు. ప్రతిరోజూ చేసిన పనులను రాసుకుంటే నెల తర్వాత బేరీజు వేసుకుంటే చేసిన తప్పులను తెలుసుకోవచ్చని అన్నారు. అప్పుడు పనివిధానంలో మార్పు వస్తుందన్నారు. దేశంలో ధనవంతులు మరింత ధనవంతులుగా మారిపోతున్నారనీ, సామాన్యులు మాత్రం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు జఠిలమైనవి కాదనీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీఏలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. కేజీబీవీ, గురుకులాల్లోని సీఆర్టీలు, పార్ట్‌టైం ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ ఇవ్వాలని చెప్పారు. గురుకులాల సమయపాలనను మార్చాలని సూచించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పండిట్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాలని అన్నారు. పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని రద్దు చేయాలనీ, సీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చొద్దని కోరారు. ప్రజలకు ఉపయోగపడేలా అప్పుల్లేని బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని సూచించారు. ధనవంతుల వద్దే సంపద పోగుబడుతోందనీ, వారిపై పన్నులు వేయాలని చెప్పారు. మతపరంగా, ప్రాంతీయ పరంగా, కులపరంగా ప్రజలను విభజించకుండా జాతీయ సమైక్యతను కాపాడాలని అన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి దానికి భిన్నంగా కొందరు మాట్లాడుతున్నారని వివరించారు. రాజ్యాంగాన్ని అర్థం చేసుకుని భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ పాలన కొనసాగాలని ఆకాంక్షించారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి : చావ రవి

గతనెల 28 నుంచి 30 వరకు నల్లగొండలో నిర్వహించిన రాష్ట్ర మహాసభలు జయప్రదంగా ముగిశాయని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి చెప్పారు. విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమానికి సంబంధించిన పలు తీర్మానాలను ఆమోదించామన్నారు. విద్యకు 15 శాతం నిధులను కేటాయిస్తామంటూ కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని అన్నారు. ప్రస్తుతం 7.5 శాతం నిధులను కేటాయించిందన్నారు. వచ్చే బడ్జెట్‌లో 15 శాతం నిధులను విద్యకు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాబోయే మూడేండ్లలో 20 శాతానికి పెంచాలని సూచించారు. పర్యవేక్షణ వ్యవస్థ సంక్షోభంలో ఉందన్నారు. ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. డిప్యూటీఈవో, ఎంఈవో, డైట్ లెక్చరర్ వంటి పోస్టులను రెగ్యులర్ పద్ధతిలో భర్తీ చేయాలని సూచించారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ జేఏసీ, యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని చెప్పారు.

నర్సిరెడ్డిని మళ్లీ గెలిపించుకోవడమే మా కర్తవ్యం : వెంకట్

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం అవసరమైన ఉద్యమాలు చేపడతామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ అన్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి టీఎస్‌యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డిని మళ్లీ గెలిపించుకోవడమే మహాసభల్లో కర్తవ్యంగా తీసుకున్నామని వివరించారు. అందుకోసం అందరం సమిష్టిగా పనిచేస్తామన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ కోశాధికారి టి లక్ష్మారెడ్డి, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ ప్రధాన సంపాదకులు పి మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎ సింహాచలం, ఎం వెంకటప్ప, మహిళా విభాగం కన్వీనర్ ఆర్ శారద, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జనగామ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- జిల్లా కార్యదర్శిగా మోకు కనకారెడ్డి



నవతెలంగాణ-జనగామ

సీపీఐ(ఎం) జనగామ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జనగామ జిల్లాలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ.. డిసెంబర్ 27, 28 తేదీల్లో జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించిన సీపీఐ(ఎం) జిల్లా మహాసభల సందర్భంగా 27మంది సభ్యులతో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. జనగామ జిల్లా నూతన కార్యదర్శిగా మోకు కనకారెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులుగా రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, సింగారపు రమేష్, రాబర్తి సోమయ్య, బోట్ల శేఖర్‌ను ఎన్నుకున్నారు.

జిల్లా కమిటీ సభ్యులుగా బూడిద గోపి, జోగు ప్రకాష్, చుంచు విజేందర్, భూక్య చందు నాయక్, బెల్లంకొండ వెంకటేష్, చిట్యాల సోమన్న, మునిగేల రమేష్, కొడెపాక యాకయ్య, బోడ నరేందర్, పోత్కనూరి ఉపేందర్, ఎండీ అజారుద్దీన్, ఎండీ షబానా, పంతులు శ్రీనివాస్, బిట్ల గణేష్, కో ఆప్షన్ సభ్యులుగా నలుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

సైనిక్‌స్కూల్ ఏర్పాటుకు కృషి చేయండి

- ఆకునూరికి బోయినపల్లి లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సైనిక్‌స్కూల్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళికి ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటుపై గత ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ప్రస్తుత ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలను తమ లేఖలో పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు : మంత్రి పొంగులేటి

- టీఎస్‌పీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (టీఎస్‌పీటీఏ) రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు అని అన్నారు. దేశంలోనే మొదటి స్థానంలో విద్యారంగాన్ని నిలపడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. దానికి ఉపాధ్యాయులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. పదేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను సజావుగా పూర్తి చేశామని గుర్తు చేశారు. ఆర్థిక విధ్వంసం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో జాప్యం జరుగుతోందని చెప్పారు. పరిస్థితులను బట్టి అన్ని సమస్యలనూ పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పదివేల పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సంప్రదించి ప్రాథమిక ఉపాధ్యాయులు న్యాయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీటీఏ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్ రోహిత్ నాయక్, అసోసియేట్ అధ్యక్షులు ఆర్ మంగా, పి సుధారాణి, అన్వర్‌అలీ, ఎస్ రామలింగం, ఎ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి టెట్ పరీక్షలు

- 20 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ
- 2.75 లక్షల మంది దరఖాస్తు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం (సీబీఆర్టీ)లో రాతపరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా టెట్ పేపర్-1కు 94,327 మంది, పేపర్-2కు 1,81,426 మంది కలిపి మొత్తం 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. హాల్‌టికెట్ల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. ఈనెల ఎనిమిది, తొమ్మిది, పది, 18 తేదీల్లో పేపర్-1, అదేనెల రెండు, ఐదు, 11, 12, 19, 20 తేదీల్లో పేపర్-2 పరీక్షలను నిర్వహిస్తారు. ప్రతిరోజూ రెండు విడతల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. మొదటి విడత ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుంది. బయోమెట్రిక్ హాజరు విధానం అమల్లో ఉన్నందున త్వరగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ప్రారంభానికి రెండు గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తామని తెలిపారు. మొదటి విడత పరీక్షకు ఉదయం 7.30 గంటల నుంచి, రెండో విడతకు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లోకి ఉంటుందని వివరించారు. మొదటి విడతకు ఉదయం 8.45 గంటలకు, రెండో విడతకు మధ్యాహ్నం 1.45 గంటలకు అంటే పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు బ్లాక్/బ్లూ పెన్ను, హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డు (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, పాన్, ఓటరు గుర్తింపు)ను వెంట తెచ్చుకోవాలని సూచించారు. అభ్యర్థులు క్యాలికులేటింగ్ పరికరాలు, లాగరిథమ్ టేబుళ్లు, క్యాలిక్యులేటర్, పేజర్, సెల్‌ఫోన్లు (స్విచ్చాఫ్ చేసి కూడా), స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు వంటివి పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావడానికి అనుమతి లేదని తెలిపారు. ఏమైనా ఇబ్బందులుంటే 7032901383, 9000756178, 7075088812, 7075028881 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

- మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లో స్థిరపడ్డ తెలంగాణ బిడ్డలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024లో ప్రభుత్వ పరంగా ఎందులో చూసినా విజయాల కన్నా.. వైఫల్యాలే ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. మరో నాలుగేండ్ల కాలంలో 420 హామీలను, గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు అన్ని పంటలకు బోనస్ అనీ, ఎన్నికలయ్యాక బోగస్‌గా మిగిల్చారని విమర్శించారు. ఎన్నికల ముందు గ్యారంటీలంటూ ఊదరగొట్టి ఎన్నికల తర్వాత గారడీలు చేస్తున్నారని చెప్పారు. అప్పుడు డిక్లరేషన్లు ప్రకటించి ఇప్పుడేమో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణ సహించం

- టీజీజెన్‌కో ప్రధాన కార్యాలయం ఎదుట ఉద్యోగుల ధర్నా



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థల్ని ప్రయివేటీకరించే చర్యల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని విద్యుత్ ఉద్యోగులు హెచ్చరించారు. నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ అఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ (ఎన్‌సీసీఓఈఈఈ) జాతీయస్థాయిలో ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారంనాడిక్కడి టీజీజెన్‌కో ప్రధాన కార్యాలయం ఎదుట తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గంటసేపు విధులు బహిష్కరించి, ధర్నా నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ రత్నాకర్ రావు, కో- కన్వీనర్ బీసీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందం తదితరులు మాట్లాడారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, చండీగఢ్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని పాలకులు ఉపసంహరించుకోకుంటే దేశంలోని 27 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు ఆందోళనల్లో భాగస్వాములు అవుతారని హెచ్చరించారు. విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణ ప్రయత్నాలను కచ్చితంగా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడ విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణ ప్రయత్నాలు జరిగినా, దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలని జాతీయ కమిటీ జేఏసీ నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఈశ్వరయ్య గౌడ్, మనోరంజన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురేష్‌కుమార్, కిరణ్, బాగయ్య, సతీష్, వెంకటేష్, భాస్కర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్‌లో భారీ అగ్ని ప్రమాదం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఇన్‌స్పెక్టర్ సుధాకర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున బాలాపూర్‌లోని బిస్మిల్లా కాలనీలోని ఓ ప్లాస్టిక్ గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. బాలాపూర్ పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్లాస్టిక్ గోడౌన్ బిస్మిల్లా కాలనీలోనే నివాసం ఉంటున్న మహమ్మద్ హాజీకి చెందినదిగా గుర్తించారు. కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది.



రాజ్యాంగంలో ఎన్నో మార్పులు

75 ఏండ్ల ప్రస్థానం... 106 సవరణలు



పార్లమెంటులో చర్చ అంతంతే

- అధికార, ప్రతిపక్ష పార్టీల ఎజెండాలకే ప్రాధాన్యం

న్యూఢిల్లీ : 75 సంవత్సరాల భారత రాజ్యాంగ ప్రయాణంలో 106 సవరణలు జరిగాయి. 1949 నవంబర్ 29న రాజ్యాంగాన్ని ఆమోదించారు. ఇటీవలి పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్న విషయం తెలిసిందే. రాజ్యాంగాన్ని అనేక పర్యాయాలు సవరించినప్పటికీ కూలంకషంగా చర్చ జరిగిన సందర్భాలు తక్కువేనని చెప్పాలి. అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ ఎజెండాలను ముందుకు తీసికెళ్లేందుకే ప్రయత్నించాయి తప్ప సవరణలపై పెద్దగా సమగ్ర చర్చ జరిపింది లేదు. ఏదేమైనా పరిధిని, వర్తింపును విస్తృతం చేసేందుకే రాజ్యాంగ సవరణలను ఉద్దేశించారు.

1951తో మొదలు

రాజ్యాంగానికి 1951లో తొలి సవరణ జరిగింది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల పురోభివృద్ధి కోసం ప్రత్యేక నిబంధనలను రూపొందించుకునే అధికారం దీని ద్వారా రాష్ట్రాలకు సంక్రమించింది.

1952లో జరిగిన రెండో సవరణ ద్వారా లోక్‌సభలో ప్రాతినిధ్య పరిధిని సవరించారు. ప్రతి సభ్యుడు ఏడున్నర లక్షల మందికి పైగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించేందుకు వీలు కల్పించారు. 1956లో రాజ్యాంగాన్ని ఏడోసారి సవరించారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు ఉమ్మడి హైకోర్టును ఏర్పాటు చేసేందుకు దీని ద్వారా అవకాశం లభించింది. ఏ, బీ, సీ, డీ రాష్ట్రాలను రద్దు చేసి14 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలను ఏర్పాటు చేశారు. కేంద్ర పాలిత ప్రాంతాల ఏర్పాటు తొలిసారి జరిగింది ఈ సవరణ ద్వారానే. 1960లో చేసిన తొమ్మిదవ సవరణ ఫలితంగా భారత భూభాగానికి సవరణలు జరిగాయి. 1958లో భారత్-పాకిస్తాన్ మధ్య కుదిరిన ఒప్పందానికి అనుగుణంగా ఈ సవరణలు చోటుచేసుకున్నాయి.

1961 నుంచి 1975 వరకూ...

1961లో జరిగిన 10వ సవరణతో దాద్రా, నగర్, హవేలీ కేంద్ర పాలిత ప్రాంతంగా ఇండియన్ యూనియన్‌లో చేరింది. అలాగే 1962లో జరిగిన 12వ సవరణ ద్వారా గోవా, డామన్, దయూలు కేంద్ర పాలిత ప్రాంతంగా ఇండియన్ యూనియన్‌లో చేరింది. అదే సంవత్సరం రాజ్యాంగానికి 13వ సవరణ చేసి ప్రత్యేక హోదాతో నాగాలాండ్‌ను ఏర్పాటు చేశారు. ఆ సంవత్సరమే 14వ సవరణ కూడా చేశారు. ఫలితంగా పాండిచ్చేరి ఇండియన్ యూనియన్‌లో చేరింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపుర, గోవా, డామన్, దయూ, పాండిచ్చేరికి చట్టసభలు, క్యాబినెట్లు ఏర్పడ్డాయి. 1966లో 19వ రాజ్యాంగ సవరణ చేసి ఎలక్షన్ ట్రిబ్యునల్స్ వ్యవస్థను రద్దు చేశారు. ఎన్నికల పిటిషన్లను విచారించే అధికారాన్ని హైకోర్టులకు దఖలు పరిచారు. 1967లో 21వ సవరణ ద్వారా సింధి భాషను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూలులో చేర్చారు. 1971లో 24వ సవరణ చేసి రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదాన్ని తప్పనిసరి చేశారు. 1971లోనే 25వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును పరిమితం చేశారు. 1972లో 31వ సవరణ చేసి లోక్‌సభ స్థానాలను 525 నుండి 545కు పెంచారు. 1974లో రాజ్యాంగానికి 35వ సవరణ చేసి సిక్కింకు భారత 'అసోసియేట్ స్టేట్' హోదా ఇచ్చారు. ఆ మరుసటి సంవత్సరం 36వ సవరణ ద్వారా సిక్కింకు పూర్తి స్థాయి రాష్ట్ర హోదా కల్పించారు.

42వ సవరణతో 'మినీ రాజ్యాంగం'

1976లో రాజ్యాంగానికి చేసిన 42వ సవరణ చాలా ముఖ్యమైనది. దీనిని అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ నేతృత్వంలోని భారత జాతీయ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా రాజ్యాంగానికి అనేక సవరణలు తెచ్చారు. అందుకే దీనిని 'మినీ రాజ్యాంగం' అని పిలిచేవారు. ఈ సవరణ ద్వారా భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే ప్రయత్నం జరిగింది. కొన్ని పదాలను మార్చారు. రాష్ట్రాల పరిధిలోని ఐదు అంశాలను ఉమ్మడి జాబితాలో చేర్చారు. క్యాబినెట్ నిర్ణయాలకు రాష్ట్రపతి కట్టుబడి ఉండాలని నిర్దేశించారు. రాష్ట్రాల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తితే కేంద్ర దళాలను పంపేందుకు అనుమతించారు. లోక్‌సభ స్పీకర్, ప్రధానికి ప్రత్యేక విచక్షణాధికారాలు కట్టబెట్టారు. ప్రాథమిక హక్కుల కంటే ఆదేశిక సూత్రాలకే విలువ కల్పించారు. దీనికి సంబంధించి పార్లమెంట్ చేసే ఏ చట్టమైనా న్యాయ సమీక్షకు నిలవాల్సిన అవసరం లేకుండా చేశారు.

1985 నుంచి 2002 వరకూ..

1985లో రాజ్యాంగానికి 52వ సవరణ చేసి ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తీసుకొచ్చారు. 1989లో 61 సవరణ ద్వారా ఓటు హక్కు వయసును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించారు. 1990లో 65వ సవరణను తీసుకొచ్చి ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. 1991లో 69వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్ర పాలిత ప్రాంతమైన ఢిల్లీకి 'నేషనల్ క్యాపిటల్ టెర్రిటరీ ఆఫ్ ఢిల్లీ' పేరిట ప్రత్యేక హోదా కల్పించారు. 70 మంది సభ్యులతో శాసనసభ, ఏడుగురు సభ్యులతో మంత్రిమండలి ఏర్పడ్డాయి. 1992లో 71వ రాజ్యాంగ సవరణ ద్వారా కొంకణి, మణిపురి, నేపాలీ భాషలను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూలులో చేర్చారు. దీంతో మొత్తం అధికార భాషల సంఖ్య 18కి చేరింది. 1992లో 73వ సవరణతో పంచాయతీ రాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. 2002లో చేసిన 86వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ప్రాథమిక విద్యను మౌలిక హక్కుగా గుర్తించారు. 6-14 సంవత్సరాల మధ్య వయస్కులైన పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను ప్రవేశపెట్టారు.

2003 నుంచి...

2003లో 92వ సవరణ ద్వారా బోడో, డోగ్రీ (డోంగ్రీ), మైథిలి, సంథాలి భాషలు అధికార భాషలయ్యాయి. 2009లో రాజ్యాంగానికి 95వ సవరణ చేసి చట్టసభల్లో మరో పది సంవత్సరాల పాటు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను పొడిగించారు. 2011లో చేసిన 97వ సవరణ కారణంగా సహకార సొసైటీలకు రాజ్యాంగ హోదా లభించింది. 2016లో 101వ సవరణతో జీఎస్టీ అమలులోకి వచ్చింది. 2018లో 102వ సవరణ కారణంగా వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి లభించింది. 2019లో రాజ్యాంగానికి 103వ సవరణ చేసి ఆర్థికంగా బలహీన తరగతులకు (ఈడబ్ల్యూఎస్) గరిష్టంగా పది శాతం రిజర్వేషన్లు కల్పించారు. గత సంవత్సరం చిట్టచివరిసారిగా రాజ్యాంగాన్ని 106వ సారి సవరించి చట్టసభల్లో మహిళలకు మూడో వంతు సీట్లను రిజర్వ్ చేశారు.

దుండగులను శిక్షించాలి

- ప్రధానోపాధ్యాయుడిపై దాడి అవమానకరం : టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చావ రవి, వెంకట్
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి : కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు
- తుక్కుగూడలో ప్రధానోపాధ్యాయుడు రాములుకు టీఎస్ యూటీఎఫ్, కేవీపీఎస్ బృందం పరామర్శ



పరామర్శిస్తున్న స్కైలాబ్‌బాబు



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ప్రధానోపాధ్యాయుడు రాములుపై జరిగిన దాడి యావత్ ఉపాధ్యాయ లోకానికి అవమానకరమని, రాములుపై దాడిచేసిన కాషాయ మూకలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చావ రవి, వెంకట్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ప్రభుత్వ పాఠశాలలో అయ్యప్ప మాల వేసుకున్న బాలునికి ప్రధానోపాధ్యాయుని కాలు తగిలిందని కాషాయ మూకలు పాఠశాలపై దాడి చేసి ప్రధానోపాధ్యాయుడిని గాయపరిచిన సంగతి తెలిసిందే. ఈ విషయమై ఉపాధ్యాయుడు రాములును ఆయన నివాసంలో టీఎస్ యూటీఎఫ్, కేవీపీఎస్, ప్రజా సంఘాల బృందాలు మంగళవారం పరామర్శించాయి. ఈ సందర్భంగా చావ రవి, వెంకట్ మాట్లాడుతూ.. తుక్కుగూడ ప్రధానోపాధ్యాయుడిపై దౌర్జన్యం చేసి దాడి చేసిన దుండగులను శిక్షించాలన్నారు. ఘటన జరిగి పది రోజులు అయినా విద్యాశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం శోచనీయమని అన్నారు. ఈ దాడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. ఆ కేసును వెనక్కి తీసుకోవాలని బెదిరింపులకు గురిచేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి పాఠశాలపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించి ఉపాధ్యాయుల మనోభావాలను కాపాడాలని కోరారు.సందర్శించిన వారిలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బోడ సామేల్, కందుకూరి జగన్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగయ్య, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపాల్‌నాయక్, వెంకటప్ప, తదితరులు ఉన్నారు.

ప్రధానోపాధ్యాయునిపై దాడి కిరాతక చర్య

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు

మతోన్మాద దుండగులు ప్రధానోపాధ్యాయునిపై మూక దాడి చేయడం కిరాతక చర్య అని స్కైలాబ్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడు.. భక్తుని కాళ్లు మొక్కడం ఎక్కడైనా చూశామా అని ప్రశ్నించారు. విధి నిర్వహణలో ఉన్న దళిత ప్రధానోపాధ్యాయునిపై ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై వీడియో ఫుటేజ్ ఆధారంగా తక్షణమే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పసికందు ప్రాణం నిలిపిన నిలోఫర్ వైద్యులు

- సుడాన్ దేశ దంపతుల బిడ్డకు ఉచితంగా వైద్యం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సుడాన్ దేశానికి చెందిన దంపతుల నెలరోజుల పసి బిడ్డకు హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రి వైద్యులు అరుదైన చికిత్స అందించి ప్రాణం నిలిపారు. అత్యంత విషమ పరిస్థితుల్లో ఉన్న బాబుకు చికిత్స అందించి, వ్యాధిని పూర్తిగా నయం చేశారు. సుమారు నెల రోజులపాటు నిలోఫర్‌లో పూర్తి ఉచితంగా వైద్యం అందించారు. వివరాల్లోకెళ్తే.. సుడాన్ దేశానికి చెందిన దంపతులు ఐవీఎఫ్ ద్వారా బిడ్డను కనేందుకు ఏడాది కిందట హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడి ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఐవీఎఫ్ చేయించుకోగా, నెల రోజుల కిందట మహిళ మగ బిడ్డకు జన్మనిచ్చింది. బాబుకు పుట్టుకతోనే బ్లడ్ ఇన్‌ఫెక్షన్, బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్ ఉన్నట్టుగా వైద్యులు గుర్తించారు. లంగ్స్‌లోనూ సమస్య ఉన్నట్టుగా తేల్చారు. బాబు పరిస్థితి విషమంగా ఉండటంతో 6 రోజులపాటు ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. సుడాన్ దంపతుల వద్ద డబ్బులు పూర్తిగా అయిపోవడంతో, బాబును నిలోఫర్‌కు పంపించారు. ఆ బాబును అడ్మిట్ చేసుకున్న నీలోఫర్ వైద్యులు, నెల రోజుల పాటు పూర్తి ఉచితంగా చికిత్స అందించారు. బాబు తల్లిదండ్రులకు భోజన వసతి సైతం ఏర్పాటు చేశారు. బాబు పూర్తిగా కోలుకోవడంతో మంగళవారం డిశ్చార్జి చేసినట్టు డాక్టర్ స్వప్న తెలిపారు. తమ బిడ్డను బతికించిన డాక్టర్లకు తల్లి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు ఇప్పటికే ఐదు సార్లు అబార్షన్ అయిందని, ఏండ్లుగా పిల్లల కోసం తపించామని ఆమె తెలిపారు. ఐవీఎఫ్ ద్వారా పిల్లల్ని కనే అవకాశం ఉందని తెలిసి హైదరాబాద్‌కు వచ్చామన్నారు. అయితే, డెలివరీ తర్వాత బాబు పరిస్థితి విషమించిందని, చావు బతుకుల్లో ఉన్న తమ బిడ్డను నీలోఫర్ వైద్యులు కాపాడారని సంతోషం వ్యక్తం చేశారు. విషమ పరిస్థితిలో ఉన్న బాబుకు చికిత్స అందించిన డాక్టర్ల బృందాన్ని, సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ అభినందించారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కండి

- ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు : మంత్రులు డాక్టర్ సీతక్క, కొండా సురేఖ





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క), రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. 'తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, యువతీ యువకులకు, ఉద్యోగులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. పాత వ్యసనాలను విడిచిపెట్టి నూతన ఆశయాలు లక్ష్యాలతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాలి. అప్పుడే జీవితంలో వెలుగులు పూస్తాయి. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో అంతా భాగస్వాములు కండి. సంతోషమైన జీవితం వేరు అర్థవంతమైన జీవితం వేరు. క్షణికమైన సంతోషం కోసం అర్థవంతమైన జీవితాన్ని ఆగం చేసుకోవద్దు. క్షణికమైన సంతోషం కోసం డ్రగ్స్ బారిన పడకండి. దుర్మార్గమైన డ్రగ్స్ ను ధ్వంసం చేద్దాం. ఆరోగ్య తెలంగాణ ను నిర్మించుకుందాం. విలువలతో కూడుకున్న జీవిత లక్ష్యంతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాలని మీ ఇంటి ఆడపడుచుగా కోరుకుంటున్నాను. మద్యం సేవించి వాహనాలు నడపకండి. వేగంతో ప్రయాణాలు చేసి ప్రమాదాలను కొని తెచ్చుకోకండి. డ్రగ్స్ రహిత తెలంగాణ రాష్ట్రం కోసం అందరం ప్రతినబూనుదాం.అందరికీ హ్యాపీ న్యూ ఇయర్' అని సీతక్క ప్రకటనలో పేర్కొన్నారు. 'లక్ష్య సాధనకు ప్రయత్న లోపం లేకుండా కృషి చేస్తూ, అస్తిత్వం ప్రసాదించిన ఈ జీవితాన్ని ఆనందంగా స్వీకరించడమే అర్థవంతమైన జీవితం. యువత తమ అభిరుచులు, ఇష్టాయిష్టాలు, సామర్థ్యం మేరకు లక్ష్యాలను నిర్ధారించుకుని, ఆశావహ దృక్పథంతో ముందుకు సాగండి. ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలి. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి' అని మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు.



ఆ ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ పే ఇవ్వండి

- మంత్రి సీతక్కకు మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సీఆర్టీలు, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఎస్‌వోలు, ఉపాధ్యాయులు, సీఆర్టీలు, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు, సింగరేణిలో పనిచేస్తున్న సీఆర్టీలకు మినిమం బేసిక్ పే ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కోరారు. ఈ మేరకు మంత్రి సీతక్కను మంగళవారం హైదరాబాద్‌లో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు అజ్మీరా నాయక్, అధ్యక్షులు సక్రం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు పసుపులేటి శ్రీను, రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ నాయ్, రూప్లానాయ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం రాములుపై దాడి చేసిన మతోన్మాదులను శిక్షించాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎం రాములుపై దాడి చేసిన మతోన్మాదులను శిక్షించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ పాఠశాలను మంగళవారం టీపీటీఎఫ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ తిరుపతి మాట్లాడుతూ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. విద్యార్థి కాళ్లను హెచ్‌ఎం రాములుతో మొక్కించడం సిగ్గుపడే చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన దుండగులను వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శి వి మనోహర్‌రాజు, మాజీ అధ్యక్షులు రఘునందన్, ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు ఎం ప్రకాశ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్పల్లి లక్ష్మయ్య యాదవ్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్, బాలల హక్కుల సంఘం నాయకులు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో బాధితునికి వీల్‌చైర్ ప్రదానం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పక్షవాతం వచ్చి కాలు, చేయి పని చేయకుండా పోయిన వ్యక్తికి ప్రజావాణి ద్వారా రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి. చిన్నారెడ్డి వీల్ చైర్‌ను అందజేశారు.మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ లోనే కాటేదాన్ టీఎంజీ కాలనీకి చెందిన ఎస్ శేఖర్ ప్రయివేటు కంపెనీలో వాచ్‌మెన్‌గా పనిచేసేవారు. అనారోగ్య సమస్యలేర్పడి పక్షవాతంతో కుడికాలు, కుడి చేయి పనిచేయడం మానేశాయి. తన సమస్యను విన్నవించుకునేందుకు శేఖర్ మొదటిసారిగా మంగళవారం ప్రజావాణికి వచ్చారు. శేఖర్ నడవలేని పరిస్థితిని గమనించిన చిన్నారెడ్డి ప్రజావాణి ద్వారా వీల్‌చైర్‌లో అందజేశారు. దీంతో శేఖర్ సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఆనంద భాష్పాలతో సీఎం రేవంత్ రెడ్డికి చిన్నారెడ్డికి, దివ్యకు శేఖర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజావాణి బాధ్యులు రాకేష్ రెడ్డి, జగన్, సాయి, సహదేవ్, శేషు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 354 అర్జీలు

మహాత్మాజ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 354 అర్జీలు నమోదయ్యాయి. ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కొన్ని అర్జీలపై ఎండార్స్‌మెంట్ చేసి సంబంధిత అధికారులకు పంపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 141, విద్యుత్ శాఖకు 71, రెవెన్యూ శాఖకు 42, ఇతర శాఖలకు సంబంధించి 100 అర్జీలందాయి.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

● డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అదనపు డైరెక్టర్ (అడ్మిన్) కాకుమాను శశి శ్రీ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్ర ప్రజలకు, మహిళలకు, వైద్యులకు, ప్రజా వైద్య ఉద్యోగులందరికీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అదనపు డైరెక్టర్ (అడ్మిన్) కాకుమాను శశి శ్రీ నూతన శుభాకాంక్షలు తెలిపారు. కోఠిలోని ఆమె ఛాంబర్‌లో మాట్లాడుతూ.. కొత్త సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శ్రేయస్సును తీసుకురావాలని, వారి ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని కోరుకున్నారు. 2025లో సైతం అన్ని రకాల సామాజిక రుగ్మతలపై పోరాటాన్ని విజయవంతంగా కొనసాగించడంతో పాటు, సమానత్వం, శాంతియుత, సుస్థిర, మహిళ సాధికారత, ఆరోగ్యకర సమాజం కోసం కొత్త సంవత్సరం సందర్భంగా అందరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

'ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా జూనియర్ లెక్చరర్స్, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఎస్‌వి ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. జూనియర్ లెక్చరర్స్ పోస్టులకు ఇంగ్లీష్, కెమిస్ట్రీ, ఎకనమిక్స్ టూరిజం అండ్ హాస్పిటల్ మేనేజ్మెంట్, పీజీటీ పోస్టులకు బయోసైన్స్, పీజీటీ సోషల్ వాటికి విద్యార్హత ఆ సబ్జెక్ట్ కు పోస్ట్ గ్రాడ్యుయేషన్ తో పాటు బీఈడీ చేసి మూడు ఏండ్ల అనుభవం ఉండాలన్నారు. పీజీటీ ఇంగ్లీష్ పోస్టులకు బ్యాచిలర్ డిగ్రీలో ఇంగ్లీష్‌తో పాటు టెట్ అర్హత ఉండి మూడు ఏండ్ల అనుభవం ఉండాలని తెలిపారు. డిప్యూటీ వార్డెన్ కు డిగ్రీ ప్లస్ బీఎడ్, పీజీడీసీఏ విద్యార్హత ఉండి (22-34)వయస్సు ఉండాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు డిగ్రీతో పాటు పీజీడీసీఏ ఉండి (20-34) వయస్సు కలిగి ఉండాలన్నారు. 04-01-2025 వరకు వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను నాంపల్లి హజ్ భవన్, ఆరో అంతస్తులో డీఎండబ్ల్యూఆర్ఎల్సీ కార్యాలయంలో అందజేయాలని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

విద్యుత్ ప్రయివేటీకరణ కుట్రలు తగవు..



● సీఐటీయూ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రావణ్ కుమార్

● సీఐటీయూ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన..

నవతెలంగాణ-ధూల్‌పేట్

బీజేపీ ప్రభుత్వం కుట్ర పూరిత విద్యుత్ ప్రయివేటీకరణ విధానాలు తగదనీ సీఐటీయూ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం. శ్రావణ్ కుమార్ అన్నారు. విద్యుత్ రంగ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సీఐటీయూ హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన ఐ.ఎస్ సదన్ సంతోష్ నగర్ చౌరస్తాలో చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని నాయకులు, రాములు, సురేష్ లతో కలిసి ప్రసంగించారు. కేంద్రంలో మూడవసారి ఏర్పడిన మోడీ ప్రభుత్వం గతంలో కన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక వినాశకర విధానాలను అవలంభిస్తుందన్నారు. విద్యుత్ రంగంపై బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తుందన్నారు. చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో డిస్కంలనూ ప్రయివేట్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రాలలో దొడ్డిదారిన స్మార్ట్ మీటర్లు నెలకొల్పడం ద్వారా విద్యుత్ ప్రయివేట్ చేసే ప్రయత్నాలు ముమ్మరం చేశారన్నారు. పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్‌లను గుంపగుత్తగా ఔట్ సోర్సింగ్ చేయమని ఆదేశించడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లు అమలు సహా అన్ని కాంట్రాక్టులు కట్టబెట్టారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేట్ చేయడానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యుత్ రంగ కార్మికులు వీరోచిత పోరాటం చేస్తున్నారన్నారు. చండీగఢ్, ఉత్తరప్రదేశ్ పోరాటంలో కార్మికులు అగ్రభాగాన నిలుస్తున్నారన్నారు. ప్రవేటికరిస్తే ప్రజలపై కార్మికులకు చాలా నష్టాలు వాటిలే ప్రమాదం ఉందన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలను ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకించాలని పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్. కిషన్, జంగయ్య, బాలు, లతీఫ్, కోట య్య, సోమన్న, బిక్షం రెడ్డి, పంతులు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● విజయవంతంగా 90 రోజులు పూర్తి
● 2200 కిలోమీటర్ల పైపులైన్, 1.75 లక్షల మ్యాన్ హెూళ్లలో డీ-సిల్టింగ్ పనులు
● అధికారులు, సిబ్బందికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక అభినందనలు
● మరో 90 రోజులు డ్రైవ్ పొడిగించాలని ఆదేశం
● సమష్టి కృషి వల్లే మంచి ఫలితాలన్న ఎండీ అశోక్ రెడ్డి

స్పెషల్ డ్రైవ్ సక్సెస్





నవతెలంగాణ-సిటీబ్యూరో

క్షేత్రస్థాయిలో వినియోగదారుల సమస్యల పరిష్కారంతో పాటు జలమండలి సేవలు మరింత మెరుగుపర్చడమే కాకుండా నష్టాల నుంచి గట్టెక్కించే విధంగా ప్రత్యేక ప్రణాళికలతో ఎండీ అశోక్‌రెడ్డి చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సక్సెస్ అయింది. సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ- హైదరాబాద్, ఇంకుడు గుంతల నిర్మాణమే లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజులు స్పెషల్ డ్రైవ్ మంగళవారంతో విజయవంతంగా పూర్తయింది. గాంధీ జయంతిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ డ్రైవ్ ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి డిసెంబర్ 31 మంగళవారం వరకు నగరంలోని ప్రాంతాల్లో నిర్విరామంగా డీ-సిల్టింగ్ పనులు నిర్వహించారు. ఫలితంగా ఇప్పటి వరకు ఈ డ్రైవ్ ద్వారా 17050 ప్రాంతాల్లో 2,200 కిలో మీటర్ల సీవరేజ్ పైపులైన్, 1.75 లక్షల మ్యాన్ హెూళ్లలో డీ-సిల్టింగ్ పనులు పూర్తి చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్ ఫలితంగా రోజూ వచ్చే సీవరేజ్ ఫిర్యాదులు 30 శాతానికి తగ్గాయి.

ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా..

ఈ స్పెషల్ డ్రైవ్ విజయవంతం కావడంతో సీఎం రేవంత్ రెడ్డి జలమండలి అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ 90 రోజుల్లో మంచి ఫలితాలు రావడంతో ఈ డ్రైవ్‌ను మరో 90 రోజులు పొడగించాలని ఆదేశించారు. ఇదే ఊపును రానున్న రోజుల్లో కొనసాగించి మిగిలిన పైపులైన్లు, మ్యాన్ హెూళ్లలో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం నాటికి సీవరేజ్ పైపులైన్లు, మ్యాన్ హెూళ్లలో వ్యర్థాలు లేకుండా చూడాలని పేర్కొన్నారు.

రోజూ వారీ పర్యవేక్షణకు డాష్ బోర్డ్

స్పెషల్ డ్రైవ్ పనుల్ని రోజూవారీగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక డాష్ బోర్డ్ ఏర్పాటు చేశారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో, కలుషిత నీరు, రోడ్లపై సిల్ట్ తదితర వాటిపై ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను ఆయా క్యాన్ నంబర్లను జీపీఎస్ ఆధారంగా గూగుల్ మ్యాప్ లో నమోదు చేశారు. ఈ నమోదు ఒక్కో ప్రాంతంలో ఎన్ని సార్లు ఫిర్యాదులు అందినవి, ఎన్నిసార్లు పరిష్కరించిన వివరాలను ఆ మ్యాప్ లో ఒక బబుల్ (బుడగ) లా కనిపించేలాగా ఏర్పాటు చేశారు. వచ్చిన ఫిర్యాదుల సంఖ్యను బట్టి.. ఆ బబుల్ పరిమాణం మారేలా ఏర్పాటు చేశారు. దీని వల్ల సమస్య తీవ్రతను బట్టి దాన్ని పరిష్కరించారు. ఈ డాష్ బోర్డును ఇప్పటి వరకు శుభ్రం చేసిన పైపు లైన్ల పొడవు, మ్యాన్ హెూళ్ల సంఖ్య వివరాలు ఫొటోలతో సహా.. అప్ లోడ్ చేసేలా రూపకల్పన చేశానరు. సిల్ట్ కార్టింగ్ వాహనాలు తిరిగే ప్రాంతాలు జీపీఎస్ సహకారంతో తెలుసుకునే వెసులుబాటు కల్పించామని చెప్పారు. ఎక్కడైనా కొత్త పైపులైన్ల నిర్మాణ ప్రతిపాదనను సైతం నమోదు చేసేలా రూపొందించినట్లు పేర్కొన్నారు. అన్ని రకాల రిపోర్టులను తయారు చేసి, వాటిని విశ్లేషించుకునే సౌకర్యం సైతం కల్పించారు.

మూడేళ్ల ఫిర్యాదుల విశ్లేషణ

ఈ స్పెషల్ డ్రైవ్ పకడ్బందీగా అమలు చేసేందుకు గత మూడేళ్లలో వచ్చిన సీవరేజ్ ఫిర్యాదుల్ని విశ్లేషించారు. ప్రధానంగా వినియోగదారుల ఇళ్లల్లో చోకేజీ, రోడ్లపై సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్యల్ని గుర్తించారు. రోజూ వచ్చే ఫిర్యాదుల్లో 60 శాతం ఇవే రావడంతో వాటిపై దృష్టి సారించి పరిష్కరించారు.

సిబ్బంది కృషి ఎంతో అమోఘం : ఎండీ అశోక్ రెడ్డి

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఈ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించామని ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. స్పెషల్ డ్రైవ్ విజయవంతం కావడంలో జలమండలి అధికారులు, సిబ్బంది కృషి ఎంతో ఉందని కొనియాడారు. అందరి సమష్టి కష్టం వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ డ్రైవ్ పై సీఎం నుంచి ప్రశంసలు రావడం హర్షణీయమన్నారు. రాబోయే రోజుల్లో ఇంతకు మించి సామర్థ్యంతో కష్టపడతామని తెలిపారు.

విపక్ష లేని వ్యవస్థ నవ సమాజ నిర్మాణ స్థాపన కోసం కృషి

సోషలిస్ట్ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ వ్యవస్థాపకులు జాతీయ కార్యదర్శి బి.పురుషోత్తం



నవతెలంగాణ-ముషీరాబాద్

సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ రాష్ట్రంలో భారతదేశంలో విపక్ష లేని వ్యవస్థ నవ సమాజ నిర్మాణ స్థాపన కోసం పనిచేస్తుందని వ్యవస్థాపకులు జాతీయ కార్యదర్శి బి.పురుషోత్తం తెలిపారు. మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. సోషలిస్ట్ పార్టీ యొక్క సిద్ధాంతం ఎన్నో పార్టీలు అధికార దాహంతో ఎన్నికల ముందు సాధ్యం కానీ హామీలు ఇచ్చి తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వాలను నేటికీ చూస్తూనే ఉన్నామన్నారు. ఉచితల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని గెలిచి సీటు మీద కూర్చొని నిత్యావసర వస్తువులు వివిధ వస్తువులపై విపరీతంగా రేట్లు పెంచుతూ ప్రజలపై భారం వేస్తున్న ఇప్పుడున్న ప్రభుత్వాలను మనం చూస్తూనే ఉన్నామని ప్రజలకు ఉచితం అని చెప్పి ప్రజల ద్వారానే డబ్బులు లాగుతున్నారని ఇలాంటి ప్రభుత్వాలకు బుద్ధి వచ్చేలా ఉచితం ముద్దు కాదు.. పరి పాలన ముద్దు అనే నినాదంతో సోషలిస్ట్ ఆఫ్ ఇండియా యునైటెడ్ నవ సమాజ నిర్మాణ స్థాపనకు నడుము కట్టి ముందుకు ప్ర యాణి స్తున్న వాటిని స్వాగతించాలన్నారు. దేశం, రాష్ట్రంలో నెలకొన్న కులతత్వం మూఢనమ్మకాలు మొదలగులు భావాల నుండి విముక్తి చేస్తూ పార్టీ అభ్యుదయ భావాలను పెంపొందించుటకు ముందుకు సాగుతున్న ఏకైక సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ అన్నారు.

దాడి చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి

● కేవీపీఎస్ నగర నాయకులు రాములు, సుబ్బారావు



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రధానోపాధ్యాయునిపై భక్తి పేరుతో దాడి చేసిన వారిపై తక్షణమే మతోన్మాద దుండగులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ నగర నాయకులు రాములు, సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగా రెడ్డి జిల్లా తుక్కుగూడలోని పాఠశాలలో విధి నిర్వహణలో ఉన్నటువంటి దళిత ప్రధానోపాధ్యాయుడిని మాలలో ఉన్న విద్యార్థిని తాకరని భక్తి పేరుతో కాళ్లు మొక్కించడం దుర్మార్గమని, వెంటనే అధికారులు స్పందించి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబర్‌పేట శివం రోడ్డులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా నాయకులు జి.రాములు, నగర కార్యదర్శి బి.సుబ్బారావు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచిన అమిత్ షా ఘటన మరువకముందే దళితులపై దాడి చేసిన మరో ఘటన చోటు చేసుకుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎస్పీ, పాఠశాలను సందర్శించి ఈ దుశ్చర్యకు పాల్పడినటు వంటి వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు యేసు, దాసు, నర్సింగ్‌రావు, పాషా, తదితరులున్నారు.

అమిత్‌షాను పదవీ నుంచి బర్తరఫ్ చేయాలి

● సీపీఐ(ఎం) నాయకులు మల్లేష్



నవతెలంగాణ-మెహిదీపట్నం

రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ ను అవమానించేలా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేయడం దారుణమని సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కన్వీనర్ మల్లేష్ అన్నారు. అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ నాంపల్లి లక్ష్మీ నగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అవమానించిన అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అమిత్ షా అహంకారపూరిత వ్యాఖ్యలు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల బీజేపీ వైఖరిని స్పష్టం చేస్తుందన్నారు. అమిత్ షా తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ నాయకులు వెంకటస్వామి, సుధాకర్, రమేష్, సిద్దయ్య జనార్దన్, కృష్ణ, స్వర్ణ, నరసమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఐఎన్‌టీయుసీ బలోపేతానికి కృషి చేయాలి'



● ఐఎన్‌టీయుసీ జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

శ్రామిక వర్గానికి బలియమైన గొంతుకైనా ఐఎన్‌టీయుసీని బలోపేతానికి కృషి చేయాలని ఐఎన్‌టీయుసీ జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల కోసం వాదించడంలో శక్తిమంతమైన సాధనంగా ఐఎన్‌టీయుసీ నేడు దేశంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు .వీఎస్టీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలుపొందిన జి.సంజీవరెడ్డిని హైదరాబాద్, ఐఎన్‌టీయుసీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఐఎన్‌టీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జలమండలి కంగర్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ భూమయ్య, కార్యవర్గ సభ్యులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జి.సంజీవరెడ్డి మాట్లాడుతూ సరసమైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు, సామాజిక న్యాయం అందించడానికి గత కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వాలు 44 కార్మిక చట్టాలను తీసుకువచ్చి అమలు చేసిందని, నేడు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్లను తీసుకువచ్చి దేశ కార్మికుల ప్రయోజనాలను దెబ్బ తీసిందని ఆరోపించారు. అనంతరం మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మికుల జీవన స్థితిలో అంతరాయం కలుగుతుందని, విభిన్న రంగాలలోని కార్మికుల హక్కులు, సంక్షేమం రక్షణకై ఐఎన్‌టీయుసీ అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. భవిష్యత్తులో బలమైన పోరాటాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

శ్రమ దోపిడీకి గురవుతున్న డంపింగ్ యార్డు కార్మికులు

● హెచ్ఎంఎస్ డబ్ల్యూ ప్రెసిడెంట్ అశోక్



నవతెలంగాణ-ధూల్‌పేట్

డంపింగ్ యార్డు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నా రనీ సీఐటీయూ డంపింగ్‌యార్డ్ హెచ్ఎంఎస్‌డబ్ల్యూ ప్రెసిడెంట్ అశోక్ అన్నారు. జియాగూడ డంపింగ్ యార్డ్‌లో హెచ్ఎంఎస్‌డబ్ల్యూ అనుబంధ సంఘం సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ సౌత్ జిల్లా అధ్యక్షురాలు మీనా నాయకులతో కలిసి జెండా ఆవిష్క రించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తులుగా ఆయనతో పాటు డంపింగ్ యార్డ్ హెచ్ఎంఎస్‌డబ్ల్యూ జనరల్ సెక్రెటరీ రమేష్, సీఐటీయూ సౌత్ జిల్లా సెక్రెటరీ శ్రావణ్ కుమార్, మాజీ కార్యదర్శి విఠల్‌లు హాజరై మాట్లా దారు. కాంట్రాక్టు పద్ధతిలో పని చేసే కార్మికులు అన్యాయానికి, అక్రమానికి, శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు. కార్మికుల కనీస భద్రత లేకుండా పోయిందన్నారు. చిన్న చిన్న కారణాలతో కార్మికులను ఇబ్బంది పెడుతు బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. చెత్త సేకరణ కార్మికులకు 12 నుండి 14 గంటలు పని భారం పెరిగిందన్నారు. బీఎంఎస్ కార్మికుల పక్షాన కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వారి చర్యలను తిప్పి కొట్టేందుకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు మన పోరాటం ఆపవద్దని సీఐటీయూ కార్మికులకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో డంపింగ్‌యార్డు కార్మికులు పాల్గొన్నారు.

భవిష్యత్తును చిత్తు చేస్తున్న మత్తు..

తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఏ.కరీం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మనసులో కలిగే భావాలకు మూలం మన ఆలోచన లేనని భవిష్యత్తుని బంధించే మత్తుకి బానిస కావొద్దని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఏ.కరీం అన్నారు. బాల్యదశలో పాఠశాల విద్యార్థులు దారితప్పి వివిధ రకాల మత్తుకు మాదక ద్రవ్యాలకు అలవాటుపడి పోతున్నారని ఇది చాలా ఆందోళనకర విషయమన్నారు. మత్తు మాదక ద్రవ్యాల నివారణకు ప్రభుత్వం తీవ్ర స్థాయిలో చట్టపరమైన చర్యలు తీసుకున్నపటికి పిల్లల పట్ల తలిదంద్రుల పర్యవేక్షణ లోపం కారణంగానే పిల్లలలో ఈ వ్యసనం అధికం అవుతుందన్నారు. మంగళవారం నాంపల్లిలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన మత్తు, మాదకద్రవ్యాల నిర్మూలనకు చేపట్టిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2025 సంవత్సరం మొత్తం మత్తు మాదకద్రవ్యాల నిర్మూలనకు రాష్ట్ర వ్యాప్తంగా వ్యసన విముక్తి ఉద్యమ సంవత్సరంగా ప్రకటించారు. నిత్యం పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని, పిల్లలు అంతర్జాల వ్యసనానికి బానిస కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని స్నేహం ముసుగులోనే వారు కొత్తతరహా మత్తుకి అలవాటు పడుతున్నారు. పిల్లల మానసిక ప్రవర్తన లో ఏమాత్రం మార్పు గమనించిన వెంటనే మానసిక నిపు ణులను సంప్రదించాలని మత్తు మాదక ద్రవ్యాల నివార ణకు తెలంగాణ రాష్ట్ర సైకలాజికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆన్ లైన్, ఫోన్ వీడియో లేదా ఆడియో ద్వారా తక్షణ సహాయం అందించుటకు మానసిక నిపుణులు అందుబాటులో ఉంటారని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఏ.కరీం తెలిపారు. పిల్లల ప్రవర్తనను గమనిం చాలని ఒంటరిగా ఉంచకూడదు. ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలని మనసుని నొప్పించే మాటలు మాట్లాడకూడదని భవిష్యత్తు ఇక్కడితో ఆగిపోలే దని ఇంకా చాలా గొప్పగా ఉంటుందని తెలిపారు. సమస్య తీవ్రతను ఎదుర్కోలేని సమయంలో ఉచిత మానసిక సహాయం కొరకు 040-35717915 లేదా 9440488571 నెంబర్ పై సంప్రదించాలని సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ కరీం కోరారు. అనంతరం ఈ వ్యసన మహమ్మారి వలన కలిగే అనర్థాల గురించి పిల్లలలో విల్ పవర్ పెంచే పలు మైండ్ కంట్రోలింగ్ కెపాసిటీ టెక్నిక్స్ సూచించారు. ఈ కార్యక్రమంలో మానసిక నిపుణుల కమిటీ ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ ఆకాష్ జూనియర్ కాలేజీలో విద్యార్థుల ఆటపాట

● కాలేజీ ఫౌండర్ డైరెక్టర్ ఈశ్వరయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

శ్రీ ఆకాష్ జూనియర్ కాలేజ్ విద్యార్థుల ఆట పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయని కాలేజీ ఫౌండర్ డైరెక్టర్ ఈశ్వరయ్య తెలిపారు. బాగ్ లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో శ్రీ ఆకాష్ జూనియర్ కాలేజ్ ఫేస్ అత్యంత ఘనంగా జరిగింది. ఈ పేస్ట్‌లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభ ఉందని చదువుతోపాటు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆకాష్ జూనియర్ కాలేజ్ యొక్క ప్రత్యేకత అన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి చూసిన వారవుతామని తెలిపారు. నాణ్యమైన చదువుకు నిదర్శనమైన మా కాలేజీ సంస్థలలో ప్రతి కార్యక్రమాన్ని పండుగల చూసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిరెడ్డి స్వప్న, శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ వంశీధర్ రెడ్డి, విప్ గోపాల్ రెడ్డి, స్వప్న, సుధాకర్ రెడ్డి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

'జలమండలి కార్మికుల సమస్యల పరిష్కారానికి తగు ఆదేశాలు జారీ'


● జలమండలి కంగార్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జలమండలి కార్మికుల సమస్యల పరిష్కారానికి జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి తగు ఆదేశాలు జారీ చేశారని ఐఎన్‌టీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జలమండలి కంగార్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి వెల్లడించారు. మంగళవారం ఖైరతాబాద్ జలమండలి కార్యాలయంలో కాంగార్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం జలమండలి కార్మికుల సమస్యలపై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. వివిధ సర్కిల్ లలో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్స్ జీపీఈ నుండి ఎస్పీఈ టెక్నికల్ గ్రేడ్-2, అన్ని బ్రాంచీలు, బోర్డులో ఖాళీగా ఉన్న ఆఫీసర్, సీనియర్ ఆఫీసర్, జేటీఓ, క్యూఏటీ అఫ్ గ్రేడ్ ప్రమోషన్, ఎన్.వేణుగోపాల్ జేటీఓ పెండింగ్ ప్రమోషన్‌లపై చర్చించాలని, జలమండలి కార్మికులకు ఉచిత హెల్త్ కార్డులు తదితర డిమాండ్లపై తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీంతో మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారని రాజిరెడ్డి తెలిపారు. యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ బి. భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామరాజు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. సురేష్ బాబు, కార్యవర్గ సభ్యులు రఘునాథ్, నాగరాజు వర్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జిందాబాద్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం హెచ్‌సిఎఫ్, హైదరాబాద్ జిందాబాద్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను టూరిజం సాంస్కృతి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హైదరాబాదు నగర అభివృద్ధి, అనేక వైభవాలతో కూడిన చిత్రాలతో క్యాలెండర్ రూపొందించటం జరిగింది. హైదరాబాద్ ఒక నివాసయోగ్యనగరంగా అభివృద్ధి చెందాలని, పర్యావరణం, పబ్లిక్ హెల్త్, ప్రజా రవాణా పరిరక్షణకు హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం కృషి చేస్తుందని తెలిపారు. పర్యావరణ సమస్యలపై హెచ్‌సీఎఫ్, హైదరాబాద్ జిందాబాద్ చేస్తున్న కృషిని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహిస్తున్న తీరును మంత్రి అభినందించారు. క్యాలెండర్ ఆవిష్కరణకు సమ యం ఇచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు హైదరాబాద్ సిటి జెన్స్ ఫోరం కార్యవర్గం ధన్యవాదాలు తెలియజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎఫ్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వీరయ్య, సీనియర్ నాయకులు బికె రెడ్డి, రాజీవ్ కుమార్, మోహన్ నాయుడు, శ్రీనివాసరావు, సంగీత, గోపాల్, నాగేష్, శంకరయ్య, సత్య తదితరులున్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్ర ప్రజలకు శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. యువ నాయకులు సామాజిక కార్యకర్త దినకరన్ రాష్ట్ర వ్యాప్తంగా నూతన సంవత్సరం ప్రజలు సుఖ సంతోషంగా ఉండాలని కోరా రు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా బాధ్యతతో నడుస్తూ ముం దుకెళ్లాలని సూచించారు. పట్టు వీడని ఆత్మస్థైర్యంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని కోరారు.



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఎమ్మెల్సీ కవితను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన గోషామాల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆర్‌వి మహేందర్ కుమార్ తదితరులు

సెక్యూర్ ప్లస్ ఇన్సూరెన్స్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నూతన ఏడాది వేడుకలు..

నవతెలంగాణ-ధూల్‌పేట్

బహదూర్‌పూర నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్‌తో సెక్యూర్ ప్లస్ ఇన్సూరెన్స్ సర్వీ సెస్ సంస్థ ఆధ్వర్యంలో నూతన ఏడాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ఆయనతో పాటు చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకాత్‌పుర కాంగ్రెస్ ఇన్‌చార్జిలు ముజీబ్ ఉల్లాహ్ షరీఫ్, బోయ నగేష్, రవి రాజ్, ఆ సంస్థ భాగస్వాములు, కంచారపు వెంకట సురేష్, సందేళ ప్రశాంత్‌లతో కలిసి 2025వ ఏడాదిని స్వాగతిస్తూ కేక్ కట్ చేశారు. అడ్వకేట్ గిరిధర్, రవీందర్, భాగ్య, అనురాధ, మమత, వినయ్, సంజన రెడ్డి, శైలజ, శిరీష, శ్రీ లక్ష్మి, అశ్విని, లావణ్య సౌమ్య, అపర్ణ తదితరులు పాల్గొన్నారు..

హమాలీ కార్మికులకు లైసెన్సులు ఇవ్వాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు లైసెన్సు లు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ హమాలీ యూనియన్ నగర కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. సీఐటీయూ హమాలి యూనియన్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. హమాలీ కార్మికులకు లైసెన్సులు ఇన్సూరెన్స్ సౌకర్యం పనిచేస్తున్న మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమావే శంలో మార్కెట్ సెక్రెటరీ, కార్మికులు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం కాప్రా డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి గూడ, మహమ్మదీయ కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించారు. రోడ్లు, డ్రయినేజీలపై స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, వాటర్ వర్క్ డీజీఎం సతీష్, ఏఈలు సూరజ్ , రోహిత్, ఎలక్ట్రిక్ ఏఈ సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు బద్రుద్దిన్ తదితరులున్నారు.

ప్రభుత్వ భూములను కబ్జాదారుల చెర నుంచి కాపాడండి

ప్రజావాణిలో బోడుప్పల్ అఖిల పక్ష నాయకుల ఫిర్యాదు

నవతెలంగాణ-బోడుప్పల్

ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాల్సిన ప్రభుత్వ భూములు కబ్జా దారుల చేర నుండి విముక్తి చేయాలని బోడుప్పల్ అఖిల పక్ష పార్టీల నాయకులు మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అఖిల పక్ష పార్టీ అధ్యక్షుడు వై.బాల్ రాజుగౌడ్ మాట్లాడుతూ బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబరు 63/1, 63/26 నుండి 63/38 వరకు గల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు తప్పుడు ధృవీకరణ పత్రాలను సృష్టించి క్రయవిక్రయాలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమికి కంచె వేయాలని కోరారు. దీనిపై హైడ్రా కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామనిన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ ప్రధాన కార్యదర్శి చీరాల జంగయ్య, సలహాదారులు ఏనుగుల లక్ష్మయ్య, సాయిని అమృతం, రాపోలు శంకరయ్య, తలారి కృష్ణ యాదవ్, రాపోలు రమేష్, ఉన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు 4, 10వ వార్డులలో రూ.10 లక్షల నిధుల వ్యయంతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణ పనులను కౌన్సిలర్లు తుడుం గణేష్, బత్తుల శివకుమార్ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. 18వ వార్డులో రూ.5లక్షలు, 21వ వార్డులో రూ.8లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్లు పాలకుర్తి భవానీ రాఘవేందర్ గౌడ్, నారెడ్డి కృష్ణవేణి రవీందర్ రెడ్డి కలిసి ప్రారంభించారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి తన మార్క్ పాలనతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. ప్రతి వార్డులో నూతన సీసీ రోడ్లు, డ్రయినేజీలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బి.నాగిరెడ్డి, నాయకులు మర్రి నరసింహ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, రవీందర్ రెడ్డి,శ్యామ్ రావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కమలానగర్ సంక్షేమ సంఘం నూతన సంవత్సరం కాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాప్రా

కమలానగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కాలెండర్‌ను రాచకొండ పోలీసు కమిషనరేట్ అదనపు డీసీపీ ఎస్.వెంకటరమణ ఆవిష్కరించారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొజ్జ రాఘవరెడ్డి, కార్యదర్శి సిఎస్ రావు, ఉపాధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, కోశాధికారి సిహెచ్ మనోహర్ రావు, ప్రతినిధులు ఆర్.సహదేవ్, సలహాదారులు వరకాల పెంటయ్య గౌడ్, ఏవీఆర్ దత్తు, సి.దశరథ, ఆర్.దశరథ గౌడ్, జనార్ధన్‌గౌడ్, వంజరి ప్రవీణ్ కరిపే పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పరమేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-కాప్రా

ఏఎస్ రావు నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను డివిజన్ అధ్యక్షులు కొశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌రావు నగర్ డివిజన్ అధ్యక్షులు కాశెట్టి ప్రసాద్, అజీజ్, లింగం, సుంకు శ్రీకాంత్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మామిడి శ్రీనివాస్, అనిల్, పాషా, చందు పాల్గొన్నారు.

మన్నె సుబ్రమణ్యం జ్ఞాపకార్థం అన్నదానం

నవతెలంగాణ-కాప్రా, చర్లపల్లి

మన్నె సుబ్రమణ్యం జ్ఞాపకార్థం ఉత్తరాంధ్ర సేవా సమితి ఆధ్వర్యంలో కుషాయిగూడ ఇండస్ట్రియల్ క్యాంటీన్ దగ్గర సంతాప సభ ఏర్పాటు చేసి మూడు వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, టీజీకే మూర్తి, సబ్బినేని వాసు పాపారావు, వెంకట్రాం, వాసిరెడ్డి శివ ప్రసాద్, యన్ పి బోస్, ఉప్పలపాటి రఘు, మధు, శేషు, నీరుకొండ సతీష్‌బాబు, కిషోర్, కింగ్స్ బాబు, శ్యాంసన్, గోపాల్, హనుమంత్‌రెడ్డి, ఉత్తరాంధ్ర సేవా సమితి నాయకులు తరకేశ్వరరావు, అజయ్ కుమార్, అప్పన్న ధనుంజయ, సింహాచలం, లక్ష్మణ్, ఎర్రం నాయుడు, చందు తదితరులు పాల్గొన్నారు.

'మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు' సినిమాకు ఉత్తమ డాక్యుమెంటరీ ఫిల్మ్ అవార్డు

నవతెలంగాణ-కాప్రా

డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన వేదిక నిర్మించిన 'మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు' డాక్యుమెంటరీ బయోపిక్ సినిమాకు ఉత్తమ డాక్యుమెంటరీ ఫిల్మ్‌గా అవార్డు వరించింది. ఇంటర్నేషనల్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంహాల్లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి పిబి చారి, అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు, ఉపాధ్యక్షులు జి శివరామకృష్ణ, ఫిలిం డైరెక్టర్ రఘురామచంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీడీఎల్ సత్యనారాయణ పాల్గొని అవార్డు స్వీకరించారు. బెంగాలీ, తమిళం, కేరళ, ఒరిస్సా, హిందీ రాష్ట్రాల నుండి అనేక సినిమాలకు అవార్డులు వచ్చాయి. తెలుగులో పొట్టి శ్రీరాములు బయోపిక్ సినిమాకు ఉత్తమ బయోపిక్ అవార్డు వచ్చింది. సాగరవాసి చిత్రంలో నటించిన బీడీఎల్ సత్యనారాయణకు ఉత్తమ నటుడు అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా పలువురు కళాకారులు తమ కళా ప్రదర్శనతో చూపరులను ఆకట్టుకున్నారు.

న్యాయబద్ధమైన, చట్టబద్ధమైన ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- హైదరాబాద్ సిటీ అడిషనల్ డీసీపీ, హ్యూమన్ రైట్స్ సంస్థ గౌరవ సలహాదా రులు రాందాస్ తేజవత్
- ఘనంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ డే
- పలువురికి అవార్డులను అందించిన హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సమాజంలో చట్టబద్ధమైన, న్యాయబద్ధమైన ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని హ్యూమన్ రైట్స్ సంస్థ ఫౌండర్, చైర్మెన్ అయ్యప్ప బరిగే, హైదరాబాద్ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజవత్ అన్నారు. మంగళవారం వరల్డ్ హ్యూమన్ రైట్స్ డే సందర్భంగా మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా రాష్ట్ర చైర్మెన్, రాష్ట్ర అధ్యక్షులు మోమిన్ బాషా ఆధ్వర్యంలో వరల్డ్ హ్యూమన్ రైట్స్ డే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హ్యూమన్ రైట్స్ సంస్థ ఫౌండర్, చైర్మెన్ అయ్యప్ప బరిగే, హైదరాబాద్ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజవత్, గాడ్స్ సర్వెంట్స్, అండ్ సోషల్ వర్కర్ జడ రమేష్ పౌల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హ్యూమన్ రైస్ బాధ్యులు సమాజంలో జరుగుతున్న కుల, మతం, ప్రాంతం, మహిళలు, బాల కార్మికుల హక్కులపై జరిగే అన్ని రకాల హింసలను, అసమానతలపై పనిచేస్తూ, చట్టబద్ధంగా, న్యాయ బద్ధంగా, ప్రజా సమస్యలపై పోరాడాలని తెలిపారు. అనంతరం ఈ సమావేశంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలోని వారికి క్రియాశీలిక బాధ్యతలను అప్పగిస్తూ, నియామక పత్రాలను ఇచ్చారు. అనంతరం సోషల్ యాక్టివ్‌గా పాల్గొన్న హ్యూమన్ రైట్స్ ప్రతినిధులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు, ఎస్ కృష్ణ, గ్రేటర్ హైదరాబాద్ ఉమెన్స్ వైస్ ప్రెసిడెంట్ సుధారాణి నాయుడు, మల్కాజిగిరి లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ దుర్గారెడ్డి, మల్కాజిగిరి నియోజకవర్గం హ్యూమన్ రైట్స్ సభ్యులు ఉన్నారు.

కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల కృషి అభినందనీయం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

కాలనీలు, బస్తీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు రాజకీయాలకతీతంగా క్రియాశీలక భూమిక పోషిస్తున్నాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శ్రీసాయి కృష్ణ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రచురించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను అసోసియేషన్ కార్యాలయంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్స వానికి సిద్ధమవుతున్న క్రమంలో రోడ్లు, జంక్షన్ల అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, నాయకులు నేమురి మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కాప్రా డివిజన్ గోపాల్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు హేమలత, నాయకురాలు మెరుగు సునీత, శివ సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు బర్ల రామచంద్రారెడ్డి, శ్రీసాయి ఎన్‌క్లేవ్ అధ్యక్ష, కార్యదర్శ కార్యవర్గం తదితరులున్నారు.

న్యూ ఇయర్‌లో ప్రతి ఒక్కరూ లక్ష్యాలను చేరుకోవాలి

- ప్రిన్సిపాల్ సుమ మెనన్
- డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో 'రంగ్ మంచ్' వేడుక

నవతెలంగాణ - చర్లపల్లి

నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాలను చేరుకోవాలని, కొత్త ఆలోచనలతో, మంచి ధ్యేయాలతో ముందుకుసాగాలని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుమ మెనన్ కోరారు. మంగళవారం నాచారంలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ పాఠశాలలో "రంగ్ మంచ్" వేడుక నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్యతిథులుగా పాఠశాల చైర్మెన్ కె.నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, అనూష హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుమ మెనన్ మాట్లాడుతూ.. ప్రతీ కొత్త సంవత్సరం ఎన్నో ఆశలను, మరెన్నో ఆశయాలను మోసుకొస్తుందన్నారు. ఇప్పటి వరకు చేయలేనివి ఈ కొత్త ఏడాదిలో పూర్తి చేయాలని సూచించారు. కాలం ఆగదు, గడిచిన క్షణం వెనక్కి రాదని, కాలంతో పాటు మనమంతా ముందుకు సాగి అభివృద్ధి సాధించాలన్నారు. ఈ ఏడాది అన్నీ శుభాలు జరగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తు బాగుండాలని కలలు కనీ ఆ కలలను సాకారం చేసుకునేందుకు అడుగులు వేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలను స్వయంగా తిలకించిన వారి తల్లిదండ్రులు ఎంతో ఆనందించారు. ఈ సందర్భంగా చిన్నారులు పలురకాల నృత్యాలను, నాటకాలను ప్రదర్శించి, వారి ప్రతిభను చూపారు. అనంతరం మాతృ ఉపాధ్యాయ సంఘం సభ్యులు కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుమ మెనన్, వైస్ ప్రిన్సిపాల్స్, కో-ఆర్డినేటర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ ట్రోఫీలో.. పీవీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ - మేడ్చల్

ఇటీవల జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్‌లో మేడ్చల్ పట్టణంలోని పీవీ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీల్లో పీవి స్కూల్‌కు చెందిన 18మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో ఎం.ప్రవస్తి, రెశ్వంత్‌కు స్వర్ణ పతకాలు, ఎం.నవదీప్, ఎన్. శ్రీమన్, ప్రిన్స్ కుమార్, ధశరత్, అమన్ ఉద్దీన్‌కు సిల్వర్, ఎన్.జాహ్నవి, బి.రోహన్, జె.అభినష్, వై.సుమిత్, టి.లిఖిత్, జీ.సాయి వర్షిత్, వి.రిషికేష్, ఎం.గురుస్వారూప్, ఎం కే సృజన్, కృష్ణ, జాష్టవిలు కాంస్య పతకాలు సాధించారు. ఎంపీ ఈటల రాజేందర్, సినీ యాక్టర్ తల్వార్ సుమన్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రామేశ్వర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ కలిగి ఉండాలని, దానికి అనుగుణంగా విద్యార్థులకు కరాటేలో పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, కరాటే మాస్టర్ హరిప్రసాద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తూంకుంట పట్టణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- మున్సిపల్ చైర్మెన్ కారంగుల రాజేశ్వర్ రావు

నవతెలంగాణ-శామీర్‌పేట

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా తూంకుంట మున్సిపాలిటీ చైర్మెన్ కారంగుల రాజేశ్వర్ రావు తూంకుంట పట్టణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2025 సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, జీవన ప్రమాణాలు మెరుగవ్వాలని ఆకాంక్షించారు. తూంకుంట మున్సిపాలిటీ అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

మేడ్చల్ మున్సిపల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- కౌన్సిలర్ కొడే మహేష్

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ ప్రజలకు కౌన్సిలర్ కొడే మహేష్ 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరూ ఆనందకరమైన జీవితం గడపాలని కోరారు. విద్యార్థులు,యువత నూతన లక్ష్యాలు ఏర్పరచుకుని విజయం సాధించాలని తెలిపారు.

శబరిమల యాత్రకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

నవ తెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రావల్ కోల్ గ్రామంలోని అయ్యప్ప స్వాములు మంగళవారం గ్రామం నుండి శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలోని శివాలయంలో ఇరుముడులు కట్టుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శబరిమల యాత్రకు బయలుదేరారు. వెళ్లిన వారిలో గురు స్వామి గడిల రాజు,గోపని దేవేందర్, ఆకుల రవి,కృష్ణ గౌడ్,సర్ హెచ్ వెంకటేష్ యాదవ్, ఎరోళ్ళ నవీన్, ప్రశాంత్, బంటి, ఏరోళ్ళ మల్లేష్, శంకరయ్య, నర్సింహ గౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

బండరాయితో మోది భార్య హత్య

- మేడ్చల్ జిల్లా ప్రతాపసింగారంలో దారుణం

నవతెలంగాణ-బోడుప్పల్

భార్యాభర్తల మధ్య మొదలైన చిన్నపాటి గొడవ క్షణికావేశంలో భార్య హత్యకు దారితీసింది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధి ప్రతాపసింగారంలో మంగళవారం జరిగింది. పోలిసులు తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్‌కు చెందిన నీహారిక(35)కు ఖమ్మం జిల్లా తిరుమల పాలెం మండలం కాకరై గ్రామానికి చెందిన బండారు శ్రీకర్‌రెడ్డితో 2017లో వివాహం జరిగింది. వీరికి ఐదేళ్ల బాలుడు, మూడేళ్ల కూతురు ఉన్నారు. నిహారికకు తల్లిదండ్రులు ప్రతాపసింగారం గ్రామంలో ఒక ఇల్లు కొనిచ్చారు. అయితే అది తన పుట్టింటి వాళ్లు ఇచ్చిన ఇల్లు అని నీహారిక పలుమార్లు అనడంతో గతంలో కూడా గొడవలు జరిగాయి. నిన్న రాత్రి అదే ఇంటి విషయంలో ఘర్షణ జరగడంతో క్షణికావేశంలో అయ్యప్ప మాల ధరించి ఉన్న శ్రీకర్‌రెడ్డి నీహారికను బండరాయితో కొట్టి హత్య చేశాడు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు 2025 సంవత్సరంలో అంతా మంచే జరగాలని కాంగ్రెస్ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. గడిచిన ఏడాది జ్ఞాపకాలలో మంచి చెడులను బేరీజు వేసుకుని నూతన సంవత్సరంలో విజయవంతంగా పనులు పూర్తి అయ్యేలా ప్రణాళికలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఓల్డ్ మల్కాజిగిరిలో కార్పొరేటర్ శ్రవణ్ పర్యటన

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్కాజిగిరిలో డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పర్యటించారు. మంగళవారం స్థానికులను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. మంచి నీటి సరఫరా బాగుందని, అయితే కొన్ని కొత్త పవర్ బోర్‌లను వేయిస్తే బావుంటుందని పలువురు కోరారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ ఉన్నతాధికారులతో మాట్లాడి కొత్త పవర్ బోర్ల ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. మహిళలు ముద్ర లోన్స్, మహిళా గ్రూప్‌లతో స్వయం సంవృద్ధి సాధించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం శ్రీకాంత్ యాదవ్, జై కృష్ణ, రజనీ పాల్గొన్నారు.

గౌడ కులస్తులు ఐక్యతతో ముందుకు పోవాలి

నవతెలంగాణ-కాప్రా

గౌడ కులస్తులు ఐక్యతతో ముందుకు సాగాలని కౌండిన్య సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.భూపాల్ గౌడ్, బి. చంద్రయ్య గౌడ్, బి. కిషోర్ గౌడ్‌లు అన్నారు. మంగళవారం మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ కౌండిన్య సంక్షేమ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గౌడ కులస్తులందరూ ఐక్యమత్యంతో ఉండి సంఘాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. సంఘానికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య గౌడ్, వెంకన్న గౌడ్, సత్తయ్య గౌడ్, మల్లేష్ గౌడ్, నవీన్‌గౌడ్, అశోక్ గౌడ్, హనుమాన్, దాస్‌గౌడ్, బాలయ్య గౌడ్, సాయి గౌడ్, కృష్ణ గౌడ్, మురారిగౌడ్, సురేష్ గౌడ్, నరసింహ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు చేసిన మాజీ మేయర్

నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ శ్రీరాంనగర్ కాలనీలో గురుస్వామి రేగళ్ల సతీష్ రెడ్డి 23వ అయ్యప్ప స్వామి మహపడి పూజను ఘనంగా నిర్వహించారు. పూజ ప్రాంగణంలో విఘ్నేశ్వరుడు, సుబ్రమణ్యస్వామి, అయ్యప్ప స్వామిల ప్రతిమలను ఏర్పాటు చేసి కేరళ శబరిమల ఆలయం మాదిరిగా బంగారు వర్ణంతో కుడిన 18 పడి మెట్లను ఏర్పాటు చేసి పూలు, వస్త్రాలతో అందంగా అలంకరించారు. నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి కీర్తనలు, భజనలతో అప్రాంగణమంత అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమోగింది. పూజ అనంతరం భక్తులుకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కన్య స్వాములు, కత్తి స్వాములు, స్వాములు, గదా స్వామిలు, గురుస్వాములు, పాల్గొన్నారు.

సిఫార్సు లేఖలు ఆమోదించడం అభినందనీయం



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు ఆమోదించటం అధినందనీయమని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ తిరుమలలో తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీల సిఫార్సు లేఖలపై దర్శనాలకు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం పలు మార్లు వినతులను అందించామని తెలుపుతూ ఏపీ సీఎంకుచ టీటీడీ చైర్మెన్ బి.ఆర్ నాయుడు లకు కతజ్ఞతలు తెలిపారు.

ఆర్ కృష్ణయ్యకు అభినందనలు



నవతెలంగాణ - కూకట్‌పల్లి

జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కష్ణయ్య రాజ్యసభ సభ్యులుగా ఇటీవల ఎన్నికై పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలియజేస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాంబాగ్ ప్రకాష్ గౌడ్, సప్పిడి భాస్కర్, గోకర్ల లక్ష్మీనారాయణ, ఆయిల శ్రీధర్ గౌడ్, నభి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



నూతన సంవత్సరంలో లక్ష్యాలను ఏర్పర్చుకుని ప్రణాళికా బద్ధంగా వాటిని సాధించేలా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో రాణించి సుఖ సంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. ఈ ఏడాదిలో ప్రతి ఒక్కరూ తమకంటూ లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ప్రణాళికాబద్ధంగా వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం-2025లో ప్రజలు కొత్త ఆలోచనలు, సరికొత్త నిర్ణయాలు, మంచి ఆశయాలతో ముందుకెళ్ళాలని సూచిం చారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితానికి వారి శ్రేయస్సుతో పాటు ఆనందాన్ని తీసుకువస్తుందని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది కంటే ఈ సారి మరింత ఉన్నతాశయాలను ఏర్పర్చుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటిస్తూ కొత్త సంవత్సర వేడుకలను సంయమనంతో జరుపుకోవాలని కోరారు. జిల్లా ప్రజలం దరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అభిలాషించారు. కొత్త ఏడాదిలో ఎల్లవేళలా అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి



- సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్

నవతెలంగాణ - బాలానగర్

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్ల సమస్యలపై చేపట్టిన రాష్ట్ర కేంద్రం బస్ జాతా ముగింపు సభ మంగళవారం ఇందిరా పార్క్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా బాలానగర్ పీహెచ్ సీ పరిధిలోని అప్పర్ ప్రైమరీ సబ్ సెంటర్ల నుంచి ఆశావర్కర్లు చలో ఇందిరాపార్క్ కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. కనీసం వారికి రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనంగా కల్పించాలని కోరారు. అదే విధంగా ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు ఇవ్వాలన్నారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు తప్పని సరిగా రూ.18లు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఎమ్మెల్యే, మంత్రులు, అసెంబ్లీలను ముట్టడిస్తామన్నారు. ఆశాలపై పని భారం తగ్గించి, అర్హతలను బట్టి ఆశాలకు ఏఎస్ఎంలుగా అవకాశాలు కల్పించాలన్నారు. సీఐటీయు జిల్లా కోశాధికారి ఉన్ని కష్ణ, అనిత, సబియా, భాషమ్మ, సంతోష్ భాయ్, భాగ్యలక్ష్మి, రేణుక, విజయలక్ష్మి, మంజుల, పద్మ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్ సీఐ ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ - బాలానగర్

బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలో నర్సాపూర్ చౌరస్తా వద్ద నూతన సంవత్సర వేడుకలు సజావుగా జరుపుకోవడంపై అవగాహనా కార్యక్రమంలో భాగంగా మంగళవారం బ్రైట్ ఫ్యూచర్ ఎన్జీవోల సహకారంతో బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా బాలానగర్ జోన్ అడిషనల్ డీసీపీ పి. సత్యనారాయణ, ఏసీపీ జి. హనుమంతరావు హాజరై ప్రజలకు పలు సూచనలు చేశారు. ఏడీసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను సురక్షితంగా, సక్రమంగా నిర్వహించేందుకు సైబరాబాద్ పోలీసులు కఠిన నిబంధనలను చేపట్టారని తెలిపారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు వాడినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానిత ప్రాంతాలలో తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు. అనంతరం ఏసీపీ హనుమంత రావు నిర్వాహకులకు ముఖ్య సూచనలు చేశారు. డీఐ నాగిరెడ్డి, ఎస్ఐలు హాజ్ మియా, సరితా రెడ్డి, బ్రైట్ ఫ్యూచర్ ఎన్జీవో ప్రతినిధులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలుంటాయి



- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

132-జీడిమెట్ల డివిజన్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ పెద్దమ్మతల్లి దేవాలయం నూతన కమిటీ సభ్యులు పెద్దమ్మ గుడి దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎంపీపీ చినంగి వెంకటేశం ముదిరాజ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పెద్దమ్మ తల్లి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లి దేవాలయం అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనం తరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... గత పదేండ్ల కాలంలో దేవాలయాల అభివృద్ధికి అనేక నిధులు కేటాయించడంతోపాటు కుత్బుల్లాపూర్ లోని పలు దేవాలయాలలో అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న పురోహితులకు దేవాలయాల అభివద్ధికై ధూప, దీప నైవేద్యాల కార్యక్రమం ద్వారా నెల,నెల ఆర్థిక ప్రోత్సాహం అందించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో పెద్దమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ గుడి దేవాలయ నూతన కమిటీ సభ్యులు తలారి రాజు, సత్యనారాయణ, ఉప్పరి కష్ణ, దొంతి మహేష్, కొరివి సత్యనారాయణ, సందబోయిన వెంకటేష్, పిట్ల శంకర్, కొరివి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

132 - జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో గాజులరామారం డివిజన్ బతుకమ్మ బండ శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... శ్రీ పంచముఖి అంజనేయస్వామి ఆశీస్సులతో 2025 సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలని అన్నారు. దేవాలయ అభివృద్ధిలో ఆలయ కమిటీ సభ్యులకు తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గాజుల రామారం డివిజన్ నాయకులు ఇబ్రహీం, నయీం, నాగేష్, చెట్ల వెంకటేష్, పరమేష్ పంతులు, బస్వరాజు, అంజయ్య, శరణప్ప, రాచప్ప తదితరులు పాల్గొన్నారు.



హౌజ్ కీపింగ్ వర్కర్లకు వేతనాలు పెంచాలి



- స్టూడెంట్ ప్రోటక్షన్ ఫోరం విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విశ్వవిద్యాలయంలో పని చేసే హౌజ్ కీపింగ్ వర్కర్ల వేతనాలు పెంచాలని స్టూడెంట్ ప్రోటక్షన్ ఫోరం విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం జేఎన్టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్, స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలో పని చేసే హౌజ్ కీపింగ్ వర్కర్ల వేతనాలను రూ. 7,000 నుంచి రూ.12,000కు పెంచాలని డిమాండ్ చేస్తూ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వెంకటేశ్వర్ రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో పని చేసే హౌజ్ కీపింగ్ వర్కర్ల వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయని తెలిపారు. హౌస్ కీపింగ్ వర్కర్లు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అతి కష్టమైన పని చేస్తున్నారన్నారు. కేవలం ఒక్కొక్కరికి ప్రయాణ ఖర్చులు సైతం రూ.1000 నుంచి రూ.1500 ల వరకు ఉండడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని గౌరవించే విధంగా వారి వేతనాలను రూ.7,000లు , రూ.1000లు (ఇ.ఎస్. ఐపి.ఎఫ్) మొత్తాన్ని రూ.12,000లు అదనంగా (ఇఎస్ం పిఎఫ్) కు పెంచాలని డిమాండ్ చేశారు. రానున్న జనవరి 2025 నుంచి వేతనాలను పెంచి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే వేతనాలు పెంచటానికి అంగీకరించిన ఏజెన్సీలకు మాత్రమే అవకాశం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ స్పందించి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు విషయంలో వేసిన కమిటీలో ఈ విషయాన్ని చర్చించి హౌస్ కీపింగ్ వర్కర్లకు లాభం చేకూరే విధంగా నిర్ణయం తీసుకుందామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు చంద్రశేఖర్, శివ కష్ణ, సిద్ధార్థ, బ్రహ్మం గౌడ్, అర్జున్ గౌడ్, సాయి కుమార్ రాథోడ్, నితిన్, తనుజ్ కుమార్, శ్రీనివాస్, సారన్ష్ జయరాం, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును తవ్వే ప్రయత్నాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపల్ పరిధిలోని దుండిగల్ కమాన్ సమీపంలో గత అనేక సంవత్సరాల క్రితం నుంచి రోడ్డు ఇరువైపులా నాలా కల్వర్టు ఉండగా కల్వర్టు సమీపాన గల ఇంటి యజమాని ఇటీవల ఎలాంటి అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టడమే కాకుండా ఇంటికి నాలా అడ్డు వస్తుందని తొలగించబోయాడు. అయితే స్థానిక కాంగ్రెస్ నాయకులు లద్ది పీర్ల నర్సింగ్ రావు గౌడ్ , కావలి గణేష్, బస్తీ నాయకులు తెలుసుకొని నాలా ధ్వంసం పనులను అడ్డుకొని ఆపివేశారు. ఈ విషయంపై దుండిగల్ కమిషనర్ దృష్టికి తీసుకురావడంతో సంఘటన స్థలానికి వచ్చిన కమిషనర్ అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టడం సరైంది కాదని, అలాగే రోడ్డును ధ్వంసం చేస్తూ నాలాను పూడ్చడం సరికాదని, ఇరిగేషన్, ఆర్ అండ్ అధికారుల పరిధిలో వస్తుందని తెలపడంతో ఎట్టకేలకు పనులను ఆపివేయించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, ముత్యం రెడ్డి, కౌన్సిలర్ అమరం గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్, క్లేటన్ ప్లే స్కూల్‌ల క్యాలెండర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ పరిధిలోని వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్ , కరెస్పాండెంట్ ఎం సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, సిబ్బంది భాగస్వామ్యంతో వివేకానంద విద్యా మందిర్ పాఠశాల 2025 క్యాలెండర్‌ను ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస గౌడ్ మంగళవారం విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఆశాజనక విద్యా సంవత్సరం అని అన్నారు. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థికీ కాలమానిక పట్టికను అందజేశారు.పూర్వ పాఠశాల విద్యార్థులు ఇంటర్, డిగ్రీ, జాతీయ పరీక్షలలో ఉత్తమ విద్యార్థులుగా విద్యనభ్య సిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు దినదిన అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని విద్యార్థుల్లో దాగివున్న సృజ నాత్మకత శక్తిని వెలుగు తీయడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిం చటానికి తమ పాఠశాల ఎప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు.



నూతన సంవత్సర శుభాకాంక్షలు



- సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య కుత్బుల్లాపూర్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరేవరకు సీపీఐ(ఎం) ముందుండి పోరాడుతుందన్నారు.నూతన సంవత్సర 2025 లో ప్రతి ఒక్కరి ఆశలు , ఆకాంక్షలు నెరవేరాలని అందరి జీవితాల్లో వెలుగు నిండాలని ఆకాంక్షించారు.



ఘనంగా అయ్యప్ప పడిపూజ

నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్ పల్లి వివేకానంద నగర్ కాలనీలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో 33'వ (త్రిత్రింశతి) వార్షికోత్సవం సందర్భంగా యజ్ఞిక బ్రహ్మా బ్రహ్మశ్రీ శానగొండ శివ కిరణ్ శర్మ ఆధ్వర్యంలో, అయ్యప్ప స్వామీ దేవస్థాన అర్చకులు మావుడూరి యోగీశ్వర శర్మ కరకమలములచే వార్షిక పూజా, శ్రీ రాజ శ్యామల మహాయాగము, శివపార్వతుల కళ్యాణము, లక్ష్మీ గణపతి హెూమం, ఆరాట్ ఉత్సవం, 18 కలశాల మహాపడి పూజ,అన్న సమారాధన (అన్నదానము) కార్యక్రమం వడ్డేపల్లి రాజేశ్వర రావు యామినిలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ఈటల రాజేందర్ హాజరై మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దీక్ష చాల గొప్పదని, దీక్ష చేపట్టలంటే స్వామి వారి అనుగ్రహంతో పాటు, అదృష్టం ఉండాలని తెలియజేశారు. ఎంపీకి ఘనంగా స్వాగతం పలికి సన్మానం చేశారు. పడిపూజ మహెూత్సవంలో పాల్గొని విజయవంతం చేసిన అయ్యప్ప భక్తులకు, సహకరించిన తన కుటుంబ సభ్యులందరికీ, ఆలయ కమిటీ సభ్యులకు,అయ్యప్ప స్వాములకు,అయ్యప్ప భక్తులకు ప్రతి ఒక్కరికీ, అయ్యప్ప స్వామి వారి కృప ఉండాలని పేరు పేరున రాజేశ్వర్‌రావు ధన్యవాదాలు తెలిపారు.

యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

- కాంగ్రెస్ కూకట్ పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదుగాలని కాంగ్రెస్ కూకట్ పల్లి ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సంజయ్ నూతనంగా బాలానగర్‌లో ఏర్పాటు చేసుకున్న బ్రేక్ ఎన్ డైన్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుష్పారెడ్డి ,శివకుమార్ గౌడ్, శ్రీకాంత్ పటేల్, లక్ష్మయ్య, మదనమోహన్, శివ చౌదరి, మద్దూరి రాము, రమణ ,అనిల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు



- కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజలకు 2025 నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వరాలతో



పడి పూజలో కార్పొరేటర్

నవతెలంగాణ - కూకట్ పల్లి

వివేకానంద నగర్ డివిజన్‌లోని సప్తగిరి కాలనీ అయ్యప్ప స్వామి దేవాలయంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పాల్గొన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్ పదవీ విరమణ



- హాజరైన డీఎంహెచ్‌ఓ రఘునాథస్వామి

నవతెలంగాణ-సిటీబ్యూరో

బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ వినోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ సూపర్‌వైజర్ విక్టోరియా పదవీ విరమణ కార్యక్రమానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ్‌స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విక్టోరియా సుదీర్ఘకాలిక సేవలకుగాను అభినందిస్తూ, ఆమె జిల్లా వైద్య, ఆరోగ్యశాఖకు చూపిన నిబద్ధత, శ్రమ, రోగుల పట్ల దక్షతాన్ని ప్రశంసిస్తూ, పదవీ విరమణ అనంతరం ప్రశాంతమైన, సంతోషకరమైన జీవితం గడపాలని ఆకాంక్షించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ శుభాకాంక్షలు తెలిపి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శోభారాణి జిల్లా కార్యక్రమ అధికారి (నాన్ కమ్యూనికబుల్ డిసీసెస్) డాక్టర్ మల్లీశ్వరి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సరస్వతి, సూపర్‌వైజర్లు బొగె ప్రకాష్, రవి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తా



- ఎర్రబెల్లి సతీష్ రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్, వాంబే కాలనీకి చెందిన సామాజిక కళాకారుడు నందు, సోసైటీ సభ్యులు మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావును మర్యాద పూర్వకంగా కలిసి స్థానిక సమస్యల గురించి వివరించారు. అందుకు స్పందించిన ఎర్రబెల్లి.. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. అలాగే వారికి అభినందనలు తెలియజేస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సాయి గౌడ్, రాజు, అరవింద్ కుమార్, ఎండీ మున్నెర్, నర్సింహ, గిరి, పాషా, నజీర్, అజయ్, రఘు, ఆక్షేయ్, కష్ణ, పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామిని దర్శించుకున్న ఎర్రబెల్లి సతీష్ రావు

వడ్డేపల్లి రాజు గురుస్వామి ఆధ్వర్యంలో, కూకట్ పల్లి వివేకానంద నగర్ లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో జరుగుతున్న, అయ్యప్ప పడిపూజలో బీఆర్ఎస్ ఆల్విన్ కాలని డివిజన్ సీనియర్ నాయకులు ,ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకున్నారు.



సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి అన్నారు. మంగళవారం132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో డ్రయినేజీ సమస్య , జయరాం నగర్ లోని నీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని తెలియడంతో అక్కడికి వెళ్లి కాలనీ వాసులతో కలిసి పర్యటించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. డ్రయినేజీ , నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ ప్రజలు విన్నవించుకున్నారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్,నల్లనాగుల కష్ణ,పెద్దింటి సాయిలు, సందీప్ గౌడ్,మహేష్ గౌడ్,శ్రవణ్,శివ , శ్రీనివాస్ రెడ్డి,బాబీ నీలా,కష్ణవేణి, సత్యనారాయణ, మాధురి, జాన్, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి జెట్టి ఆద్వే విరాళం

నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని మధురా నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అష్టలక్ష్మి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి భక్తులు ముందుకు రావడం ఆనందంగా ఉందని ఆలయ కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. మధురానగర్ కాలనీకి చెందిన జెట్టి అద్వై రూ. 1,01116/-చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేయడంతో ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు వస్తురూపేనా, ధన రూపేణా సహకరించి ఆలయ నిర్మాణంలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు,ఆలయ కమిటీ సభ్యులు హేమంత్, విష్ణువర్ధన్ రావు,లింగయ్య,రాంబాబు,లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ కథనాలు ప్రజల్లోకి తీసుకెళ్లే పత్రిక నవతెలంగాణ



నవతెలంగాణ-బంజారాహిల్స్

బడుగు బలహీన, కార్మిక కర్షక వర్గాలతో పాటు మహిళల వార్తా కథనాలు వాస్తవాలను ప్రచురిస్తూ.. ప్రజా సమస్యల్లో నిరంతరం ప్రయాణిస్తున్న పత్రిక నవతెలంగాణ అని తెలంగాణ మాజీ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ కె.విప్లవ కుమార్ అన్నారు. నూతన సంవత్సర నవతెలంగాణ క్యాలెండర్ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాస్తవాలను ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యలపై ప్రత్యేక కథనాలు ప్రచురిస్తూ ప్రజల మన్ననాలు పొందిన్న నవతెలంగాణ పత్రిక క్యాలెండర్ కొరకు ప్రజలు ఎదురుచూస్తుంటారని తెలిపారు. ఇంతటి ఆధరాభిమానం సంపాదించుకున్న పత్రిక యజమాన్యానికి బంజారాహిల్స్ విలేకరి ఎం.రఘునాథ్ శుభాకాంక్షలు తెలిపారు.

సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం



- డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ సర్కిల్-29 డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు మంగళవారం తన కార్యక్రమంలో నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్స్ స్థానిక సీనియర్ నవతెలంగాణ రిపోర్టర్, ఓయూ పీహెచ్డీ స్టూడెంట్ తలారి. శ్రీనివాసరావుతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ సర్కిల్ 29 పరిధిలోని అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి, నవతెలంగాణ యాజమాన్యనికి, కుటుంబ సభ్యులకు, విలేకరులకు నూతన శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో సికింద్రాబాద్ అభివృద్ధికి అందరు కలిసి కట్టుగా పని చేయాలని కోరారు. కొత్త సంవత్సరంలో భగవంతుని ఆశీర్వాదంతో ఇటు సర్కిల్ అటు ప్రజలు అభివృద్ధి చెందలని కోరారు. సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం అని పేర్కొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే




నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ప్రాంతంలో పాస్టర్స్ కమ్యూనిటీ కోసం ప్రత్యేకంగా గ్రేవ్‌యార్డ్ ఏర్పాటు చేయాలంటూ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రత్యేకంగా ఇండిపెండెంట్ పాస్టర్స్ కమ్యూనిటీ గ్రేవ్‌యార్డ్ ఏర్పాటు చేయాల్సిందిగా ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ని గతంలో పాస్టర్స్ కోరి వినతిపత్రం ఇచ్చారని సీఎంకు తెలిపారు. అలాగే పలు సమస్యలపై ముఖ్యమంత్రికి ఆయన వివరించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేర్కొన్నారు.

అధైర్య పడకండి అండగా ఉన్నాం




- మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-బంజారాహిల్స్

అధైర్య పడకండి అండగా ఉన్నామని నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథ్‌ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, మాజీమంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే వివేక్‌లు సోమవారం పరామర్శించారు. మాజీ ఎంపీకి మంచి చికిత్స అందించాలని డాక్టర్‌లకు సూచించారు.

డ్రగ్స్, గంజాయిని అరికట్టండి



- డీసీపీని కోరిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్

కటోన్మెంట్ ప్రాంతంలో డ్రగ్స్, గంజాయిను అరికట్టాలని కోరుతూ మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నార్త్ జోన్ డీసీపీ శ్రీ రష్మీ పెరుమళ్ కోరారు. కంటోన్మెంట్‌లో అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కంటోన్మెంట్‌లో కొన్ని చోట్ల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని చెప్పారు. కొంతమంది యువత గంజాయి బారిన పడుతున్నారని ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డీసీపీకి చెప్పారు.

పసికందు హత్య కేసులో నిందితురాలికి జీవిత ఖైదు

నవతెలంగాణ-హాయత్‌నగర్

తనకు పిల్లలు కలగకుండా సోదరుడికి సంతానం కలగడంతో వదిన నుంచి ఎదురైన హేళనలతో వ్యక్తిగత కక్ష పెంచుకుని సొంత సోదరుడి కొడుకైన రెండు నెలల పసి బాలుడిని హత్య చేసిన కేసులో అనాజ్‌పూర్‌కు చెందిన నిందితురాలు ఓరుగంటి శ్వేత. అమెది అబ్దుల్లాపూర్‌మెట్, రంగారెడ్డి జిల్లా. ఈ కేసు 2021లో అబ్దుల్లాపూర్‌మెట్‌లో నమోదైంది. పూర్తి ఆదారులతో ఎల్బీనగర్‌లోని 12ఏ డీజే కోర్టు దోషిగా నిర్ధారించింది. నిందితురాలికి జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా విధించిందని అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్స్‌స్పెక్టర్ అంజిరెడ్డి మంగళవారం వెల్లడించారు.

కార్పొరేటర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ మంగళవారం తన జన్మదిన వేడుకలను భద్రాచలంలో నిర్వహించుకున్నారు. డివిజన్ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన భద్రాచలం వెళ్లారు. అక్కడ భద్రాది రాముని సన్నిధిలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించుకున్నారు. సంవత్సరం చివరు కావడం వల్ల తన పుట్టినరోజు కూడా కలసి రావడంతో నరసింహ యాదవ్ డివిజన్ నాయకులు అందరితో కలిసి దైవ దర్శనం చేసుకుని వేడుకలు నిర్వహించుకున్నారు.

స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్త సంవత్సర వేడుకలు



- హాజరైన ఫిస్ట్ బాల్ అసోసియేషన్ చైర్మెన్ జంపన ప్రతాప్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యూబోయినపల్లి ప్లే గ్రౌండ్ వద్ద నూతన సంవత్సర స్వాగత వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ తెలంగాణ ఫిస్ట్ బాల్ అసోసియేషన్ చైర్మెన్ జంపన ప్రతాప్ ముఖ్య అతిధిగా హాజరై న్యూ ఇయర్ కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. గడచిపోయిన రోజులను తలచుకోకుండా నూతన సంవత్సరములో ప్రతి ఒక్కరు తమ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కంటోన్మెంట్ ప్రజలకు నూతన సంవత్సర శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ సాయిబాబా యాదవ్, హరికృష్ణ షకీబ్ హుస్సేన్, సిరాజ్, అరుణ్ యాదవ్, మధు, మౌలా, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

భారతీయుల ప్రతిభ, తోడు లేకుంటే..

అమెరికన్ వ్యాపారం అభివృద్ధి శూన్యం



- అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

భారతీయుల ప్రతిభ, తోడు లేకుండా అమెరికన్ వ్యాపారం నడవదని కాన్ఫరెన్స్ చైర్మెన్,(APTA KATALYST), డాక్టర్ సుబుకోట తెలిపారు. నగరంలో ఈ నెల 3 నుంచి 6 వరకు ఎన్నారైల గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సోమాజిగూడలోని మెర్క్యూర్ హెూటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాన్ఫరెన్స్ కన్వీనర్ సాగర్ లగిశెట్టి, సెక్రటరీ చంద్ర శేఖర్ నల్లం, ట్రెజరర్ తేజ్ పాక్యాల, మధు వుల్లి, బిజినెస్ ఫోరమ్ చైర్ రమేష్ తూములు ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కనెక్ట్ (కలవండి) - కొలాబరేట్ (సహకరించండి) - క్రియేట్ (సృష్టించు)" అనే నినాదంతో ఏర్పాటు చేసిన మూడు రోజుల సదస్సులో భారతదేశంతో సహా ఉత్తర అమెరికా, యూరప్, మిడిల్ ఈస్ట్, ఆసియాతో సహా 20 దేశాల నుంచి సుమారు వేల మంది భారతీయ సంతతికి చెందిన పారిశ్రామికవేత్తలను హాజరై వారి అనుభవాలను పంచుకోవడం లక్ష్యంగా పెట్టుకుందనీ అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోని తెలుగు ప్రజల కోసం ప్రధానంగా నెట్‌వర్కింగ్‌ను లక్ష్యంగా చేసుకున్న ఒక లాభాపేక్షలేని సంస్థని ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్య అతిథులుగా 3న బాంక్వెట్ నైట్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, 4న జరిగే సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, 5న జరిగే ముగింపు వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. APTA USA భారతదేశంలో అనేక ఇతర ప్రధాన సేవా కార్యక్రమాలతో వారి కలల కెరీర్‌ను కొనసాగించడానికి 120000 భారతీయ విద్యార్థులకు రూ.14 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లను అందించిందనీ, 100 మంది ప్రముఖ స్పీకర్లు, ప్యానలిస్ట్‌లు 42-ప్లస్ సెషన్‌లలో ప్రసంగిస్తారని వెల్లడించారు.

వాస్తవాలు చేరవేస్తూ.. నిరంతరం సమస్యల పరిష్కారానికి వారధిగా.. నవతెలంగాణ



- మన్నే కవిత గోవర్ధన్ రెడ్డిలు

నవతెలంగాణ-బంజారాహిల్స్

బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ నాయకులు మన్నే గోవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నే కవిత గోవర్ధన్ రెడ్డిల చేతుల మీదుగా నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏది నిజం ఏది అబద్ధమనే అయోమయంలో ప్రజలందరూ ఉన్నారన్నది వాస్తవమన్నారు. ఇటువంటి తరుణంలో సైతం ప్రజలకు వాస్తవాలు చేరవేస్తూ నిరంతరం సమస్యల పరిష్కారానికి వారధిగా ఉన్న నవతెలంగాణ వార్తాపత్రిక క్యాలెడర్ ప్రతి సంవత్సరం ఓ ప్రత్యేక తను సంతరించుకుని మార్కెట్లోకి రావడం జరుగుతుందని ఈ సందర్భంగా నవతెలంగాణ యజమాన్యానికి బంజారాహిల్స్ విలేఖరి రఘునాథ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రజలకు వాస్తవాలు చేరవేస్తూ నిరంతరం ముందుకు సాగాలని తెలిపారు.

జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి



నవతెలంగాణ-బేగంపేట్

రాంగోపాల్ పేట్ డివిజన్ స్థానిక బీజేపీ కార్పొరేటర్ చీర సుచిత్ర, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షుడు మనోజ్ ఉపాధ్యాయతో కలిసి డివిజన్‌లోని పలు సమస్యలపై జీహెచ్ఎంసీ నార్త్ జోన్ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌కు, సర్కిల్30 డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్లుప్తంగా స్థానిక సమస్యలు తిరిగి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార దిశగా పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు. డివిజన్లోని పలు ప్రాంతాల్లో గుంతలు పడిన రోడ్లు ఎక్కువగా ఉన్నాయని స్థానికుల అవసరాల మేరకు నిర్లక్ష్యంగా ఇష్టం వచ్చినట్టు జీహెచ్ఎంసీ పర్మిషన్ లేకుండా రోడ్లను తవ్వేస్తున్నారని, అందువల్ల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని, వర్షం కురిస్తే ఆ గుంత కనబడక వాహనదారులు పాదచారులపై బురద చల్లి పోతున్నారని, స్థానికులు తమ దృష్టికి తీసుకు వచ్చారని పేర్కొన్నారు. ప్రజాధనం వృధా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, కొన్ని ప్రాంతాల్లో భారీగా పెరిగిన చెట్ల కొమ్మలు స్ట్రీట్ లైట్లకు అడ్డుగా వస్తున్నాయని, ఆ కొమ్మలు కొందరి ఇండ్లపై వాలి రకరకాల కీటకాలు వారి ఇండ్లలోకే వస్తున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని కోరినట్టు తెలిపారు. పారిశుధ్య కార్మికుల కొరత వల్ల రోడ్లకు ఇరువైపులా వేస్తున్న చెత్తాచెదారం వల్ల దుర్వాసనతో పాటు ఈగలు దోమలు స్వయం విహారం చేస్తున్నాయని, వీటివల్ల అనారోగ్య బారిన పడే అవకాశం ఉందని, అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, వయసు మీద పడి రిటైర్మెంట్ తీసుకున్న కార్మికుల స్థానాలలో కొత్తవారికి అవకాశం కల్పించాలని, పారిశుధ్య ఆటో రిక్షాల కొరత ఉందని, కొంతమంది పారిశుద్ధ కార్మికులు రీసైకిల్ చేసుకునే వ్యర్థాలపై ఆర్థిక లాభం ఉండడంతో వాటి మీద మాత్రమే దృష్టి సారించి తొలగిస్తున్నారు తప్ప పూర్తిస్థాయిలో తడి పొడి చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వెల్లడించారు. కొన్ని మారుమూల ప్రాంతాల్లో నూతన స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయాలని వినతిపత్రం ద్వారా జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు సమస్యలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి పరిష్కార దృశ్యాగా కృషి చేస్తామని కమిషనర్‌తో పాటు డిప్యూటీ కమిషనర్ సహా సానుకూలంగా హామీ ఇచ్చినట్టు కార్పొరేటర్ తెలిపారు.

నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



- డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. ఈ కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆరోగ్యంతో, శాంతితో జీవించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు మరింత మెరుగ్గా అందించడానికి ప్రజల సహకారం అవసరమని, నగరాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరికీ ఆరోగ్యం, ఆనందం, శ్రేయస్సుతో కూడిన కొత్త సంవత్సరం రావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

సమిష్టి కృషితో ముందుకు..జోనల్ కమిషనర్



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ ఎస్.రవి కిరణ్ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యలయంలో మంగళవారం నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించారు. నవతెలంగాణ కుటుంబ సభ్యులకు, సికింద్రాబాద్ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పత్రికలు సామాజిక దృక్పథంతో నగరాభివృద్ధి కోసం కృషి చేయాలని, సికింద్రాబాద్ జోన్ ఒక గొప్ప ప్రాంతమని ఇక్కడి అన్ని రకాల సాంస్కృతిక సంప్రదాయలకు నిలయం అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటు సమస్యలు పరిష్కరించాటానికి మావంతు కృషి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక సీనియర్ నవతెలంగాణ పాత్రికేయులు, ఓయూ పీహెచ్డీ స్టూడెంట్ తలారి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆచార్య దివాకర్ల వెంకటావధానంటే మాకు ఎంతో గౌరవం



- ఆచార్య రఘునాథ శర్మ

నవతెలంగాణ-ఓయూ

ఆచార్య దివాకర్ల వెంకటావధాని శిష్యులమని చెప్పుకోవడమంటేనే మాకు ఎంతో గౌరవమని, ఆయన పాటించిన విలువలు, ప్రమాణాలే మమ్మల్ని ఈ స్థానంలో నిలిపాయని ప్రముఖ తెలుగు, సంస్కృత పండితులు ఆచార్య శలాక రఘునాథ శర్మ వ్యాఖ్యానించారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజ్ వేదికగా రూమ్ నెంబర్ 121లో కేంద్ర సాహిత్య అకాడమీ, తెలుగు శాఖ సంయుక్తంగా నిర్వహించిన "దివాకర్ల వెంకటావధాని జీవితం-సాహిత్యం" అనే సదస్సుకి అతిథిగా విచ్చేసి కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సంస్కృత, తెలుగు వ్యాకరణాల్లో దివాకర్ల దిట్ట అని, ఆయన ఎంతో నిష్టతో బోధన చేసేవారని, పాఠాన్ని లోతుగా అధ్యయనం చేస్తూ, పరవశించి పోతూ పాఠం బోధించే వారని గుర్తు చేసుకున్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.కాశీం మాట్లాడుతూ.. సాహిత్య విద్యార్థులకు, సాహితీకారులకు దివాకర్ల వారి రచనలు ప్రామాణిక గ్రంథాలుగా నిలిచాయని అన్నారు. సాహిత్య అకాడమీ తరపున స్వాగత ఉపన్యాసం ఇచ్చినటువంటి ఆచార్య సి. మృణాళిని మాట్లాడుతూ.. దివాకర్ల వేంకటావధాని అద్భుతమైన ప్రాసంగికులని, తన మాటలతో శ్రోతల్ని అట్టే కట్టిపడేసే వారని అన్నారు. చిన్నతనంలో వారి ఉపన్యాసాలు వింటూనే మేము చదువుల్లో రాణించామని గుర్తు చేసుకున్నారు. సభాధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ.. మా తెలుగు శాఖ అధ్యక్షులుగా పనిచేసిన దివాకర్ల గురించి 110 జయంతి సందర్భంగా మాట్లాడుకునే ఒక అవకాశం రావడం ఒక గొప్ప అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో దివాకర్ల వేంకటావధాని కవిత్వం పైన ఆచార్య అనుమాండ్ల భూమయ్య కావ్య లహరి ప్రసంగాలపైన డా. సంగనభట్ల నరసయ్య, ఆంధ్ర వ్మాయ చరిత్ర పైన ఆచార్య జి. అరుణకుమారి, సాహిత్య సోపానాలు అనే గ్రంథం పైన ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, అధ్యాపకులుగా దివాకర్ల అనే అంశం పైన గంధ్ర లక్ష్మణ రావు, పరిశోధకులుగా దివాకర్ల అనే అంశం పైన ఆచార్య పిల్లల రాములు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తెలుగుశాఖ పాఠ్య ప్రణాళి కా సంఘం అధ్యక్షులు డా. ఏలే విజయలక్ష్మి, సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యులు డా.ఎస్ రఘు, డా. నాళేశ్వరం శంకరం, అవధాని శిష్యులు, అభిమానులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి నవతెలంగాణ కృషి



- కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

నవతెలంగాణ-బంజారాహిల్స్

వార్త పత్రికలు ప్రజలకు వాస్తవాలు చెరవేయడంలో ప్రభుత్వనికి ప్రజలకు వారధిగా ఉండాలని నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. నవతెలంగాణ పత్రిక తన డివిజన్ పరిధిలోని 18 బస్తీలో ఉన్న బడుగు బలహీన వర్గాల పక్షాన నిరంతరం కృషి చేస్తూ ఖైరతాబాద్ నియోజకవర్గంలోని సమస్యల వెలికితీతలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రజలకు సమస్యల పట్ల అవగాహన కల్పిస్తూ సమస్య పరిష్కారానికి మార్గం చూపుతున్న వార్త కథనాలు ప్రచురించడం అభినందనీయం అన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

నవతెలంగాణ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను, ఎస్సార్‌నగర్ ఏసీపీ వెంకటరమణ తమ ఆఫీసులో బోరబండ ఇన్‌స్పెక్టర్ వీరశేఖర్, సీనియర్ రిపోర్టర్ ప్రసాదరావు, అమీర్పేట్ జోన్ ఇన్‌చార్జి రమేష్‌తో కలిసి మంగళవారం ఆవిష్కరించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఏసీపీ వెంకటగిరి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ రిపోర్టర్ ప్రసాదరావుతో కలిసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఆవిష్కరించారు.

నామినేటెడ్ సభ్యుడిగా అవకాశం ఇవ్వండి




- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బానుక మల్లికార్జున్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడిగా తనకు లేదా తన భార్య నర్మదకు బీజేపీ అధిష్టానం అవకాశం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుక మల్లికార్జున్ మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కోరారు. ప్రస్తుతం నామినేటెడ్ సభ్యుడు పదవికాలం ముగుస్తుండడంతో ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్టాన్ని కోరుతున్నారు. పార్టీలో చేరి బీజేపీ గెలుపుకు ఎంతో కృషి చేశానని, ఉపాధ్యక్షురాలుగా తన సతీమణి నర్మద విశిష్టమైన సేవలు అందించారని, తమ సేవలను గుర్తించి ఈసారి నామినేటెడ్ పదవి వారిలో ఎవరికో ఒకరికి అవకాశం ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. తమకు ఇప్పటికే నామినేటెడ్ పదవి పొడిగించారని ప్రతిసారి ఒక్కరికి ఇవ్వటం కాకుండా మూడుసార్లు ముగ్గురు ఇచ్చుంటే బాగుండేదని తన అభిప్రాయం తెలిపారు. ఈ మేరకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డికి, బండి సంజయ్‌కి వినతి పత్రాలు అందజేశామని అదేవిధంగా ఆర్థిక శాఖ మంత్రి భగత్‌కు సీనియర్ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌కు విజ్ఞప్తి చేశామని తనకు తన భార్యగాని అవకాశం వస్తుందని ఆశాభావంతో ఉన్నట్లు వారు తెలిపారు. అవకాశం ఇవ్వకపోయినా మేం అంకితభావంతో పార్టీ కోసం పనిచేస్తామని, పార్టీ చేపట్టిన కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొంటామని, ఒకసారి అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.

భక్తులకు ఇక్కట్లు లేకుండా సౌకర్యాలు కల్పించాలి



- కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

నవతెలంగాణ-బంజారాహిల్స్

నూతన సంవత్సరం సందర్భంగా జూబ్లీహిల్స్ టీటీడీ దేవాలయానికి భారీగా భక్తులు పోటెత్తే అవకాశం ఎక్కువగా ఉందని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, టీటీడీ సభ్యులు భోజిరెడ్డి ఆధ్వర్యంలో భక్తుల కోసం ఆలయం బయట మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చెయ్యాలని జీహెచ్ఎంసీ అధికారులుకి సూచించారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా ఏర్పాట్లు చెయ్యాలని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులను కోరారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరం సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని జూబ్లీహిల్స్ డివిజన్లోని టీటీడీ ఆలయంతో పాటు ఫిలింనగర్ దైవ సన్నిదాన ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, మెడికల్ ఆఫీసర్ భార్గవ్ నారాయణ, సేనిటైజేషన్ సూపర్వైజర్ అమిత్, ఎస్ఎఫ్ఏలు శానప్ప, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
బుధవారం | జనవరి 01, 2025 | www.navatelangana.com

నూతన సంవత్సర శుభాకాంక్షలు : ఎమ్మెల్యే మర్రి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలకు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ వాసులు, దేశవిదేశాలలో స్థిరపడిన, నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. నూతన సంవత్సరం-2025 ఆరంభం సందర్భంగా వేడుకలను ప్రశాంతంగా, ఆనందంగా, ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా జరుపుకోవలసిందిగా, మద్యంసేవించి వాహనాలు నడుపొద్దని యువతకు ఉద్బోధించారు. కొత్త ఆలోచనలు, ఆకాంక్షలు, సుస్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణ, నిబద్ధత, పట్టుదలతో ముందుకు సాగుతూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలని యువతను కోరారు. కొత్త సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో తులతూగాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అభిలాషించారు.

నెహ్రూ బాబుకి పదవీ విరమణ శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

చార్మినార్ మండల డిప్యూటీ ఐఓఎస్ నెహ్రూ బాబు పదవి విరమణ సందర్భంగా మంగళవారం ఆయనను సైదాబాద్ మండల డిప్యూటీ డీఈఓ రాధాకృష్ణ, చార్మినార్ మండల డిప్యూటీ డీఈఓ సుజాత, డిప్యూటీ ఐఓఎస్ వెంకట నరసరాజు, పీఆర్‌టీయూ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మందడి వెంకట్ రెడ్డి, బాల్భవన్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సీనియర్ ఉపాధ్యాయులు అల్వాల శ్రీనివాస్, సత్యవతి, కాలడేర ఉపాధ్యాయులు అందరూ కలిసి ఘనంగా సన్మానించారు. వారు చేసిన సేవలు అన్నింటిని పలువురు కొనియాడారు.

నిరాశ్రయులకు రగ్గులు పంపిణీ

- న్యూ ఇయర్ సందర్భంగా ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ నర్సుల వితరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర వీధుల్లో చలికి గజగజ వణుకుతూ ఇబ్బంది పడుతున్న నిరుపేదలు, నిర్భాగ్యులను ఆదుకునేందుకు ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ నర్సులు సహృదయంతో ముందుకొచ్చారు. ఎస్ఆర్ నగర్ ప్రాంతంలో వీధుల్లో ఉంటున్న సుమారు 50 మంది నిరుపేదలకు రగ్గులను పంపిణీ చేశారు. సుమారు 120 మంది నర్సులు తాము సంపాదించిన దాంట్లోంచి తలా కొంత వేసుకుని ఈ రగ్గులు కొని, వీధుల్లో ఉంటున్న వారికి ఉచితంగా అందజేశారు. ప్రతిరోజూ హాస్పిటల్‌లో సేవలందిస్తున్న ఏంజెల్ నర్సులు ఈసారి కొత్త సంవత్సరం సందర్భంగా ఏదైనా మంచి పని చేయాలని తలపెట్టి, నిరుపేదలను చలి నుంచి రక్షించేందుకు రగ్గులు పంపిణీ చేయాలని నిర్ణయించారు. మంగళవారం సాయంత్రం ఎస్ఆర్‌నగర్ ప్రాంతానికి వెళ్లి, అక్కడ రోడ్లపై ఉంటున్న 50 మందికి ఈ రగ్గులను అందజేశారు. ఈ సందర్భంగా ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ లిండామోల్ జోయ్ మాట్లాడుతూ ప్రతి ఏడాదీ క్రిస్మస్, కొత్త సంవత్సరం సందర్భంగా ఏదో ఒక సంబురాలు చేసుకుంటామనీ, ఈసారి అలా కాకుండా.. పేదలను ఆదుకోవడానికి ఏమైనా చేస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చిందని చెప్పారు. వెంటనే తమ నర్సింగ్ గ్రూపులో పోస్ట్ చేయగా, ఏంజెల్ నర్సులంతా ముందుకొచ్చి తమకు చేతనైనంత సాయం చేశారనీ, వాటితో రగ్గులు కొని వీధుల్లో ఉన్నవారికి పంచామని తెలిపారు. వచ్చే ఏడాది కూడా మరిన్ని మంచి కార్యక్రమాలు చేస్తామన్నారు. నర్స్ ఎడ్యుకేటర్ రాహుల్ కమర్ మాట్లాడుతూ అన్నీ ఉన్న మనమే చలిని తట్టుకోలేకపోతున్నామనీ, అలాంటిది తల మీద గూడు కూడా లేకుండా నడివీధిలో పడుకుంటున్న నిర్భాగ్యులను చూసి తామంతా చలించిపోయామనీ, అందుకే ఈసారి వీరికి చలిని తట్టుకునేందుకు వీలుగా రగ్గులు ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. రాబోయే సంవత్సరాల్లో కూడా ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ సిబ్బంది పలు రకాల వినూత్న కార్యక్రమాలు చేసి.. ప్రధానంగా నిరుపేదలను ఆదుకునేందుకు ముందుకొస్తారని తెలిపారు.

ఖోఖో పోటీల్లో
శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ



- అభినందించిన కరస్పాండెంట్ తిలోత్తమ రెడ్డి

నవతెలంగాణ - చర్లపల్లి

ఓపెన్ ఇంటర్ స్కూల్ చాంపియన్ షిప్ ఖోఖో పోటీల్లో మొదటి బహుమతి, ఉత్తమ మార్చ్ పాస్ట్ అవార్డు గెలుపొందిన శ్రీచైతన్య విద్యార్థులను పాఠశాల కరెస్పాండంట్ వంగా తిలోత్తమ రెడ్డి అభినందిచారు. ఇటీవల తెలంగాణ ప్రయివేట్ యూనియన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభ కేవలం చదువులోనే కాదు, క్రీడలలో కూడా దాగి ఉంటుందని, వాటిని వెలికి తీసే బాధ్యత పాఠశాల ఉపాధ్యాయులదే అన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగ పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జాహ్నవి, ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్, పీఈటీ రవి విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి 138వ డివిజన్ పరిధిలోని భరత్ నగర్ పెద్దమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చొరవతో సీసీ రోడ్డు పనులను మంగళవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మౌలాలి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గతంలో కూడా అస్తవ్యస్తంగా ఉన్న భరత్ నగర్ చౌరస్తా వద్ద కల్వర్టు నిర్మించి, పకడ్బందీగా సీ.సీ.రోడ్డు వేయించారని, భరత్ నగర్ అభివృద్ధి ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందనీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకులు వంశీముదిరాజ్, సంతోష్ నాయుడు, కిరణ్ కుమార్, బాలస్వామి, మదన్ మూర్తి, నవాబ్, సాయి, కాలనీ వాసులు వసూలు రాందాస్ రాజు ముదిరాజ్, మోగులయ్య సాదిక్, పర్వెజ్, సోఫియన్, అవేజ్ తదితరులు పాల్గొన్నారు.

'మన్నె సుబ్రమణ్యం'కు కొవ్వొత్తులతో నివాళి



నవతెలంగాణ - చర్లపల్లి

ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎంపవర్.సంస్థల అదినేత మన్నె సుబ్రమణ్యం మరణం పారిశ్రాక రంగానికి, ఎమ్పవర్ సంస్థకు తీరని లోటు అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యాక్షులు టిజీకే మూర్తి అన్నారు. మంగళవారం చర్లపల్లి లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మన్నె సుబ్రమణ్యం ఆత్మకు శాంతి చేకురాలని ఎంపవర్ సంస్థ ఉద్యోగులు, సిబ్బంది సిహెచ్ వేంకటేశ్వర్ రావు, మన్నె త్రినాద్ అధ్వర్యంలో చర్లపల్లి పారిశ్రామికవాడలో మన్నె సుబ్రమణ్యం అమర్ ర హై అంటూ నినాదాలు చేస్తూ, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మన్నె సుబ్రమణ్యం ఎమ్పవర్ సంస్థ ఉద్యోగులను, సిబ్బందిని తమ సొంత కుటుంబ సభ్యులగా చూసుకునేవారని, అందరిని ఆప్యాయంగా పలకరించేవారని గురు చేసుకున్నారు. పారిశ్రామిక వేత్తగానే కాకుండా, ప్రముఖ దాతగా మానవతావాదిగా నిలిచిన ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతరాన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో కనకమేడల మురళీ, హన్మంతరెడ్డి, వి.దుర్గాప్రసాద్, రత్నకుమార్, వెంకటరమణ, శీరిష్, శ్రీనివాసరావు, రాజేంద్ర, సాయి మనోజ్, సాయి భారత్, ఎస్ఎస్ రాజు, నర్సింగరావు ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి కోర్టులో ఐలు పాకెట్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో నాంపల్లి కోర్టులో పాకెట్ క్యాలెండర్‌ను బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజావర్ధన్ రెడ్డి, ఐలు రాష్ట్ర కార్యదర్శి పార్థసారధి, హైదరాబాద్ కమిటీ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో న్యాయవాదులందరూ కక్షిదారులకు తక్కువ కాలంలోనే న్యాయం చేయాలని, ప్రజలు న్యాయం పొందేలా న్యాయవాదులందరూ కషి చేయాలని ఆకాంక్షించారు. సామాన్య ప్రజలకు న్యాయం అందని ద్రాక్షగా మారుతున్న నేటి పరిస్థితులలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ కక్షిదారుల పక్షాన నిలబడుతూ సేవలందించడం మంచి విషయమని ప్రెసిడెంట్ పేర్కొన్నారు. ఆల్ ఇండియా లాయర్ సీనియర్ రాష్ట్ర కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని, బార్ అండ్ బెంచ్ సమన్వయంతో పని చేయాలని అప్పుడే న్యాయవాదుల పట్ల సమాజం గౌరవం ప్రదర్శిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐలు సిటీ కమిటీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల్లో చదువుకుతగ్గ ఉద్యోగం ఇవ్వాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కారుణ్య నియామకాల కింది ఇటీవల ఉద్యోగంలో చేరి వారిలో డిగ్రీ, పీజీ చదువుకున్న వారికి సఫాయి పనికాకుండా తగిన ఉద్యోగం ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్, నగర కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో ఇటీవల కారుణ్య నియామకాల కింద ఉద్యోగంలో చేరిన వారిలో కొందరు డిగ్రీ, పీజీ చదువుకున్న వారున్నారని తెలిపారు. ఉన్నత చదువులు చదువుకున్న వారిని సైతం ఇతరులతో పాటు సఫాయి పనులలో వినియోగిస్తున్నారని, ఇది సమంజసంగా లేదన్నారు. వీరందరూ చాలా సుదీర్ఘకాలం పాటు కారుణ్య నియామకాల కోసం ఎదురుచూసి, సర్వీస్ కోల్పోయి ఉద్యోగంలో చేరినప్పటికీ తమ చదువుకు తగినపని ఇవ్వకపోవడం చాలా ఇబ్బందికరంగా ఫీల్ అవుతున్నారని అభిప్రాయపడ్డారు. ఉన్నత విద్యాభ్యాసానికి తగిన విధమైన పోస్ట్ లేదా పని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

నాట్య గురువు వనం కవిత శిష్య బృందం నాట్యం రస భరితం



ఒనవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ నాట్య గురువు వనం కవిత తన శిష్య బృందంతో రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై వాగ్గేయకారులు అన్నమయ్య త్యాగయ్య వాసుదేవ దీక్షితార్ తదితరులు కీర్తనలను రస భరితంగా నర్తించారు. రుద్ర శివ సాంస్కతిక సంస్థ , శివానీ ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వహణలో జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీఎస్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి సాదు శ్యామ్ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. శివానీ ఆర్ట్స్ రుద్ర ఆర్ట్స్ నిర్వాహకులు నాణ్యమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ కళా కారులను ప్రోత్సహిస్తున్నారని పౌరాణిక నాటకాల పరిరక్షణకు వారి కృషి ప్రశంసనీయం అన్నారు. భజన సంకీర్తన ప్రచార పరిషత్ అధ్యక్షుడు శివ ప్రసాద్ అధ్యక్షత వహించిన సభలో పులి కష్ణమూర్తి, బాబు రాజు, అర్చన, దైవజ్ఞ శర్మ, జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాట్య గురువు వనం కవితను నవ రసనాట్య మయూరి బిరుదుతో సత్కరించారు. సంస్థ స్థాపకుడు పరమేస్వర్ స్వాగతం పలుకగా శ్రీపాద రామ చంద్ర రావు కార్యక్రమం నిర్వహించారు.

శ్రీ జయ ఆర్ట్స్ 21వ వార్షిక వేడుకలు



నవతెలంగాణ-కల్చరల్

రంగస్థలం నటిగా జీవిత ప్రస్థానం ఆరంభించి టీవీ సీరియల్ నటిగా సినీ నటిగా మార్పు చెందుతూ రచయిత్రిగా ను నేడు గుర్తింపు పొందిన డాక్టర్ శ్రీ జ సాదినేని శ్రీ జయ ఆర్ట్స్ స్థాపించి 21 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సంస్థ వార్షిక వేడుకలు సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో శ్రీజ మాట్లాడుతూ మహిళగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని సంస్థను ముందుకు నడిపిస్తూ నటన పట్ల ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇచ్చి వారికి నాటకాల్లో అవకాశం కల్పించేను అని చెప్పారు. తాను ఇప్పటి వరకు 125 సినిమాలకు అసోసియేట్ రచయితగా 5 సినిమాలకి అసోసియేట్ డైరెక్టర్ పని చేసినట్లు తెలిపారు. శ్రీజను అభిమానులు సినీ నాటక రంగ ప్రముఖులు సత్కరించారు.

ఆత్మహత్య కేసులో నిందితులకు మేడ్చల్ కోర్టు తీర్పు

- ముగ్గురికి మూడేండ్ల జైలు శిక్ష ఖరారు

నవతెలంగాణ - జవహర్ నగర్

ఓ వ్యక్తి ఆత్మహత్య కేసులో నిందితులకు మేడ్చల్ అదనపు సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. ముగ్గురికి మూడేళ్ల జైలు శిక్ష ఖరారు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వీరారెడ్డి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడు అలకుంట మహేష్ తన సోదరుడు అలకుంట వెంకటేష్ (21) ఆత్మహత్యకు సంబంధించిన ఫిర్యాదు 2020 డిసెంబర్ 17న జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేశారు. కేసు నంబర్ 983/2020, సెక్షన్ 306 IPC క్రింద పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం మెడ్చల్ అదనపు సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. న్యూ భవానీ నగర్, దమ్మాయిగూడ కు చెందిన పల్లపు సంతోష (25) కూలీ, బొంత నరసింహులు (21) డ్రైవర్, బొంత యెల్లమ్మ (44), కూలీ, ఈ ముగ్గురు వెంకటేష్‌ను దారుణంగా వేధించి, ఆత్మహత్యకు ప్రేరేపించారన్నా వివరాలను పరిశీలించిన కోర్టు నిందితులపై వేధింపుల ఆరోపణలు నిజమని తేల్చి, వారికి మూడు సంవత్సరాల కారాగార శిక్ష, రూ. 500 జరిమానా విధించారు. ఈ కేసు పోలీస్ దర్యాప్తు అధికారి ఎస్ఐ, డి. అనిల్, కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుజనా రెడ్డి వాదనలు వినిపించారు. న్యాయస్థానం తీర్పుపట్ల బాధితుల కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఘనంగా వంగేటి సంజీవరెడ్డి బర్త్ డే



నవతెలంగాణ - చర్లపల్లి

మల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నేత వంగేటి సంజీవరెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు కాలనీ సంక్షేమ సభ్యులు, కాలనీవాసులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయ కులు పూలబొకె ను అందజేసి, శాలువాతో సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎడ్ల వెంకటేష్, కె రాజేష్, అశోక్, ప్రవీణ్, రామాంజ నేయులు, అంజి, సాయి, వీరాస్వామి, రమేష్, నరేష్, శీను ఉన్నారు.

క్రిస్మస్ వేడుకకు హాజరైన కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి



నవతెలంగాణ - చర్లపల్లి

కరుణ, ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలన్ని కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్ లను మల్లాపూర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ పొన్నాల దేవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముందుగా కేక్ కట్ చేసి, క్రైస్తవులకు క్రిస్మస్ అండ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రైస్తవులు ఐక్యతగా ఉండి, దేశం, రాష్ట్రం కొరకు ప్రార్ధన చేయండి, అందరూ బాగుండాలి..త అందులో మనం అందరం ఉండాలని ప్రజలకు తెలిపారు. ప్రజలు క్షేమాభివృద్ధి కొరకు క్రైస్తవుల అభివృద్ధి కొరకు నిత్యము సహకారిగా ఉంటానని మాట ఇచ్చారు. అంతకుముందు ఏసు ప్రభువుకు సంబంధించిన కీర్తనలను కళాకారులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో సద్గుణ రావు, రెవ ఎస్ తిమోతి, శామ్యూల్ రంగారావు, రత్నరాజు శాంతరాజు, ఆడం రాజు, స్టీఫెన్ కృపాదానం, ఎస్ జాన్ అనిల్ అనేక మంది పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ డిప్యూటీ డీఈఓ చిరంజీవికి పదవి విరమణ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు మందడి వెంకటే రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి. -నవతెలంగాణ-సిటీబ్యూరో

మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు :చిలుక



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

భారత మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థిక వేత్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దివంగత మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. ఏఎంసీలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి మంగళారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ భాస్కరా చారి, మార్కెట్ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, అంజయ్య, మేకం లక్ష్మి, రఘుపతి రెడ్డి, గణేష్ నాయక్, నర సింహ, బండి మధుసూదన్ రావు, నవరాజ్, గోవర్ధన్ రెడ్డి, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, అధి కారులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష

నవతెలంగాణ-హయత్‌నగర్



ఓ మైనర్‌ను ప్రేమ పేరుతో మభ్యపెట్టి, అపహరించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష పడింది. 2018లో సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చంపాపేటకు చెందిన నిందితుడు వరికుప్పల మహేష్.. బైక్ మెకానిక్ చింతపల్లి, నల్గొండ జిల్లా వాసి. నిందితుడు మహేష్‌కు పోక్సో చట్టం ప్రకారం 20 ఏళ్ళ కఠిన కారాగార శిక్ష విధించినట్లు సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైది రెడ్డి మంగళవారం వెల్లడించారు. పోక్సో చట్టం ప్రకారం రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్‌లోని ఫాస్ట్ ట్రాక్ కేసులో నిందితుడికి 20 ఏళ్ళ కఠిన కారాగార శిక్ష, రూ.25,000 జరిమానా విధించగా.. బాధితురాలికి రూ.5,00,000 పరిహారం అందించినట్టు తెలిపారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాణ-చంపాపేట్

ఎల్బీనగర్ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సంవత్సరం అందరీ కుటుంబాల్లో ఆనందం వెల్లివిరవాలని ఆకాంక్షించారు. అలాగే రాబోయే రోజుల్లో ఈ ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధి విషయంలో మరింత దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



నవతెలంగాణ-చంపాపేట్

తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాక్షాంలను హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ సుభాష్ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరూ పోలీసులను సహకరించాలన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి 2025 సంవత్సరానికి ఆనందంగా గడపాలన్నారు.

నవతెలంగాణ-చంపాపేట్

రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలను సంతోష్ నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరాన్ని ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. శాంతి భద్రత పరిరక్షణకు ప్రజలందరూ పోలీసులను సహకరించాలన్నారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ కాంతిలాల్ పాటిల్ సుభాష్ ఆదేశం అనుసారంగా సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ కమిటీ సభ్యులు అడ్వకేట్ కిషన్ శర్మ ఆల్ జోన్ జనరల్ సెక్రెటరీ ఖాజా ఘుజవుద్దీన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కాలనీ ఆలయం, మసీద్, పాఠశాల పరిధిలోని పార్క్ వద్ద ఎలాంటి సమస్య ఉన్నా పోలీసులను సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్, ఐఎస్ సదన్, మాదన్న పేట్ పీస్ కమిటీ సౌత్ ఈస్ట్ జోన్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ గోవింద్ సాగర్, కమిటీ సభ్యులు సంతోష్ నగర్ డివిజన్



అధ్యక్షులు చింతల శ్రీనివాస్, సయ్యద్ అబ్దుల్ అజీమ్, మహమ్మద్ కాజా సలీం, నర్సింగ్ రావు, రవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పేదల పక్షపాతి నవతెలంగాణ దినపత్రిక'



నవతెలంగాణ-నాగోల్

బడుగు, బలహీన వర్గాలు, కార్మిక, కర్షకులకు అండగా నిలుస్తూ.. సమాజంలోప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నవతెలంగాణ దినపత్రిక నిరంతరం ఎంతో కృషి చేస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. నాగోలులోని తన క్యాంపు కార్యాలయంలో నవతెలంగాణ దినపత్రిక 2025 క్యాలెండర్ను మంగళవారం నవతెలంగాణ దినపత్రిక ఎల్బీనగర్ డివిజన్ ఇంచార్జ్ పి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక రిపోర్టర్ భగవంతరావుతో శ్రీనివాస్ గుప్త ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై విశ్లేషించి, ఎత్తిచూపుతూ కథనాలను ప్రచురించి.. ఒక వైపు ప్రజలకు, మరోవైపు ప్రభుత్వాలకు వారధిగా వ్యవహరిస్తూ నవతెలంగాణ దినపత్రిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని కొనియాడారు. మంచి అనుభవం కలిగిన విలేకరులను కలిగిన నవ తెలంగాణ దినపత్రిక.. సమాజానికి ఉపయోగపడే కథనాలను అందిస్తూ ప్రజలను చైతన్య పరుస్తుందన్నారు. భవిష్యత్తులో నవతెలంగాణ దినపత్రిక రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని మరింత ముందుకెళ్లి పాఠకులకు, శ్రేయోభిలాషులకు మంచి వార్తా కథనాలను అందించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి 'నవతెలంగాణ'

నవతెలంగాణ దినపత్రిక పేదల పట్ల పక్షపాతిగా నిలుస్తూ, నిత్య జీవితంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిని సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. నాగోల్‌లో వారి స్వగృహంలో నవతెలంగాణ దినపత్రిక 2025 నూతన సంవత్సర నూతన క్యాలెండర్ను మంగళవారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ నాథ్ యాదవ్, నవతెలంగాణ దినపత్రిక ఎల్బీనగర్ డివిజన్ ఇంచార్జ్ పి శ్రీనివాస్ రెడ్డి, నవతెలంగాణ దినపత్రిక నాగోల్ విలేఖరి భగవంతురావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వైపున నిలుస్తూ.. ఎప్పటికప్పుడు వారి సమస్యలను, వార్తా కథనాల ద్వారా అటు పాలకులకు, ఇటు ప్రభుత్వ అధికారులకు తెలియజేస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. నవతెలంగాణ దినపత్రిక సిబ్బందికి, మరియు నాగోల్ డివిజన్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో నవతెలంగాణ దినపత్రిక నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని మరింత అభివృద్ధి చెందుతూ ముందుకెళ్లాలని ఈ సందర్భంగా వారు కోరారు.



మలక్‌పేట మాస్ లీడర్ చెకొలేకర్ శ్రీనివాస్





మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా చెకొలేకర్ లక్ష్మీ శ్రీనివాస్

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా మలక్‌పేట మాస్ లీడర్ చెకొలేకర్ లక్ష్మీ శ్రీనివాస్.. మలక్‌పేట మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఇటీవల ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర స్థాయిలో బీసీ నేతగా ఎదిగిన చెకొలేకర్ శ్రీనివాస్ కరుడు గట్టిన కాంగ్రెస్ వాదిగా పార్టీలో గుర్తింపు ఉన్నది. చెకొలేకర్ శ్రీనివాస్ సతీమణి లక్ష్మీ శ్రీనివాస్ ఇటీవలనే హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. హైదరాబాద్



వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి జనరల్ మహిళకు కేటాయించారు. అయినప్పటికీ చెకొలేకర్ శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా బీసీ వర్గానికి చెందిన శ్రీనివాస్ సతీమణిని సీఎం రేవంత్ రెడ్డి ఎంపిక చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

సలీంనగర్ డివిజన్ నుంచి 2009 లో కార్పొరేటర్‌గా విజయం సాధించిన చెకొలేకర్ శ్రీనివాస్ అంచెలంచెలుగా ఎదిగి నేడు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఎంపిక అయ్యారు. రాజకీయ దిగ్గజాలు తీగల కృష్ణారెడ్డి, ఎవిఎస్ రెడ్డిల తీవ్ర ప్రభావం ఉన్న సలీంనగర్ డివిజన్ నుంచి శ్రీనివాస్ సంచలన విజయం సాధించారు. సీనియర్ రాజకీయ నేత ఎవిఎస్ రెడ్డిపై 2009 కార్పొరేషన్ ఎన్నికల్లో అనూహ్యంగా చెకొలేకర్ శ్రీనివాస్ గెలుపొందారు. ఈ విజయం రాష్ట్ర స్థాయిలో తీవ్ర చర్చనీయాంశమైంది అంటే అతిశయోక్తికాదు. 2009 కార్పొరేషన్ ఎన్నికల్లో సలీంనగర్ డివిజన్ జనరల్ స్థానం అయినప్పటికీ బీసీ వర్గానికి చెందిన శ్రీనివాస్ గెలుపు రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. కార్పొరేటర్‌గా డివిజన్‌లో రాజకీయాలకు అతీతంగా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి చెకొలేకర్ శ్రీనివాస్ కృషి చేశారు. మౌలిక సదుపాయాలు తాగు నీరు, రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ విస్తరణ, వీధి దీపాలు ఏర్పాటు, కమ్యూనిటీ హాలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

డివిజన్‌లో కళ్యాణ మండపం, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి చేసి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే నేతగా గుర్తింపు పొందారు.



కరోనా సమయంలో ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకులు అన్నదానాలు నిర్వహించిన శ్రీనివాస్.. నేటికీ సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నారు. అన్ని వర్గాలకు చెందిన పర్వదినాల్లో ఆయా వర్గాలకు తన వంతుగా ఆర్థిక సహాయం అందించే శ్రీనివాస్‌కు స్థానికంగా ఆపదలో ఉన్న అన్న అంటే అండగా నేను ఉన్నా అంటూ స్పందిస్తారనే పేరు చెకొలేకర్ శ్రీనివాస్‌కు ఉన్నది. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వరంగల్ రైతు సంఘర్షణ రాహుల్ గాంధీ సభకు మలక్ పేట నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలతో కలిసి తరలివెళ్లారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని ఆందోళన కార్యక్రమాల్లో చెకొలేకర్ శ్రీనివాస్ క్రియాశీలకంగా పాల్గొన్నారు. నిత్యం నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహించి.. పాతబస్తీ ప్రభావం తీవ్రంగా ఉండే మలక్‌పేట ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ ఉనికిని చాటుకుంటూ వస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు అనేక సార్లు ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్న శ్రీనివాస్‌ను పలుమార్లు పోలీసులు అరెస్టు చేశారు.



జీహెచ్ఎంసీ, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీకి చెందిన నేతలు పార్టీ మారాలని ఎన్నో ఒత్తిడులు చేసినప్పటికీ చెకొలేకర్ శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ కండువాను మార్చలేదు. ఖైరతాబాద్, నాంపల్లి నియోజకవర్గాలకు ఇంచార్జిగా పని చేసిన శ్రీనివాస్ ఆయా డివిజన్ను, కమిటీలు పూర్తి చేసి అప్పటి ప్రోగ్రాం కమిటీ చైర్మెన్ మహేష్ గౌడ్‌కి అందజేశారు. ఎన్ఎస్‌యుఐ, యువజన కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేసిన శ్రీనివాస్ పీసీసీ అధికార ప్రతినిధిగా పని చేశారు. ప్రస్తుతం టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న చెకొలేకర్ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధితో నిజాయితీగా పని చేసిన చెకొలేకర్ శ్రీనివాస్ సతీమణి లక్ష్మీ శ్రీనివాస్‌కు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రమాణస్వీకారం సందర్భంగా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరు కాగా మార్కెట్ సమస్యలను పరిష్కరించాలని చైర్మెన్ లక్ష్మీ శ్రీనివాస్ మంత్రికి విజ్ఞప్తి చేశారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన మార్కెట్ యార్డు నేటికీ కొనసాగుతోందని, మౌలిక సదుపాయాలు లేక రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ,అధికారులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె వివరించారు. దీనికి స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. మార్కెట్ అభివృద్ధికి సహకరిస్తానని ప్రమాణస్వీకారం సభలో ప్రకటించారు. మార్కెట్ లో నెలకొన్న సమస్యలు పై పాలకవర్గ సభ్యులతో కలిసి చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్ పీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్‌లు మార్కెట్ లో క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని చైర్మెన్, పాలకవర్గం దృష్టికి తీసుకువచ్చారు. మార్కెట్ అధికారులతో చర్చించి నిధులు మంజూరుతో పాటు మార్కెట్ అభివృద్ధి కోసం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకు పోతానని చైర్మెన్ లక్ష్మీ శ్రీనివాస్ నాటి పర్యటనలో స్పష్టం చేశారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు తాగు, నీరు, రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ విస్తరణ, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకుపోతానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

తీగ లాగితే డొంక కదిలింది...

- వాహనాల తనిఖీల్లో పట్టుబడిన నిందితులు
- 30 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- ఇద్దరు అరెస్ట్.. పరారీలో ఒకరు





నవతెలంగాణ-హయత్‌నగర్

వారంతా పాత స్నేహితులు.. జల్సాలకు అలవాటు పడి పార్కింగ్ చేసిన ద్వి చక్ర వాహనాలను చోరీ చేసి, వాటిని సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న నారాయణ పేటలో విక్రయించేవారు. ఆ నిందితులను చైతన్యపురి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్ బాబు ఎల్బీనగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించారు. మహ్మద్ షేక్ ఇతను ఏసీ మెకానిక్. మహ్మద్ ఇమ్రాన్ ఆటో డ్రైవర్. ఇమ్రాన్ ఆటో డ్రైవర్. వీళ్ళు హైదరాబాద్ గోల్కొండ వాసులు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్ట్ అయి 2023లో జైల్ నుండి విడుదల అయ్యాక మిగతా ఇద్దరితో కలిసి ద్వి చక్ర వాహనాలను చోరీ చేసి తక్కువ ధరకు అమ్మేవారు. ఈ మేరకు చైతన్యపురి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మహ్మద్ షేక్, మహ్మద్ ఇమ్రాన్‌లు దొంగిలించిన వాహనంపై వెళ్తుండగా అనుమానం వచ్చి విచారణ చేయగా.. నెంబర్ ప్లేట్ లేని వాహనానికి సంబంధించిన పత్రాలు చూపించాలని అడిగారు. కానీ వాళ్ళు తగిన ఆధారాలు చూపించక పోవడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేపట్టగా మొత్తం 30ద్వి చక్ర వాహనాలను దొంగలించినట్టు బయటపడింది. ఆ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మూడు కమిషనరేట్‌లతో పాటు, వికారాబాద్, సంగారెడ్డి, నిజామాబాద్‌లలో కేసులు నమోదయ్యాయి. ఆ వాహనాల విలువ రూ.46లక్షలు ఉందని అంచనా వేశారు. ఆయన వెంట ఎల్బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్ కుమార్, అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, చైతన్య పురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ గురు స్వామి తదితరులు ఉన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం



నవతెలంగాణ-హయత్‌నగర్

రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్ఐ ఆర్. లచ్చిరాం, స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి. కృష్ణలను సీపీ సుధీర్ బాబు మంగళవారం ఎల్బీనగర్‌లోని రాచకొండ క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఇన్ని రోజులు పోలీసు శాఖలో సమర్థవంతంగా, క్రమశిక్షణతో పనిచేసి సేవలు అందించినందుకు అభినందించారు. పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్ ఇతర ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలని సూచించారు. వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పదవీ విరమణ పొందే అధికారుల, సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన పెన్షన్ డెస్క్ ద్వారా పదవీ విరమణ పొందిన లచ్చిరాంకి తక్షణమే పెన్షన్ సౌకర్యం మంజూరు చేయడం పట్ల లచ్చిరాం సంతోషంతో సీపీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్.ఐ నాయుడు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య భాష్యంతోనే సాధ్యం

భాష్యం విద్యా సంస్థల సీఈవో చైతన్య



నవతెలంగాణ - చంపాపేట్

ఉన్నత విద్య భాష్యంతోనే సాధ్యమని భాష్యం విద్యా సంస్థల తెలంగాణ సీఈవో చైతన్య అన్నారు. హైదరాబాద్ సంతోష్ నగర్‌లోని భాష్యం ఉన్నత పాఠశాల చంపాపేట్ లిటిల్ చాంప్స్ ఆధ్వర్యంలో 7వ వార్షికోత్సవాన్ని మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందేలా మా కొన్నేండ్లుగా భాష్యం సంస్థలు సాధించిన విజయాలను వివరించారు. నేటి కాలపు విద్యార్థులు "కలలు కనండి మీ కలను సాకారం చేసుకోండి" అని బోధించి, నిరూపించి చూపించిన అబ్దుల్ కలాంను ఆదర్శంగా సూచించారు. ఈ మధ్యకాలంలో బీపీఎల్ భాష్యం ప్రీమియర్ లీగ్ అనే క్రికెట్



భాష్యం ఎప్పుడు ముందుంటుందని అన్నారు. వేద ప్రాజెక్టు డైరెక్టర్ కిశోర్ నాథ్ మాట్లాడుతూ మా కాలంలో ఇటువంటి కార్యక్రమాలు ఏవి ఉండేవి కాదని.. నేటి కాలంలో విద్యార్థులు ఎంతో నైపుణ్యం కలవారని భాష్యం విద్యా సంస్థల ప్రణాళికలను అభినందించారు. భాష్యం విద్యా సంస్థల జోనల్ ఇంచార్జి అంకమ్మ రావు మాట్లాడుతూ.. టోర్నమెంటును నిర్వహించి.. విద్యార్థులను ప్రోత్సహించామన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ భాష్యం ప్రధానోపాధ్యాయురాలు ప్రవంతి, చంపాపేట్ భాష్యం లిటిల్ చాంప్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రీత, లక్ష్మీనారాయణ, సంతోషి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

శివానీ మహిళా కళాశాల క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

కొత్తపేటలోని శివానీ మహిళా కళాశాల 2025 సంవత్సరం నూతన క్యాలెండర్‌ను మంగళవారం కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మెన్ డాక్టర్ పి. రాంరెడ్డి, కార్యదర్శి సుదర్శన్ రెడ్డిలు మాట్లాడుతూ.. వేగంగా మారిపోతున్న కాలంలో కూడా క్యాలెండర్ ఆవశ్యకత నేటికి కొనసాగుతుందన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా ఆన్‌లైన్ డిజిటల్ యుగంగా మారుతున్న కూడా క్యాలెండర్ అనేది నిరంతరం కొనసాగుతుందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉన్న భారత్‌లో



క్యాలెండర్‌కు తప్పకుండా ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రపంచం మొత్తం పరుగులు పెడుతున్న కూడా ప్రతి ఒక్కరికీ రోజులో ఒక్కసారి అయినా క్యాలెండర్ చూడకుండా ఉండలేరు అని అభిప్రాయపడ్డారు. దిన చర్యలో భాగంగా ముహూర్తాలు, దుర్ముహూర్తాలే కాకుండా పండుగలు, ప్రభుత్వ సెలవులు వంటి అంశాలు ఒక్క క్యాలెండర్‌లేనే సాధ్యమవుతుందన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణలో కళాశాల చైర్మెన్ డాక్టర్ పి. రాంరెడ్డి, కరస్పాండెంట్, కళాశాల కార్యదర్శి వెదెరె సుదర్శన్ రెడ్డి, పి.అనిత, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాది.. కొత్త నిర్ణయాలు

కొత్త ఏడాది మొదలయింది. ఈ మధుర క్షణాలను ఆస్వాదించాలని ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. గడియారంలోని రెక్కల చప్పుడు గుండెల్లో వినిపించే క్షణాలని ఆస్వాదించే ఉంటారు. ఆ సమయంలో చాలా మంది కొన్ని తీర్మానాలు తీసుకుంటున్నారు. న్యూ ఇయర్ రిజల్యూషన్స్ పేరిట నిర్ణయాలు ప్రకటిస్తారు. అయితే కొన్ని రోజులు పాటించి ఆ తర్వాత మర్చిపోతారు. అదే మనం తీసుకునే నిర్ణయాలు ఆచరింపదగినవిగా చూసుకుంటే మన జీవితంలో శాశ్వతమైన సానుకూల మార్పును అవి అందిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తీసుకోదగిన తీర్మానాలేంటే తెలుసుకుందాం. వీటి ద్వారా బంధాలను బలోపేతం చేసుకోవడంతో పాటు మన మానసిక, శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చిన వారమవుతాము. ఇంతకీ అవేంటో ఓసారి చూద్దాం..





ఒక ఏడాది అంటే 365 రోజులని కాదు. 365 అవకాశాలు అని అర్థం. వాటిని అదును చూసి మంచి సందర్భంలో సద్వినియోగం చేసుకోవాలి. చేయాలనుకున్నదేదో ఇప్పుడే చేసి తీరాలి. సాధించాలనుకున్న పనికి వెంటనే పునాదులు వేయాలి. ఈ ఏడాదైనా ప్రతి క్షణం జీవితంలో తృప్తితో గడిపేద్దాం. అలా చేయాలంటే ప్లానింగ్ కావాలి. మనల్ని ముందుకు నడిపే దిక్సూచి కావాలి. ఆ శక్తి ఎక్కడి నుంచో రాదు. మనం పెట్టుకునే లక్ష్యం దిశగా అడుగులు వేసే తపన నుంచే వస్తుంది. దాని కోసం మనం చేసే కృషిలో నుంచి వస్తుంది. గత ఏడాది మనం చేసిన పొరపాట్లను విశ్లేషించుకొని చూసుకుంటే వస్తుంది. అనుకున్నది సాధించినప్పుడు కలిగే తృప్తిలో నుంచి వస్తుంది. అందుకే కొత్త ఏడాదిని ఆస్వాదించేందుకు మన లక్ష్యాల సాధన దిశలో అడుగులు వేయాలి.

మానసిక శ్రేయస్సు

ఆధునిక జీవితం శరవేగంగా పరుగెడుతోంది. తీవ్ర ఒత్తిళ్లతో మానసిక ఆరోగ్యం దెబ్బతింటోంది. అందుకే మీ మానసును పదిలంగా ఉంచుకోడానికి, ఆరోగ్యకరమైన ఆలోచనలు చేయడానికి ఈ కొత్త ఏడాదిలో తీర్మానించుకోండి. మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే శారీరకంగా కూడా దృఢంగా ఉండాల్సిన అసవరం ఉంది. కనుక మీ శరీరాన్ని ఎక్కువగా కదిలించడానికి, ఆరోగ్యకరమైన బరువును ఉంచుకోడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకోసం డ్యాన్స్, ఈత, హైకింగ్ వంటి చేయడం అలవాటు చేసుకోవాలి. వీటి ద్వారా శరీరంలో ఎండార్ఫిన్‌లను ప్రేరేపితమవుతుంది. మానసిక ఆనందం కలుగుతుంది. అలాగే ఎక్కువ సమయం ప్రకృతిలో సమయం గడపడం కూడా అంతర్గత శాంతి, స్థితిస్థాపకతను పెంపొందించేందుకు దోహదపడతాయి.

సానుకూల సంబంధాలు

స్నేహితులు, శ్రేయోభిలాషులు, బంధువులతో బంధాలను బలోపేతం చేసుకోడానికి ప్రయత్నించండి. అందుకోసం తగిన సమయం, శక్తితో పాటు అవసరం అయితే పెట్టుబడిని కూడా పెట్టండి. కొన్ని సోషల్ మీడియా ఫీడ్ల నుంచి ఒత్తిడి నుంచి విముక్తి పొందొచ్చు. ఎక్కువగా స్నేహితులతో సంభాషించడం, టెక్ట్స్‌లు, ఫోన్ కాల్స్ ద్వారా ప్రియమైన వారితో నాణ్యమైన సమయం గడపటం చేస్తుండాలి. దీని వల్ల సానుకూల సంబంధాలు పెంపొందుతాయి. ఈ కొత్త ఏడాదిలో ఈ మేరకు ఓ తీర్మానం చేసుకోవచ్చు.

కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోండి..

జీవితకాల అభ్యాసం వ్యక్తిగత వృద్ధికి శక్తివంతమైన ఉత్ప్రేరకం అని గుర్తుపెట్టుకోవాలి. కనుక వెంటనే మీలోని ఉత్సుకతను రేకెత్తించండి. కొత్త భాషలో ప్రావీణ్యం సంపాదించినా, ఒక కొత్త పరికరాన్ని ఎలా వాడాలో తెలుసుకున్నా, మిమ్మల్ని ఎప్పుడూ ఆకర్షించే రంగంలోకి దిగినా... ఇలా ఏదైనా సరే నేర్చుకోవడం మీ మనసును పదునుగా ఉంచుతుంది. కొత్త అవకాశాలకు తలుపులు తెరుస్తుంది. ఆ దిశగా సమయాన్ని కేటాయిస్తూ కొత్త పనులను పెట్టుకోండి.

దాతృత్వాన్ని అలవర్చుకోండి..

మీ సమయాన్ని, ప్రతిభను లేదా వనరులను ఇతరులతో పంచుకోవడం మొదలు పెట్టండి. ఇది మీ జీవితానికి ఓ అర్థాన్ని జోడించడానికి శక్తివంతమైన మార్గం. మీ నైపుణ్యాలను స్వచ్ఛందంగా అందించండి. మీకు నచ్చిన సేవాకార్యక్రమాల కోసం విరాళం ఇవ్వండి. లేదా అవసరంలో ఉన్నవారికి సహాయం చేయండి. దీనివల్ల దాతృత్వం ద్వారా అందే మనశ్శాంతిని ఆస్వాదించవచ్చు.

చిన్న చిన్న ఆనందాలు

ఆధునిక సమాజం ఎప్పుడు ఉరుకులు పరుగులు పెడుతుంది. డెడ్ లైన్లు, పనుల ఒత్తిళ్లతో సతమతం చేస్తుంది. ఈ క్రమంలో చిన్న చిన్న విషయాలను కూడా ఆస్వాదించలేక పోతున్నవారు మన చుట్టూ ఎందరో ఉన్నారు. అందులో మనం కూడా ఉండే ఉంటాం. ఉదయాన్నే ఒక కప్పు కాఫీని ఆస్వాదించలేకపోవడం, వాకింగ్ సమయంలో పర్యావరణాన్ని ఆస్వాదించలేకపోవడం, మంచి సంగీతాన్ని ఆస్వాదించలేకపోవడం, మీ ప్రియమైన వారికి ఎటువంటి కారణం లేకుండా ఒక హగ్ వంటివి మిస్ అవుతూ ఉంటాం. ఈ కొత్త ఏడాదిలోనైనా ఇలాంటి చిన్న చిన్న ఆనందాలను మిస్ కాకుండా ఉండేటట్లు చూసుకోవాలి.



మరికొన్ని...

- ఆరోగ్యాన్ని నిజమైన సంపదగా భావించండి. మీకు ఎంత డబ్బున్నా ఆరోగ్యం సహకరించకుంటే మాత్రం జీవితాన్ని ఎపపటికీ ఆస్వాదించలేరు.
- లక్షలకు లక్షలు ఆదాయం ఉండాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. మీ అవసరాలను తీర్చేంత ఉంటే చాలు. మనం అనుకున్న మంచి హెూటల్లో తినడం, నచ్చిన ప్రదేశాలకి వెళ్లి అక్కడి ప్రాంతాన్ని ఆస్వాదించడం, నచ్చిన సినిమాను చూడడం. ఇలాంటి సాకారమయ్యే కోరికలన తీర్చుకోండి. చిన్న అవసరాలకు కూడా ఇతరుల దగ్గర చేయి చాచడం అంటే మనల్ని మనం తక్కువ చేసుకుని ఒప్పుకోవడమే అవుతుంది.
- అద్దె ఇల్లు ఎంత పెద్దదైనా అది మన అనే ఫీలింగ్‌ను కలిగించదు. మీ సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ఇష్టంగా కష్టపడండి. మీరే స్వయంగా మొక్కలను నాటండి. వాటి ఎదుగుదలను నిరంతరం చూడండి. వాటితో బంధుత్వ భావాన్ని మంచి మనసుతో పెంపొందించుకోండి.
- మీ జీవితంలో మరో మైలు రాయి మీ అభిరుచికి తగిన భాగస్వామిని ఎంచుకోవడం. మీ ప్రయాణంలో అపార్థాలు లేకుండా చూసుకోవాలి. ఎప్పుడూ కూడా ఇద్దరూ ప్రశాంతతను కోల్పోయే పరిస్థితి అస్సలు తెచ్చుకోవద్దు.
- జీవితంలో మీకంటే ఉన్నత స్థాయిలో ఉన్న వారిని చూసి పోల్చి చూసుకోకండి. మీకన్నా చాలా బాగా ఎదిగారు బాగా సంపాదించారు. మంచి పేరు సంపాదించారంటూ ప్రతికూల ధోరణితో కూడిన ఆలోచనలు అస్సలు చేయకండి.
- గాలి కబుర్లు, చెప్పుడు మాటల కోసం వచ్చే వారిని మీ దగ్గరకు రాకుండా నిలుపుదల చేయండి. ఒకవేళ రానిస్తే వారిని మారు వదిలించుకోవాలంటే చాలా అలసిపోతారు. మైండంు డిస్టర్బ్ అవుతుంది.
- తోటపని, ఆడటం, చదవడం, రాయడం, పాటలు వినడం లాంటి అభిరుచులను పెంపొందించుకోండి. ఇవి మీలో క్రియేటివిటీని పెంచుతాయి.
- ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం 15 నిమిషాల చొప్పున మీ గురించి మీరు ఆత్మ పరిశీలనకు కేటాయించుకోండి. ఉదయం 10 నిమిషాల పాటు మీ మనసును నిశ్చలంగా ఉంచుకోవడానికి ప్రయత్నించండి. మరో ఐదు నిమిషాలు ఆరోజు పూర్తి చేయాల్సిన పనుల జాబితాను తయారు చేసుకోవడానికి కేటాయించండి. ■

చిత్ర పరిశ్రమను వివాదాల్లోకి లాగొద్దు

(మొదటిపేజీ తరువాయి)

స్పందించారు. రాజకీయాలతో సంబంధం లేని తమపై చేసిన వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు, "సీఎంతో జరిగిన సమావేశం ఒకరిద్దరితో కాకుండా అందరికీ తెలిసే జరిగింది. తెలుగు చిత్రపరిశ్రమ బాగోగుల గురించి అత్యంత స్నేహపూర్వకంగా, ఎలాంటి దాపరికాలు లేకుండా జరిగిన సమావేశం పట్ల పరిశ్రమ చాలా సంతృప్తిగా ఉంది. తెలంగాణ అభివృద్ధి పయనంలో చిత్రపరిశ్రమ భాగస్వామ్యాన్ని గుర్తించి.. రాష్ట్రాభివృద్ధికి, సామా జిక సంక్షేమానికి, మా బాధ్యతగా తగిన సహకారం అందజేయాలని సీఎం కోరారు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలనే సీఎం బలమైన సంకల్పాన్ని చిత్రపరిశ్రమ ప్రతినిధులుగా మేమందరం స్వాగతించాం. అనవసర వివాదాల్లోకి పరిశ్రమను లాగి లేనిపోని రాజకీయాలను ఆపాదించొద్దని మా మనవి. రాజకీయ దాడి, ప్రతి దాడులకు దయచేసి పరిశ్రమను వాడుకోవద్దని అందరినీ కోరుతున్నాం. లక్ష లాది మందికి జీవనోపాధి కల్పిస్తోన్న పరిశ్రమకు అన్ని ప్రభుత్వాల సహకారం, ప్రజలందరి ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని ఆశిస్తున్నాం" అని దిల్ రాజు పేర్కొన్నారు.

గద్వాలలో కోర్టు భవనం నిర్మించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి మల్లు రవి వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కోర్టు భవనం నిర్మించాలని ఎంపీ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కోరారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లో సీఎం నివాసంలో కలిసి సీఎంకు వారు వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే బార్ అసోషియేషన్ తమను కోరిందంటూ ఈ సందర్భంగా సీఎంకు వివరించారు.

జాతీయ రహ 'దాడులు'

(మొదటిపేజీ తరువాయి)

సెక్షన్ (వరంగల్- ఖమ్మం) 203.800 కి.మీ నుంచి 220.480 కి.మీ కోసం సుమారు 266 ఎకరాలను అరకొర ధరకు లాక్కునేందుకు ప్రభుత్వం ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. పలుమార్లు గెజిట్ విడుదల చేసింది. అత్యంత సారవంతమైన, ఎకరం సుమారు రూ.కోటికి పైగా విలువ చేసే భూములను రిజిస్ట్రేషన్ విలువకు రెండు రెట్లు అంటే కనీసం రూ.20 నుంచి రూ.30 లక్షల మధ్య పరిహారం ఇచ్చి లాక్కోవాలనే ప్రయత్నాలు సాగుతున్నాయి. దీనిపై రైతులు కోర్టును ఆశ్రయించారు. అలైన్‌మెంట్ మార్చాలని, మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏడాది కాలంలో 8 కేసులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చాలని సుమారు 130 మంది రైతులు హైకోర్టులో ఏడాది కిందటి నుంచి పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. ఇప్పటికీ 8 కేసులు దీనిపై కొనసాగుతున్నాయి. అన్నింటిలోనూ హైకోర్టు స్టే ఆర్డర్స్ ఇచ్చింది. రైతులు కోరిన అలైన్‌మెంట్ మార్పు అంశంపై రిప్లయ్ ఇచ్చి స్టే ఆర్డర్స్‌ను రద్దు చేసుకునే అవకాశం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు ఉంది. కానీ ఆ ప్రయత్నమేమీ చేయకుండా ఎన్‌హెచ్ అధికారులు రైతుల భూములను దౌర్జన్యంగా లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. రైతుల మధ్య ఐక్యతను దెబ్బతీస్తేనే ఇది సాధ్యమవుతుందని భావించి వారికి వ్యక్తిగతంగా ఫోన్లు చేయడం, కలవటం వంటివి చేస్తూ మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారు. ఇచ్చిన పరిహారం తీసుకోవాలని ఒత్తిడి తీసుకొస్తున్నారు. లేదంటే భూములు, ఇటు పరిహారం రెండూ కోల్పోవాల్సి ఉంటుందని బెదిరిస్తున్నారు.

అయినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా అధికారులు వేసిన హద్దు రాళ్లను రైతులు ఎప్పటికప్పుడూ తొలగిస్తున్నారు.

పూర్తిగా కార్పొరేట్ల కోసమే..

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించేది పూర్తిగా కార్పొరేట్ల కోసమే. సాధారణ ప్రజలకు ఎలాంటి ఉపయోగమూ లేదు. దీనివల్ల తమ భూముల్లోకి వెళ్లేందుకు కనీసం ఐదారు కి.మీ తిరిగి రావాల్సి ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ రోడ్డును భూ మట్టం పైనుంచి కనీసం 28 ఫీట్ల ఎత్తుతో నిర్మిస్తారు. దీనిపై హెవీ వెహికల్స్ తప్ప ద్విచక్రవాహనాలు వంటివి వెళ్లడానికి వీల్లేదు. పైగా అర కి.మీ ఒక ఎగ్జిట్ ఇస్తారు. అదీ డొంకలు, రోడ్ల వంటివి ఉంటేనే కేటాయిస్తారు. పర్యావరణ అనుమతులు సైతం సరిగా లేవు. ఎన్‌హెచ్ రూల్స్‌కు ఇది విరుద్ధంగా ఉండటం గమనార్హం. గ్రీన్‌ఫీల్డ్ హైవే విస్తీర్ణం 60 మీటర్లు ఉండాల్సి ఉండగా దీన్ని 45 మీటర్ల విస్తీతోనే నిర్మిస్తున్నారు. సర్వీస్ రోడ్డు సౌకర్యం కూడా లేదు. ఇండ్ల ప్లాట్ల మధ్య నుంచి ఈ రోడ్డు వెళ్తుంది. ఖమ్మం కలెక్టరేట్ సైతం ఈ రోడ్డు అవలే ఉంటుంది. దాదాపు 250 కి.మీ దూరం రాష్ట్రం పరిధిలో నిర్మించే ఈ రోడ్డుకు మొత్తమ్మీద 10 అండర్‌పాస్‌లు మాత్రమే ఇస్తారు. ఖమ్మం జిల్లాలో రెండు మాత్రమే ఉంటాయి.

దీని అలైన్‌మెంట్ మార్చటం వల్ల కలెక్టరేట్ పరిసరాలు సైతం విస్తరిస్తాయి. ఖమ్మం జిల్లా కేంద్రానికి వెలుపల నుంచి కనీసం 15 కి.మీ దూరం నుంచి ఈ రోడ్డును అలైన్‌మెంట్ మార్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రధాన డిమాండ్‌తోనే కోర్టులో పిటిషన్లు వేశారు. దీనిపై ఎన్‌హెచ్-2 ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనరెడ్డి స్పందించారు.

మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని, కోర్టు ఉత్తర్వుల మేరకే నడుచుకుంటామని వినతిపత్రం సమర్పించిన నిర్వాసిత రైతులకు హామీ ఇచ్చారు.

గుట్టుచప్పుడు కాకుండా రాళ్లు పాతారు

నాంగడ్ల శ్రీధర్, రేగులచలక, రఘునాథపాలెం

తమ భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే రాళ్లు పాతుతున్నారు. హైకోర్టు స్టే ఆర్డర్స్ ఉండగా రైతుల భూములపై దౌర్జన్యం చేయటం ఎన్‌హెచ్ అధికారులకు తగదు. మరోసారి ఇలా జరిగితే కోర్టు ఆదేశాల ఉల్లంఘన కింద కేసు పెడతాం.

ఆగని రూపాయి పతనం

- డాలర్ @85.65

ముంబయి : ప్రపంచ మార్కెట్‌లో రూపాయి మారకం విలువ పతనం కొనసాగుతోంది. 2024 చివరి రోజూ మరింత క్షీణించి నూతన కనిష్టాన్ని చవి చూసింది. మంగళవారం అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ 13 పైసలు పతనమై 85.65 కనిష్ట స్థాయికి దిగజారింది. భారత కరెన్సీ చరిత్రలోనే ఇది మరో అత్యంత కనిష్టం. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 85.54 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఏకంగా 85.66 రికార్డ్ కనిష్ట స్థాయిని తాకింది. డిసెంబర్ నెల చివరి రోజులు కావడంతో ఫారెక్స్ ట్రేడర్లు తమ చెల్లింపుల డిమాండ్‌ను చేరుకోవడానికి డాలర్ల కొనుగోళ్లకు మొగ్గు చూపారని సమాచారం. దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న అత్యంత బలహీనమైన గణంకాలు, స్టాక్ మార్కెట్ల వరుస పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, పేలవ ఎగుమతుల తీరు, దిగుమతులు పెరగడం తదితర అంశాలు రూపాయి విలువను రోజురోజుకు క్షీణించేలా చేస్తున్నాయి.

జనవరి 4న మంత్రివర్గం భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయ పరిమితి, దరఖాస్తుల స్వీకరణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం లబ్దిదారులకు సబ్సిడీ రేట్లతో ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరా చేయాలన్న ప్రతిపాదనపై క్యాబినెట్‌లో చర్చించనున్నట్టు సమాచారం. విద్యుత్ కమిషన్, బీసీ డెడికేటెడ్ కమిషన్, ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికలపై చర్చించే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట దేవాలయానికి తితిదే తరహాలో ప్రత్యేక బోర్డు ఏర్పాటుపై మంత్రిమండలి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట ఆలయానికి పాలక మండలి ఏర్పాటు, నూతన టూరిజం పాలసీపై కేబినెట్ ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. సంక్షేమ, అభివద్ధి పథకాల నిధుల సమీకరణపై చర్చించనున్నట్టు సమాచారం.

కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదిస్తూ కేటీఆర్‌పై కేసు నమోదు చేయడం రాజకీయ విభేదాలతో కూడిన వ్యక్తిగత కక్షసాధింపు చర్యగా అభివర్ణించారు. కేటీఆర్‌పై కేసు నమోదు చేయడానికి కారణాలు లేవన్నారు. డిసెంబర్ 18న ఫిర్యాదు చేస్తే ప్రాథమిక విచారణ చేయకుండానే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేశారనీ, పిటిషనర్ ఆర్థిక ప్రయోజనం పొందినట్టు ఆరోపణలు లేవని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఫార్ములా రేస్ నిమిత్తం ప్రభుత్వం, ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ), ఏస్ నెక్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరిందనీ, అందులో పదో సీజన్‌కు ప్రమోటర్ వెళ్లిపోవడంతో ప్రభుత్వమే చెల్లింపులు జరిపి రేస్ నిర్వహణకు ఆమోదం తెలిపిందని అన్నారు. 2023కు చెందిన బకాయిలను చెల్లించిందని తెలిపారు. కొత్త ఒప్పందాన్ని ప్రభుత్వం అమలు చేయకపోవడంతో ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో అర్బిట్రేషన్‌ను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఇప్పటికే ఉన్న ఒప్పందాన్ని అమలు చేయడానికి ఎన్నికల ప్రవర్తనా నియమావళి వర్తించదనీ, ఒకవేళ ఉల్లంఘించినట్లయితే ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాల్సి ఉందని వాదించారు. ఎన్నికల సంఘం స్పందించక పోయినా ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగా కేసు నమోదు చేసిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సంఘం ప్రొసీజర్ అమలు చేయలేదన్న ఆరోపణ మీద 14 నెలల తరువాత కేసు నమోదు చేయడం లలిత కుమారి, చరణ్‌సింగ్



కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని వాదించారు. 3 నెలల జాప్యానికే సుప్రీం కోర్టు అంగీకరించలేదనీ, ఇక్కడ 14 నెలలు జాప్యమైందని తెలిపారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 3(1)(ఎ) కింద కేసు నమోదు చేయడానికి దుర్వినియోగం ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. ఫార్ములా ఈ నిర్వహణకు నిధులు ఎవరికి చెల్లించారో ప్రభుత్వం దగ్గర వివరాలున్నాయనీ, అయినప్పటికీ ఆ సంస్థను నిందితులుగా చేర్చకుండా అన్యాయంగా పిటిషనర్‌పై లేనిపోని అభియోగాలతో ఎఫ్ఐఆర్ పెట్టారని వాదించారు.

నిధులను పిటిషనర్ సొంతానికి వినియోగించుకోలేదని చెప్పారు. నిధులు పొందిన సంస్థను వదిలేసి ఆనాడు మంత్రిగా నిర్ణయాలు తీసుకున్న పిటిషనర్‌పై కేసు నమోదు చేయడం దారుణమన్నారు. స్పాన్సరర్ వెళ్లిపోవడంతో ఒప్పందంలో పార్టీగా ఉన్న ప్రభుత్వం దాన్ని కొనసాగించాలని నిర్ణయం తీసుకోవడం అవినీతి కిందకు ఎలా వస్తుందని ప్రశ్నించారు. పీసీ యాక్ట్ సెక్షన్ 13(2)పెట్టడానికి నేరపూరిత ప్రవర్తన ఎక్కడ ఉందని అడిగారు. ఐపీసీ 409 కింద ఆధారాలు లేవన్నారు. ఫార్ములా సెషన్ 9ను 35 వేల మంది వీక్షించారనీ, రూ.700 కోట్ల లాభం వచ్చిందని, ఫార్ములా ఈ రేస్ దేశంలో హైదరాబాద్‌లోనే మొదటిసారి జరిగిందని తెలిపారు. నిర్ణయం తీసుకున్నది ప్రభుత్వమనీ, అధికార యంత్రాంగం అన్నీ చూస్తే మంత్రిగా ఆమోదం తెలిపారని వాదించారు. ఒకవేళ ప్రభుత్వ నిర్ణయం తప్పయితే ఎన్నికల్లో ప్రజలే నిర్ణయం తీసుకుంటారన్నారు. కుట్ర పన్నారంటే ఇక్కడ నిర్వాహకులను నిందితులుగా చేర్చలేదన్నారు. ప్రమోటర్ నిందితుడిగా లేకుండా ఐపీసీ 120బి కింద కుట్ర ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఇది కేవలం సివిల్ వివాదమనీ, ప్రభుత్వ విధాన నిర్ణయంలో భాగమని తెలిపారు. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాల్సిన కేసు అనీ, అయితే కౌంటరు దాఖలు చేశాక సమగ్ర విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలని, అంతవరకు ఎఫ్ఐఆర్‌పై తదుపరి ప్రొసీడింగ్స్‌ను నిలిపివేయాలని కోరారు. ఎఫ్ఐఆర్‌ను నిలిపివేస్తే అరెస్ట్ అన్న ప్రశ్న ఉండదనీ, అందువల్ల విచారణను నిలిపివేయాలని దవే విన్నవించారు.

ఒప్పందానికి ముందే చెల్లింపులు : ఏజీ సుదర్శన్‌రెడ్డి

ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి 2023లో ఒప్పందం కుదుర్చుకోవడానికి ముందే చెల్లింపులు జరిగాయని అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఒప్పందాలు జరుగుతాయని ఊహించి చెల్లింపులు జరిగాయని వాదించారు. దర్యాప్తునకు ముందే అన్ని అంశాలను పేర్కొనడానికి ఎఫ్ఐఆర్ ఎన్‌సైక్లోపీడియా కాదని తెలిపారు. దర్యాప్తు జరిగాక అందులో వెల్లడయ్యే విషయాల ఆధారంగా నిందితులను చేర్చడం, తొలగించడం ఉంటుందన్నారు. కేసు నమోదులో రాజకీయ, వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు లేవని స్పష్టం చేశారు. ఆరోపణలు తీవ్రంగా ఉన్నందునే కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ప్రాథమిక విచారణ జరగలేదన్న వాదన సరికాదన్నారు. ప్రాథమిక విచారణ జరిగిందనీ, అక్టోబరు 18న దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గవర్నర్‌కు సమాచారం అందించి ఈనెల 17న కేటీఆర్‌ను విచారించడానికి అనుమతి తీసుకున్నట్టు తెలిపారు. అందువల్ల ప్రాథమిక విచారణ జరగలేదన్న వాదన సరికాదన్నారు. అంతేకాకుండా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులు దర్యాప్తు దశలోనివి కావని స్పష్టం చేశారు. దర్యాప్తు పూర్తై, అభియోగ పత్రం దాఖలు చేశాక విచారణ దశలోనివన్నారు. ఫార్ములా ఈ రేస్‌కు చెందిన కంపెనీ ఇంగ్లండ్‌కు చెందినదనీ, అన్ని అంశాలను పరిశీలించడంలో భాగంగా ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం జరిగిందని వాదించారు. మొదట ఒప్పందం 2022 అక్టోబరు 15న జరగ్గా 2023 అక్టోబరు 27న రద్దయిందని తెలిపారు. తరువాత తాజాగా 2023 అక్టోబరు 30న ఒప్పందం కుదిరిందన్నారు. అయితే చెల్లింపులు మాత్రం అక్టోబరు 3, 11న జరిగాయన్నారు. రెండు విడతలుగా రూ.54.88 కోట్లు హెచ్ఎండీయే సాధారణ నిధుల నుంచి చెల్లించారనీ, దీనికి మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆమోదం తెలిపారని ప్రస్తావించారు. దానివల్ల ప్రభుత్వానికి ఐటీ కింద రూ.14 కోట్లు అదనపు భారం పడిందని తెలిపారు. రూ.10 కోట్లకు మించి చెల్లింపులు జరపాలంటే ప్రభుత్వం నుంచి హెచ్ఎండీయే అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం కూడా ఇంత మొత్తం చెల్లించాలంటూ ఆర్థిక శాఖ ఆమోదం అవసరమన్నారు. ఇవేవీ లేకుండా రిజర్వు బ్యాంకు అనుమతి లేకుండా ఐఓబీ ద్వారా నేరుగా విదేశీ సంస్థలకు సొమ్ము చెల్లించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడ లాభాలు స్పాన్సర్లకు వచ్చాయని, ప్రభుత్వానికి కాదని వాదించారు. ఎఫ్ఐఆర్ దాఖలైన వెంటనే కేసును కొట్టివేయాలని కోరడం సరికాదని, దీనికి ప్రత్యామ్నాయాలున్నాయని, ముందస్తు బెయిలు పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని అన్నారు. దీనికి సంబంధించి పలు సుప్రీంకోర్టు తీర్పులను ప్రస్తావించారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ పిటిషనర్‌పై సెక్షన్ 13(1)(ఎ) కింద కేసు పెట్టడానికి కారణాలేవనీ, అదేవిధంగా చెల్లింపులకు సంబంధించిన నిబంధనలు ఒప్పందంలో ఎక్కడున్నాయని ప్రశ్నించారు. దీనిపై ఏజీ సమాధానమిస్తూ ఎంత దుర్వినియోగం జరిగింది? ప్రభుత్వానికి ఎంత నష్టం వచ్చింది? ఎవరికి ఎంత ముట్టిందన్నది తేలాల్సింది దర్యాప్తులోనేననీ, ఎఫ్ఐఆర్‌లోనే అన్ని అంశాలుండవని వాదించారు. పిటిషనర్ ఆమోదంతో ఒప్పందానికి ముందే చెల్లింపులు జరిగాయన్నారు. ఇది ఏ ఒక్కరికో చెందిన సొమ్ము కాదనీ, ప్రభుత్వానిదని వాదించారు. అరెస్ట్ భయం ఉంటే ముందస్తు బెయిలు పిటిషన్ వేసుకోవచ్చునీ, క్వాష్ పిటిషన్‌లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయరాదని కోరారు. కౌంటరు దాఖలు చేస్తామని అప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయరాదన్నారు. దీనిపై పిటిషనర్ తరపు న్యాయవాది సమాధానమిస్తూ ప్రాథమిక విచారణ జరిపింది ఫిర్యాదుదారు అయిన ప్రభుత్వమని, దర్యాప్తు అధికారి కాదన్నారు.

లలిత కుమారి కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ప్రకారం ఫిర్యాదు నమోదుకు ముందు ప్రాథమిక విచారణ జరపాల్సింది దర్యాప్తు అధికారి అని తెలిపారు. ఇక్కడ ప్రభుత్వమే ప్రాథమిక విచారణ జరిపి, అదే ఫిర్యాదు చేసిందన్నారు. ఎఫ్ఐఆర్‌లో నేరానికి సంబంధించి సరైన కారణాలు లేవని వాదించారు.

చట్టాలన్నీ ఉల్లంఘించారు-దానకిశోర్

మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ తరపున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, రెండో ఒప్పందం చేసుకోవడానికి ముందే రెండు విడతల్లో నగదు చెల్లింపులు జరిగాయన్నారు. విదేశీ కరెన్సీ చెల్లింపుల నిబంధనలను ఉల్లంఘించిందన్నారు. చట్టాలను గంపగుత్తగా ఉల్లంఘించారన్నారు. నిధులు ఎవరికి చెల్లించారో, చెల్లించామని చెబుతున్న నిధులు ఆ సంస్థకు వెళ్లాయా? అక్కడి నుంచి ఆ నిధులు వేరే వాళ్లకు మళ్లింపు జరిగాయా? అవినీతి ఎక్కడ జరిగింది? పిటిషనర్‌కే తిరిగి నిధులు చేరాయా? వంటి అంశాలన్నీ దర్యాప్తులో తేలుతాయన్నారు. ఈ దశలో పిటిషనర్ వినతులను ఆమోదించవద్దని కోరారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు, తీర్పును వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. తీర్పు వెలువడే వరకు పిటిషనర్‌పై కఠిన చర్యలు తీసుకోవడం లేదా అరెస్టు చేయడం వంటి చర్యలు తీసుకోరాదని ఏసీబీని ఆదేశించింది.

బోడుప్పల్ గడ్డపై
మొలకెత్తిన భావిపౌరుడు

నవతెలంగాణ-బోడుప్పల్
కల్కూరి ఎల్లయ్య

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా జూలై నెలలో ప్రమాణ స్వీకారం చేసిన రోజే తైబజార్ రద్దుకు తొలి సంతకం చేసిన అజయ్ యాదవ్ ఆరు నెలల ప్రథమ పౌరుడి ప్రస్థానం అనిర్వచనీయం. సరిగ్గా మూడు పదుల వయస్సున్న ఆ యువ పాలకుడు 'ఉద్దండులను' సైతం మెప్పించగలిగాడు. ప్రభుత్వం సంధించిన బాణంలా.. ప్రజల కోసమే పుట్టినట్టుగా ఈ కొద్ది కాలంలో ప్రాణం పెట్టి పనిచేశాడు. తండ్రి లక్షణాలను పుణికిపుచ్చుకుని చివరి శ్వాసవరకూ ప్రజాసేవలోనే ఉంటామని చెప్పినట్టుగా.. ప్రజలు మెచ్చే పాలనకు శ్రీకారం చుట్టాడు. స్వల్ప వ్యవధిలోనే స్థానిక సమస్యలకు 'దారి' చూపాడు. కోట్ల రూపాయలు తీసుకొచ్చి అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. నాలుగున్నరేండ్లుగా అపరిపక్వ పాలనలో వెనుకబడ్డ బోడుప్పల్‌ను ఆరునెలల్లో అన్ని అంశాల్లో ముందుకు నడిపించాడు. సీఎం ఆదేశాల మేరకు ప్రజాపాలన విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించి అందరి దృష్టిని ఆకర్షించాడు. తాను బాధ్యతలు చేపట్టిన నుంచి ఎలాంటి విమర్శలూ రాకుండా సాహెూసోపేతమైన నిర్ణయాలు తీసుకుని పూర్తిస్థాయిలో మరింత ప్రజల అవసరాలు తీర్చగలనని నిరూపించాడు. ఏండ్ల తరబడి నలుగుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి ఓ కొలిక్కి తెచ్చేందుకు పాటుపడ్డాడు.





గత మరకలు మలిపించి..

మహానగరానికి శివారు ప్రాంతమైన బోడుప్పల్ గతంలో ఎన్నో విమర్శలు, అక్రమాలకు వేదికగా మారింది. పాలకవర్గంలో ఉన్నవారందరికీ అవినీతి మరకలు అంటుకున్నాయి. అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ వ్యవస్థలను ప్రశ్నార్థకంలో పడేశారు. కానీ ఆ ఆరునెలల కాలంలో అటువంటి పరిణామాలేవీ చోటుచేసుకోలేదు. పైగా అత్యధిక శాతం పన్ను వసూలు చేసి ప్రజల మౌలిక వసతులు తీర్చేందుకు ప్రణాళికలు రచించారు మేయర్ అజయ్..! దీంతో బడ్జెట్ పెంపుదలకు ఆయన నిర్ణయం దోహదపడింది. ప్రభుత్వానికొచ్చే పన్నులను తిరిగి ప్రజల కోసమే ఖర్చు చేయొచ్చునని చాటారు. అవసరమైన ప్రాంతాల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లను ప్రారంభించేందుకు కృషి చేశారు. ఇందుకు కోట్ల రూపాయలు మంజూరు చేయించారు.

అటు సుందరీకరణ.. ఇటు పరిరక్షణ

అన్యాక్రాంతమవుతున్న చెరువులు, ప్రభుత్వ భూముల విషయంలో ముందు నుంచీ స్పష్టతతో ఉన్న అజయ్ యాదవ్.. తాను బాధ్యతల్లోకి రాగానే మార్క్ చూయించారు. చెరువుల అభివృద్ధి కోసం హెచ్ఎండీఏ నుంచి 16 కోట్ల రూపాయలు తెప్పించి పనులు ప్రారంభించారు. చెరువుల చుట్టూ వ రిరక్షణ చర్యలు చేపట్టారు.

అదేవిధంగా బోడుప్పల్ సర్వే నెంబర్ 63/26 నుంచి 63/36 నెంబర్ వరకు గల భూములో అక్రమాలను తొలగించేందుకు కదిలారు. మున్ముందు ఆ స్థలంలో సమీకృత కారాల్యయం, కళాభవనం, ఇండోర్ స్టేడియం ఏర్పాటు కోసం ప్రతిపాదించనున్నట్టు తెలిసింది. ఇక 10వేల కుటుంబాలను వెంటాడుతున్న వక్ఫ్ భూముల సమస్యను పార్లమెంట్, అసెంబ్లీలో వినిపించేలా చేశారు. జీపీసీ సభ్యులు కూడా అజయ్ విన్నపాన్ని స్వీకరించి త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీనివ్వడం బాధితులకు పెద్ద ఊరట. ఫిర్యాదులున్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చొరవ చూపుతూ వాటిని స్థానికుల అవసరాల మేరకు వినియోగించాలన్నది అజయ్ ఆశయంగా స్పష్టమవుతోంది.

కాలం గతించవచ్చు.. తరాలు మారొచ్చు.. ఈ గమనంలో ఎన్నయినా వ్యయ ప్రయాసలు ఎదురుకావొచ్చు. కానీ చేసిన సేవ, పరిపాలన ఎంత ఉన్నతంగా, ఆదర్శంగా నిలిస్తే అంతగా వారు ప్రజల హృదయాల్లో నిలిచిపోతారు. తమ ఆకాంక్షలకనుగుణంగా సాగిన పాలననూ ప్రజలు నెమరువేసుకుంటారు. అలాంటి సేవతో కూడిన పరిపాలనకు చిరునామాగా నిలుస్తున్నారు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసి) మేయర్ తోటకూర అజయ్ యాదవ్.. ప్రజల కోసం ప్రమాణ స్వీకారం చేసిన మొదలు స్వల్ప కాలంలోనే సంక్షేమమే లక్ష్యంగా, అధిష్టానంపై అపార విశ్వాసంతో ఉత్సాహంగా అభివృద్ధిలో సాగిపోతున్నారు. సూర్యుడు తేమను గ్రహించి ఎలా వర్షాలు కురిపిస్తాడో అలాగే ప్రజాభీష్టానికి కట్టుబడి ప్రజలు మెచ్చే పరిపాలనను దరిచేరుస్తూ.. కార్పొరేషన్ సర్వతోముఖాభివృద్ధికి నేను సైతం అంటూ దూసుకొస్తున్న ప్రథమ పౌరుడు అజయ్ యాదవ్‌కు నేడు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలతో ప్రత్యేక కథనం..

ప్రజా సేవలో అహరహం తపిస్తున్న 'అజేయుడు'
ఆరు నెలల్లోనే ప్రజలు మెచ్చిన నాయకుడు
అభివృద్ధిలో దూసుకుపోతున్న ప్రథమ పౌరుడు
ఏదైనా చేసి చూపగలనని చాటి చెప్పిన ఘనుడు
సరికొత్త ప్రణాళికలతో పరుగులు పెట్టిస్తున్న పాలకుడు







అజయ్ ప్రస్థానమిది...

పేరు : తోటకూర అజయ్ యాదవ్
ప్రస్తుతం : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్.
విద్యార్హత : బీబీఏ
పుట్టిన తేదీ : జనవరి 1, 1994
భార్య : బొట్ట లీలా స్పందన, (ఎంఎస్ ఆక్స్ ఫర్డ్)
తల్లిదండ్రులు : తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు.
తల్లి : తోటకూర లక్ష్మీ యాదవ్, బోడుప్పల్ మాజీ సర్పంచ్
గెలుపు : 2020లో 6వ డివిజన్ కార్పొరేటర్‌గా విజయం
మేయర్ : 2024, జూలైలో ప్రమాణ స్వీకారం
పార్టీలో.. : రేవంత్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం గెలుపు కోసం యువజన కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంటు ఇంచార్జ్‌గా క్రియాశీలక పాత్ర, కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడంలో అన్నివిధాలా తమవంతు భూమిక



మనస్సుంది.. మార్గముంది..

ప్రజల కోసం ఏదైనా చేయాలనే మనస్సుంది. పార్టీ పెద్దల దన్నుతో అందుకు మార్గమూ ఉంది. కేవలం ఆరు నెలల కాలంలోనే ఎన్నో పనులు చేశాం. ఈ అనుభవంతో మరిన్ని మార్పులు చేయొచ్చు అనుకుంటున్నా. ఇప్పటి వరకు 45 కోట్ల రూపాయల పనులు చేపట్టాం. త్వరలో నిరుద్యోగుల కోసం సెట్విన్ సెంటర్ నెలకొల్పుతాం. డిగ్రీ కాలేజీ, స్పోర్ట్స్ గ్రౌండ్ తీసుకురావడం నా ఆశయం. ప్రజలు, వాహనదారుల దృష్ట్యా 13 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు ఇచ్చాం. ఇది పూర్తయితే రోడ్లు విశాలంగా మారి అభివృద్ధి కూడా పరుగులు పెడుతుంది. ఇప్పటిదాకా ప్రజల ఆదరణతోనే ముందుకు సాగుతున్నా. వాళ్ల ఆశీర్వాదంతో అసెంబ్లీకి వెళ్లాలన్నది నా కల..!

- అజయ్ యాదవ్, బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్



నగరంలో న్యూ ఇయర్ సందడి



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

తెలుగు ఔత్సాహికవేత్తలకు మద్దతు

- దేశ, విదేశాల్లోనూ విస్తృత వ్యాపార అవకాశాలు
- హైదరాబాద్‌లో గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్
- తెలుగు ఎన్ఆర్ఐల అప్తా ఏర్పాటు



నవతెలంగాణ- హైదరాబాద్

ఆసక్తి కలిగిన ఔత్సాహికవేత్తలకు దేశ, విదేశాల్లోని విస్తృత వ్యాపార అవకాశాలు, ఐడియాలపై అవగాహన కల్పిస్తామని అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (అప్తా) సభ్యులు వెల్లడించారు. కొత్త ఏడాదిలో హైదరాబాద్‌లో అతిపెద్ద అతిపెద్ద తెలుగు ఎన్నారైల గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. హైటెక్స్‌లో జనవరి 3 నుంచి 5వ తేదీల్లో అప్తా కాటలిస్టు 2025ను ఏర్పాటు చేస్తుందన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో అప్తా కాటలిస్ట్ కాన్ఫరెన్స్ చైర్మెన్ సుబ్బు కోట, కన్వీనర్ సాగర్ లాగిసెట్టి, సెక్రటరీ చంద్ర శేఖర్ నల్లమ్, ట్రెజరర్ తేజ్ పక్యాలా, అప్తా ప్రెసిడెంట్ మధు వుల్లి, ఆ సంస్థ ప్రతినిధులు రమేష్ తూము, వినయ్ వెలివెలా తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. తొలి రోజు 3న జరిగే సమావేశానికి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, రెండో రోజు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ముగింపు వేడుకకు మెగాస్టార్ చిరంజీవి హాజరు కానున్నారని తెలిపారు. ఈ మూడు రోజుల సదస్సులో నాలెడ్జ్ షేరింగ్, మెంటరింగ్, నెట్‌వర్కింగ్, భాగస్వామ్య సహకారాలు, స్టార్టప్ ఎకోసిస్టమ్ తదితర వాటిపై అవగాహన, మద్దతును అందించనున్నామన్నారు. దీనికి భారత్ సహా ఉత్తర అమెరికా, యూరప్, మిడిల్ ఈస్ట్ , ఆసియాతో సహా 20 దేశాల నుండి వేలాది మంది భారతీయ సంతతికి చెందిన 1000కి పైగా పారిశ్రామికవేత్తలు హాజరు కానున్నారని తెలిపారు. ఐటి, విద్యా, వైద్యం, రియల్ ఎస్టేట్, పర్యాటకం, తయారీ తదితర రంగాల్లోని వ్యాపార అవకాశాలపై 42పైగా ప్యానెల్స్ చర్చించనున్నాయన్నారు. లాభాపేక్ష లేని తమ సంస్థ ఇప్పటి వరకు 12వేల పైగా భారత విద్యార్థులకు రూ.14 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లను అందించామన్నారు.

రిలయన్స్ కేజీ చమురుకు ప్రీమియం ధర

- బిడ్డింగ్‌లకు అహ్వానం

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్ కేజీ బేసిన్‌లో ఉత్పత్తి చేసే ముడి చమురుకు ప్రీమియం ధరను డిమాండ్ చేస్తోంది. ఇందుకోసం బిడ్లను అహ్వానిస్తోంది. దీంతో బిడ్డర్లు అంతర్జాతీయ బెంచ్‌మార్క్ కన్నా కనీసం 3.5 డాలర్లు అధికంగా కోట్ చేయాల్సి ఉంటుంది. 2025 జనవరి 24 నాటికి బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. 2025 ఏప్రిల్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు ప్రతి నెలా ఉత్పత్తి చేసే 17,600 బ్యారెళ్ల ఆయిల్ విక్రయం కోసం తాజాగా బిడ్లను ఆహ్వానించింది. ప్రస్తుతం క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 73.5 డాలర్లుగా ఉంది. టెండరు ప్రకటన ప్రకారం దీనికి 1.5 డాలర్ల ప్రీమియంతో పాటు బ్యారెల్‌కు కనీసం 2 డాలర్లు అధికంగా బిడ్డర్లు కోట్ చేయాల్సి ఉంటుంది. తూర్పు గోదావరి జిల్లాలోని గాడిమొగ నుంచి ఈ ఆయిల్‌ను రిలయన్స్ సరఫరా చేస్తుంది. కేజీ బేసిన్‌లో రిలయన్స్‌కు 66.67 శాతం, బ్రిటిష్ పెట్రోలియంకు 33.33 శాతం చొప్పున వాటాలున్నాయి.

గతేడాది మార్కెట్‌లో 8 శాతం రాబడులు

- 2024 చివరి రోజు నష్టాలు

ముంబయి : గతేడాది 2024లో భారత స్టాక్ మార్కెట్లు 8 శాతంగా పైగా రాబడులను అందించాయి. సెన్సెక్స్ 5,898.75 పాయింట్లు లేదా 8.16 శాతం పెరిగింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 1,913 పాయింట్లు లేదా 8.80 శాతం లాభపడింది. సెప్టెంబర్ 27న సెన్సెక్స్ రికార్డ్ స్థాయిలో 85,978 మార్క్‌ను తాకాగా.. నిఫ్టీ 26,277 గరిష్ట స్థాయిని నమోదు చేసింది. ఏడాది చివరి రోజు మంగళవారం స్వల్ప నష్టాలను చవి చూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఐటితోపాటు కొన్ని బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ 109.12 పాయింట్ల నష్టంతో 78,139కు పరిమితమయ్యింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 0.10 పాయింట్లు తగ్గి 23,644.80 వద్ద ముగిసింది. ఇంతక్రితం సోమవారం సెషన్‌లో సెన్సెక్స్ 450 పాయింట్లు, నిఫ్టీ 168 పాయింట్ల చొప్పున పతనమయ్యాయి.

అదానీ విల్మార్ షేర్ 8 శాతం పతనం

అదానీ విల్మార్ నుంచి అదానీ గ్రూప్ వైదొలుగుతున్నట్లు ప్రకటించడంతో మంగళవారం ఇంట్రాడేలో అదానీ విల్మార్ షేర్లు దాదాపు ఎనిమిది శాతం పతనమైంది. బీఎస్ఈలో తుదకు 6.45 శాతం నష్టంతో రూ.308.25 వద్ద ముగిసింది. ఈ ఎఫ్ఎంసిజి జాయింట్ వెంచర్ అదానీ విల్మార్ నుంచి వైదొలుగుతున్నట్లు సోమవారం అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రకటించిన విషయం తెలిసిందే.

తగ్గిన కీలక రంగాల ఉత్పత్తి



- నవంబర్‌లో 4.3 శాతానికి పతనం

న్యూఢిల్లీ : దేశ అర్థిక వ్యవస్థలో మందగమనం స్పష్టమవుతోంది. అత్యంత కీలకమైన ఎనిమిది మౌలిక వసతుల రంగాల ఉత్పత్తి పడకేసి.. నాలుగు నెలల కనిష్ట స్థాయికి పడిపోయాయి. 2024 ఏడాది నవంబర్‌లో మౌలిక వసతుల రంగాలు ఉత్పత్తి పెరుగుదల 4.3 శాతానికి పడిపోయింది. ఇంతక్రితం ఏడాది ఇదే నెలలో 7.9 శాతం వృద్ధి నమోదయ్యింది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో కీలక రంగాల ఉత్పత్తి 4.2 శాతానికి పరిమితమయ్యింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో 8.7 శాతం రికార్డ్ వృద్ధి చోటు చేసుకుంది. ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన నవంబర్ మాసంలో బొగ్గు (7.5 శాతం), రిఫైనరీ ఉత్పత్తులు (2.9 శాతం), ఉక్కు (4.8 శాతం) వంటి రంగాల్లో ఉత్పత్తి క్షీణించింది. ముడి చమురులో ఏకంగా మైనస్ 2.1 శాతం, సహజ వాయువులో మైనస్ 1.9 శాతం ప్రతికూల వృద్ధి చోటు చేసుకోవడం గమనార్హం. సిమెంట్ 13 శాతం, విద్యుత్ 3.8 శాతం, ఎరువులు 2 శాతం చొప్పున పెరుగుదలను నమోదు చేశాయి. ఈ ఎనిమిది రంగాలు మొత్తం దేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో 40.27 శాతం వాటా కలిగి ఉన్నాయి.

న్యూ ఇయర్ జోష్

సోషల్ మీడియాలో గ్రీటింగ్స్, పలకరింపులు

కిక్కిరిసిన మద్యం, మటన్, చికెన్ దుకాణాలు

టార్గెట్‌కు మించి విక్రయాలు

వైన్స్‌లకు రాత్రి 12 గంటలు, బార్లకు 1 గంట వరకు అనుమతి

డ్రంక్ అండ్ డ్రైవ్ కట్టడికి ప్రత్యేక బృందాలు : ఎస్పీ రూపేష్

ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్స్, దాబాలు, హోటళ్లు ఫుల్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఎటు చూసినా న్యూ ఇయర్ జోష్ చిన్నా పెద్దా తేడా లేదు. నూతన సంవత్సరం సందర్భంగా సందడే సందడి. గడిచిన ఏడాది చేదు అనుభవాలు.. తీపి జ్ఞాపకాలు మిగిల్చింది. రాబోయే కొత్త సంవత్సరమంతా మంచే జరగాలని ఆశిస్తూ న్యూ ఇయర్ విషెస్ చెప్పుకోవడం ఆనవాయితీగా వస్తుంది. 2024కు వీడ్కోలు చెప్పి 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అర్ధరాత్రి కేరింతలు కొడుతూ సందడి చేస్తారు. కేక్‌లు కట్ చేస్తూ ఒకరినొకరు విషెస్ చెప్పుకుంటారు. మరో పక్క డిసెంబర్ 31 సందర్భంగా మద్యం, మాంసం ప్రియుల తాకిడి ఎక్కువవడంతో మద్యం, మటన్, చికెన్ దుకాణాలు కిక్కిరిసిపోయాయి. జనం ఎగబడటంతో వ్యాపారులు ఇదే అదనుగా అధిక ధరలకు విక్రయాలు సాగించారు. న్యూ ఇయర్ పేర బేకరీ, హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లలో అధిక ధరలు వసూలు చేశారు. కొత్త సంవత్సరం జోష్‌లో తప్పతాగి యూత్ రోడ్లపై చక్కర్లు కొట్టి ప్రమాదాలకు గురయ్యే అవకాశమున్నందున పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పెంచారు.

న్యూ ఇయర్‌కు ఒకటి రెండు రోజుల నుంచే వేడుకలతో యువతలో జోష్ కనిపిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని హోటళ్లు, దాబాలు, రిసార్ట్స్‌లకు వెళ్లి ఎంజాయి చేస్తూ వేడుకలు జరుపుకుంటున్నారు. యూత్ సెల్‌ఫోన్స్‌లో చాటింగ్, పోస్టుల ద్వారా విషెస్ చెప్పుకున్నారు. రాత్రి 12 అవగానే కేరింతలు కొడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం తెలిపారు. హేపీ న్యూ ఇయర్ అంటూ గంతులేశారు. బైక్ రైడింగ్ చేస్తూ గోలగోల చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పల్లెలు పట్టణమనే తేడా లేకుండా సందడి సందడిగా కనిపించింది. ఇంట్లో కేక్‌లు కట్ చేసి కుటుంబ సభ్యులు ఒకరినొకరు విషెస్ చెప్పుకున్నారు. పట్టణాల్లో కాలనీలు, అపార్ట్‌మెంట్స్, వీధుల్లో సందడి చేశారు. అర్ధరాత్రి 12 కాగానే ఒక్కసారిగా లైట్స్ ఆఫ్ చేసి న్యూ ఇయర్‌కు వెల్‌కమ్ చెప్పారు.

గంజాయి, డ్రగ్స్ కదలికలపై నిఘా

మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన యువత కొత్త సంవత్సర వేడుకల్లో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను సేవించే అవకాశమూ లేకపోలేదు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో 2024 వార్షిక క్రైమ్ రేట్ నివేదిక లెక్కల ప్రకారం గంజాయ్ కేసులు పెరిగాయి. కోట్ల రూపాయల విలువ చేసే గంజాయి, ఇతర డ్రగ్స్ పట్టుబట్టాయి. అయితే హైదరాబాద్-పూణే, కంది-నాందేడ్ ప్రధాన రహదారుల్లో అక్రమంగా గంజాయి రవాణా సాగుతోంది. గుట్టుగా గంజాయి, డ్రగ్స్‌ను రవాణా చేస్తుండటమే కాకుండా స్థానికంగా కూడా జోరుగా గంజాయి విక్రయాలున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు, యువకులు, ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వలస కార్మికులు గంజాయి, డ్రగ్స్‌కు బానిసలయ్యారు. అందుకే గంజాయి, డ్రగ్స్ రవాణా, విక్రయాలపై నిఘా పెట్టినట్లు ఎస్పీ తెలిపారు.

ఫామ్‌హౌస్‌లు, దాబాలు ఫుల్

న్యూ ఇయర్ వేడులతో ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్స్, దాబాలు, హోటళ్లు ఫులయ్యాయి. వారం నుంచే కొత్త సంవత్సర వేడుల కోసం బుక్ చేసుకున్నారు. డిసెంబర్ 31 రాత్రి కేక్ కట్ చేయడం, మద్యం సేవించడం, భోజనాలకు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా కూల్ డ్రింగ్స్ అమ్మకాల కోసం డిస్కౌంట్ సేల్స్ పెట్టారు. కేక్‌లు, ఐస్ క్రీమ్ అమ్మకాలు కూడా జోరుగా సాగాయి. బేకరీలు, స్వీట్ హౌస్‌లతో పాటు ప్రత్యేకంగా కౌంటర్లు పెట్టి కూల్‌డ్రింక్స్, కేక్స్, ఐస్‌క్రీమ్స్ విక్రయించారు. పిల్లలు, పెద్దలు ఎగబడి కొనుగోళ్లు చేశారు.

రాత్రి 1 వరకు మద్యం అమ్మకాలు

న్యూ ఇయర్ అంటేనే దావత్‌లు, ఎంజాయ్ చేయడమనే భావన ఉంది. మద్యం, మాంసం ప్రియుల రద్దీతో మంగళవారం సాయంత్రం నుంచే మద్యం షాపులు కిక్కిరిపోయాయి. మద్యం ప్రియులు తమకు నచ్చిన బ్రాండ్ల కోసం ఎగబడ్డారు. ముఖ్యంగా యూత్ బీర్ల కోసం ఎగబడటంతో వైన్స్, బెల్ట్‌షాపుల్లో అధిక ధరలకు విక్రయించారు. డిసెంబర్ 31న మద్యం అమ్మకాలు అధికంగా సాగేందుకు వీలుగా వైన్స్‌లకు రాత్రి 12 గంటల వరకు, బార్లకు రాత్రి 1 గంట వరకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. దాంతో మద్యం కోసం తెల్లవార్లూ బారులు తీరారు. న్యూ ఇయర్ ముగింపు కావడంతో ఎక్సైజ్ అధికారులు సైతం వారం నుంచే వైన్స్‌ల వారీగా టార్గెట్స్ పెట్టి మద్యం కోసం డీడీలు కట్టించారు. వైన్స్‌ల పరిధిలో ఉన్న బెల్ట్ షాపుల్లోనూ అధిక మద్యం అమ్మాలని అధికారులే నేరుగా నిర్వాహకులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వైన్స్‌లు, బార్లు, బెల్ట్‌షాప్‌ల్లో రోజువారీ అమ్మకాల కంటే ఐదింతలు అమ్మే అవకాశముంది. వైన్స్‌లో స్టాక్ అయిపోయిందన్న నెపంతో అర్ధరాత్రి తర్వాత నుంచి ఎంఆర్‌పీ ధరల కంటే అధికంగా వసూలు చేస్తారు. బీర్లపై అదనంగా రూ.20 నుంచి 40, ఫుల్, ఆఫ్ బాటిల్స్‌పై రూ.40 వరకు తీసుకున్నారు. మరో పక్క మటన్, చికెన్ విక్రయాలు కూడా జోరుగా సాగాయి.

డ్రంక్ అండ్ డ్రైవ్ కట్టడికి ప్రత్యేక బృందాలు

న్యూ ఇయర్ జోష్‌లో యువత మద్యం తాగి రోడ్లపై కేరింతలు కొట్టడం, రాష్ డ్రైవింగ్ చేయడం పరిపాటిగా మారింది. దాంతో ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం వాటిళ్లుతుంది. దీంతో న్యూ ఇయర్ సందర్భంగా మంగళవారం సాయంత్రం నుంచే ప్రత్యేక నిఘా పెట్టారు. సంగారెడ్డి ఎస్పీ రూపేష్, మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సిద్దిపేట సీపీ అనురాధ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. రోడ్లపై డ్రంక్ అండ్ డ్రైవ్‌ను కట్టడి చేసేందుకు ప్రత్యేక బృందాలను పెట్టి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. రాత్రి 1 గంట వరకు బార్లు నడిపి మద్యం అమ్మడం వల్ల తెల్లారిందాక మద్యం కోసం బయటికి వస్తారు. రోడ్లపై తిరిగే వాళ్లను కట్టడి చేసేందుకు చెకింగ్ పాయింట్స్ పెట్టారు. రాత్రి పూట రోడ్లపై ర్యాష్ డ్రైవ్ చేస్తూ ఎంజాయ్ చేస్తారు. అలాంటి వాళ్లను రోడ్లపైకి రాకుండా అనేక చోట్ల పోలీసులు బందోబస్తు పెట్టి తనిఖీలు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో యూత్ ఘర్షణ పడతారు. అలాంటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా పోలీసుల్ని పెట్టి అల్లర్లు జరగకుండా చూస్తుమని ఎస్పీ రూపేష్ తెలిపారు. సంగారెడ్డి మీదుగా రెండు ప్రధాన రహదారులపై అక్కడక్కడ చెక్‌పోస్టులు పెట్టారు. ఆయా పట్టణాల్లోనూ ప్రధాన కూడళ్లు, సిగ్నల్స్ వద్ద పోలీసులు తనిఖీలు చేశారు.

ఈ ఏడాది 152 ఏసీబీ కేసులు

- అవినీతికి పాల్పడితే జైలు శిక్షే
- ప్రజలు కూడా సహకరించేలా విస్తృత ప్రచారం
- వార్షిక నివేదిక విడుదలలో ఏసీబీ డైరెక్టర్ జనరల్ విజయ్‌కుమార్




నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఏసీబీ ఆధ్వర్యంలో 2024లో 142 కేసులు నమోదు చేశామనీ, 223 మందిని అరెస్టు చేశామని ఏసీబీ డైరెక్టర్ జనరల్ విజయ్‌కుమార్ చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వంతో సంబంధమున్న సంస్థల్లో పనిచేసేవారు అవినీతికి పాల్పడితే వారికి తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో ముఖ్యంగా ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన వారిపైనా, అక్రమాస్తులకు పాల్పడ్డవారిపైనా ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు. 2024లో తాము నమోదు చేసిన ట్రాప్ కేసులు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులతో పాటు ప్రభుత్వం ఆదేశించిన మేరకు నిర్వహించిన అంతర్గత విచారణలకు సంబంధించిన వార్షిక నివేదికను ఆయన మంగళవారం విడుదల చేశారు. 2024లో 152 కేసులు నమోదు చేశామనీ, 223 మందిని అరెస్టు చేశామని తెలిపారు. 129 మంది కేసుల్లో ఇన్వాల్వ్ అయినట్టు తేలిందన్నారు. అందులో 159 మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారని తెలిపారు. 11 మందిపై అక్రమాస్తుల కేసులు, 12 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామనీ, వారిలో 18 మందిని అరెస్టు చేశామని వివరించారు. అవినీతి ఆరోపణలకు సంబంధించి పలు విచారణలు జరుగుతున్నాయని చెప్పారు. పలు ఆఫీసుల్లో 29 సార్లు ఆకస్మిక తనిఖీలు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపామని తెలిపారు. ప్రభుత్వం సమర్పించిన చార్జిషీట్‌కు సంబంధించి 105 ప్రాసిక్యూషన్ ఆర్డర్లు వచ్చాయని చెప్పారు. 2024లో 26 పాత కేసులను ముగించామని తెలిపారు. 2018కి సంబంధించి ఒక కేసు, 2019కి సంబంధించి మూడు కేసులు, 2020-21కి సంబంధించి ఐదు కేసులు, 2022కు 12 కేసులు ఉన్నాయని వివరించారు. 2024లో ట్రాప్‌చేసిన 129 కేసుల్లో రూ.82 లక్షల 78 వేలు పట్టుబడగా అందులో రూ.64 లక్షల 80 వేలను ఫిర్యాదుదారులకు తిరిగి అప్పగించామని తెలిపారు. అక్రమాస్తులకు సంబంధించి 11 కేసుల్లో రూ.97,42,67,000లను అటాచ్ చేశామన్నారు. కేసుల దర్యాప్తు కోసం 32 మంది ఏసీబీ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. అన్ని జిల్లాల్లో డిసెంబర్ 3 నుంచి 9వ తేదీ వరకు అవినీతి నిరోధక వారోత్సవాలను నిర్వహించామనీ, ప్రజలకు చైతన్యం కల్పించామని వివరించారు. పిల్లలకు ప్రత్యేకంగా వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. పలు కేసుల్లో ముందుకొచ్చి ఫిర్యాదు చేసిన వారిని ఏసీబీ తరఫున సన్మానం చేశామని తెలిపారు.

ఇందిరమ్మ రాజ్యమంటేనే సంక్షేమ రాజ్యం

- నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఉపముఖ్యమంత్రి భట్టి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇందిరమ్మ రాజ్యమంటేనే సంక్షేమ రాజ్యమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలకు ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో మార్పును తీసుకువచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. దళిత, గిరిజన, బహుజన, ఆదివాసీ, మైనారిటీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సర్కారు పని చేస్తుందని తెలిపారు. అధికారంలోకొచ్చే నాటికే గత పాలకులు ఖజానాలో ఒక్క రూపాయి లేకుండా చేశారని తెలిపారు. పైపెచ్చు సుమారు మైనస్ రూ. 4 వేల కోట్లతో రాష్ట్రాన్ని అప్పగించినా.. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగులకు జాబ్ కేలండర్ ద్వారా నియామకాలు, రైతులకు రైతు భరోసా, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ ఇస్తున్నామని తెలిపారు. ఎక్కడాలేని విధంగా ఒకేసారి రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. తాజాగా రాష్ట్రంలోని ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందించనున్నట్టు తెలిపారు.

ఎల్ఎండీ ఆయకట్టుకు నీటి విడుదల

నవతెలంగాణ - తిమ్మాపూర్

యాసంగి సీజన్‌కు సంబంధించి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని లోయర్ మానేరు జలాశయం నుంచి కాకతీయ కెనాల్ ద్వారా ఆయకట్టుకు కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం సాగునీరు విడుదల చేశారు. జలాశయం నీటిలో పూలను చల్లి రెగ్యులేటర్ గేట్ వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం స్విచ్ ఆన్ చేసి కెనాల్‌కు నీటి విడుదల ప్రారంభించారు. ఆయకట్టు విస్తీర్ణం, జలాశయం సామర్థ్యం, విడుదల చేస్తున్న నీటి కెపాసిటీ గురించి నీటిపారుదల శాఖ ఎస్ఈ పెద్ది రమేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నీటి విడుదల కొనసాగించాలన్నారు. యాసంగి సీజన్‌కు మొత్తం 44.480 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఎస్ఈ రమేష్ తెలిపారు. మొత్తం 6లక్షల 97వేల 708 ఎకరాలకు వచ్చే మార్చి 31 వరకు నీటి విడుదలను కొనసాగిస్తామని తెలిపారు. జోన్ 1, జోన్ 2 పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీటి విడుదల కొనసాగిస్తామన్నారు. రోజుకు 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని తెలిపారు. 11 టీఎంసీల నీటిని మధ్య మానేరు ద్వారా, ఐదు టీఎంసీల నీటిని ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా సేకరించి విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం లోయర్ మానేరు జలాశయంలో 22.870 టీఎంసీల నీటి నిలువ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఈలు నాగభూషణ్ రావు, డీఈ శ్రీనివాస్, ఏఈఈలు వంశీధర్, దీపిక, సంజన, కిరణ్ పాల్గొన్నారు.



ఫారెస్ట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ టీజీవో ఫోరం ఎన్నిక

- అధ్యక్షులుగా శ్రీనివాస్, కార్యదర్శిగా ప్రభాకర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఫారెస్ట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ టీజీవో ఫోరం నూతన కార్యవర్గం ఎన్నికలు టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ సమక్షంలో జరిగాయి. తెలంగాణ ఫారెస్ట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ టీజీవో ఫోరం నూతన అధ్యక్షులుగా ఎం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బి ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మాచర్ల రామకృష్ణగౌడ్, సహాయ ఎన్నికల అధికారిగా పోగ్ల శ్రీరామ్‌రెడ్డి వ్యవహరించారు. ఆ ఫోరం సహాధ్యక్షులుగా జి శ్రీధర్‌రావు, కోశాధికారిగా మహమ్మద్ ఇషాక్, ఉపాధ్యక్షులుగా కె అరుణ్, సహ కార్యదర్శిగా సిహెచ్ శ్రీనివాసులు, మీనాకుమారి, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి రామకృష్ణ, ప్రచార కార్యదర్శిగా బి అంబేద్కర్, కార్యవర్గ సభ్యులుగా ఎం శ్రీనివాస్‌రెడ్డి, బి గంగామణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీజీవో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ బి శ్యామ్, నాయకు జె సుజాత తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లోని రాజ రాజేశ్వరి కాలనీలో ఉన్న గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ప్రజలు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ రాజేశ్వరి కాలనీలో ఉన్న గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ 9వ అంతస్తులో మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఉన్న ఫర్నిచర్‌కు మంటలు అంటుకోవడంతో పొగ కమ్ముకుంది. సిలిండర్ పేలిన సమయంలో పెద్ద ఎత్తున శబ్దం రావడంతో అపార్ట్‌మెంట్ వాసులు బయటకు పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. దాంతో ప్రమాదం తప్పింది. గ్యాస్ సిలిండర్ పేలిన సమయంలో ఇంట్లో ఒకరు ఉన్నట్టు స్థానికులు తెలిపారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

రేషన్‌షాపుల ద్వారా 14 రకాల సరుకులు ఇవ్వాలి : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ-చౌటుప్పల్

నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, రేషన్‌షాపుల ద్వారా 14 రకాల సరుకులు ఇవ్వాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలపై వారం రోజులపాటు సర్వేలు నిర్వహించి కలెక్టర్‌కు మెమోరాండం ఇవ్వాలన్నారు. మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో అవ్వారు రామేశ్వరి అధ్యక్షతన జిల్లా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువులు బియ్యం, పండ్లు, పప్పులు, ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ, కూరగాయలు తదితర వస్తువుల ధరలు పెరగడం వల్ల పేద ప్రజలపై భారాలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో పౌష్టికాహార లోపంతో 19 నుంచి 45 సంవత్సరాలు ఉన్న మహిళలు 50శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పుట్టిన పిల్లలు పోషకాహారం అందక బరువుకు తగ్గ ఎత్తుకు లేరని, ఎత్తుకు తగ్గ బరువు లేరని అన్నారు.

ఆకలి సూచికలో 127 దేశాలతో చూస్తే మన దేశం 105వ స్థానంలో ఉందని 2024 సంవత్సరానికి సంబంధించి విడుదలైన 19 జీహెచ్ఐ తెలియజేస్తే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. పొరుగున ఉన్న దేశాలు నేపాల్, శ్రీలంక, మయన్మార్, పాకిస్థాన్, అఫ్ఘనిస్తాన్ కంటే మన దేశం వెనుకబడి ఉందని చెప్పా రు. జాతీయ ఆహారభద్రతా చట్టాన్ని తప్పనిసరిగా అమలుపర్చాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని హెచ్చరించినా నిమ్మకు నీరెత్తినట్టు ఉందని విమర్శించారు. వ్యవసాయం, ఆహార భద్రత, పౌష్టికాహార పంపిణీపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఉచిత బస్సు తప్ప ఏదీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ వర్క్ షాప్‌లో ఐద్వా జిల్లా కోశాధికారి కల్లూరి నాగమణి, సహాయ కార్యదర్శి మల్లేపల్లి లలిత, జిల్లా కమిటీ సభ్యులు ఆండాలు, భువనగిరి పట్టణ కార్యదర్శి శారద, సోని, విజయలక్ష్మీ, సువర్ణ, లక్ష్మమ్మ, లలిత పాల్గొన్నారు.

యెమెన్‌లో కేరళ నర్సుకు మరణశిక్ష వివాదం..

అవసరమైన సాయం చేస్తున్నాం :విదేశాంగ శాఖ వెల్లడి



న్యూఢిల్లీ : కేరళ నర్సు నిమిషా ప్రియపై 2017లో నమోదైన హత్యకేసులో ఆమెకు విధించిన మరణశిక్ష విషయమై తాజాగా భారత ప్రభుత్వం స్పందించింది. ఈ హత్య కేసు విషయంలో ఆమెకు అన్నివిధాలా సాయం చేస్తామని వెల్లడించింది. 'నిమిషా ప్రియకు యెమెన్‌లో మరణశిక్ష విధించిన సంగతి మాకు తెలుసు. ఆమె కుటుంబ సభ్యులు పడే ఆవేదన మేము అర్థం చేసుకోగలం. ఈ కేసులో ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందిస్తుంది' అని భారత విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం తెలిపారు.

కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన నర్సు నిమిషా ప్రియ గత కొన్నేళ్ళుగా యెమెన్‌లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో యెమెన్ జాతీయుడు తలాల్ అబ్దో మహదీ, నిమిషా ప్రియ పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. ఆమె తన పాస్‌పోర్టును తిరిగి తీసుకునేందుకు మహదీకి మత్తుమందును ఇంజెక్ట్ చేసింది. స్పృహ కోల్పోయిన తర్వాత తన పాస్‌పోర్టు తీసుకోవాలనుకుంది. అయితే మత్తుమందు ఓవర్‌డోస్ కావడం వల్ల మహదీ చనిపోయాడు. ఆ మత్తుమందు వల్లే మహదీ చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. 2017లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి 2018లో నిమిషాకు యెమెన్ కోర్టు మరణశిక్ష విధించింది. అయితే ఈ శిక్షపై ఆమె 2023లో యెమెన్ సుప్రీంకోర్టులో అప్పీల్ చేయగా, ఆ అప్పీల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. కాగా, తాజాగా ఈ కేసులో నిమిషా ప్రియకు యెమెన్ కోర్టు విధించిన మరణశిక్షకు అధ్యక్షుడు ఆమోదం తెలిపారు. అయితే హత్యకు గురైన మహది కుటుంబ సభ్యులు అమెకు క్షమాభిక్ష పెడితే ఆమె మరణశిక్ష నుంచి బయటపడే అవకాశం ఉంది. ఈ కేసు నుంచి తన కుమార్తెను రక్షించుకోవడం కోసం నిమిషా తల్లి కుమారి తీవ్రంగా పోరాడుతున్నారు. ఆమె సంవత్సరం క్రితమే యెమెన్‌కు వెళ్లారు. మహదీ కుటుంబ సభ్యులకు పరిహారంగా డబ్బును ఇచ్చేందుకు వారితో చర్చలు జరుపుతున్నారు. ఒకవేళ మహదీ కుటుంబ సభ్యులు ఆ పరిహారాన్ని అంగీకరిస్తే నిమిషా ప్రియకు మరణ శిక్ష తప్పే అవకాశం వుంది. నిమిషాకు వివాహమై ఎనిమిదేళ్ల పాప ఉంది. 2011లో ఆమె కుటుంబంతో సహా యెమెన్‌కు వెళ్లింది. ఆమె యెమెన్‌లో సనాలో క్లినిక్ నడిపేది. అయితే యెమెన్ చట్టాల ప్రకారం విదేశీ పౌరులెవరైనా స్థానిక భాగస్వాములతో కలిసే వ్యాపారం నిర్వహించాల్సి వుంది. దీంతో స్థానికుడైన మహదీని ఆమె తన క్లినిక్‌లో భాగస్వామిగా చేర్చుకుంది. అయితే మహదీ కొన్ని సంవత్సరాలుగా తనను వేధిస్తున్నాడని, తన వ్యాపారం నుండి డబ్బు కూడా వసూలు చేసుకున్నాడని నిమిషా ఆ దేశ అధికార ప్రతినిధులకు తెలిపింది. ఈ విషయంలో పోలీసులను ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకపోయింది. చిట్టచివరకు అతడి దగ్గర చిక్కుకుపోయిన తన పాస్‌పోర్టును తిరిగి తీసుకునే క్రమంలో అతడి మరణానికి కారణమైంది.

సీపీఐ(ఎం) ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా రవిశంకర్ మిశ్రా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) ఉత్తరప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యదర్శిగా రవిశంకర్ మిశ్రా ఎన్నికయ్యారు. మూడ్రోజుల పాటు బులంద్‌షహార్‌లో జరిగిన సీపీఐ(ఎం) ఉత్తరప్రదేశ్ రాష్ట్ర 24వ మహాసభ మంగళవారం ముగిసింది. ఈ మహాసభకు సీపీఐ(ఎం) సమన్వయ కర్త ప్రకాష్‌కరత్, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణీ అలి, కేంద్ర కమిటీ సభ్యులు అమ్రారామ్, విక్రమ్ సింగ్ హాజరయ్యారు. రాజకీయ, నిర్మాణ నివేదికను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి హీరాలాల్ మహాసభలో ప్రవేశపెట్టారు. దీనిపై సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం 35 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక కాగా, 11 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికైంది. నూతన కార్యదర్శిగా రవిశంకర్ మిశ్రా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా హీరాలాల్ యాదవ్, డీపీ సింగ్, ముకుత్ సింగ్, ప్రేమనాథ్ రాయ్, మధు గార్గ్, బిఎల్ భారతి, సురేంద్ర సింగ్, బాబూరామ్ యాదవ్, చంద్రపాల్ సింగ్ తదితరులు ఎన్నికయ్యారు.

సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాష్‌కరత్ మాట్లాడుతూ మసీదుల కింద రోజురోజుకు దేవాలయాలు వస్తున్నాయని, అది ప్రజల్లో విబేధాలు సృష్టించడానికి జరిగే కుట్రలో భాగమని విమర్శించారు. బీజేపీ మతతత్వ స్వభావంపై ధ్వజమెత్తారు. ఇండియా బ్లాక్, ప్రతిపక్షాల ఐక్యతపై మాట్లాడిన ఆయన ప్రస్తుత సమయంలో ప్రతిపక్ష ఐక్యత చాలా ముఖ్యమని అన్నారు. దేశంలో మోడీ సర్కార్ ప్రజలపై భారాలు వేస్తోందని, అన్ని వర్గాల ప్రజలపై దాడులు చేస్తోందని విమర్శించారు. రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువత ఇలా ఏ సమస్య కేంద్ర ప్రభుత్వానికి పట్టదని, కేవలం తమ మత రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగం పెరిగిందని, ధరలు పెరుగుదల మునుపెన్నడూ లేనంతగా ఉందని పేర్కొన్నారు. కానీ మోడీ సర్కార్ మతం పేరుతో ప్రజలను విచ్ఛిన్నం చేస్తోందని విమర్శించారు. సీపీఐ(ఎం) క్షేత్ర స్థాయిలో బలమైన పార్టీని నిర్మించడంతోపాటు బలమైన వామపక్ష ఐక్యతను నెలకొల్పాలని పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం) కర్నాటక రాష్ట్ర కార్యదర్శిగా కె. ప్రకాష్ ఎన్నిక



సీపీఐ(ఎం) కర్ణాటక రాష్ట్ర కార్యదర్శిగా కె. ప్రకాష్ ఎన్నికయ్యారు. తుమకురులో మూడు రోజుల పాటు జరిగిన సీపీఐ(ఎం) కర్నాటక రాష్ట్ర మహాసభ మంగళవారం ముగిసింది. ఈ మహాసభకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎంఎ బేబి, ఎ.విజయరాఘవన్ హాజరయ్యారు. సీపీఐ(ఎం) కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి యు.బసవరాజు రాజకీయ, నిర్మాణ నివేదికను మహాసభ ముందు ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై 67 మంది సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని మహాసభ ఎన్నుకుంది. 35 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. అందులో 12 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికైంది. నూతన కార్యదర్శిగా కె. ప్రకాష్ ఎన్నిక కాగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా యు.బసవరాజు, జిసి బైరెడ్డి, మీనాక్షి సుందరం, ఎస్. వరలక్ష్మి, గోపాలకష్ణ హరాలహళ్లి, సయ్యద్ ముజీబ్, యాదవశెట్టి, మునివెంకటప్ప, కె. బాలు, కె. మహంతేష్, చంద్రప్ప హెూస్కేరా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా జాతీయ నేతలు మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. దేశంలోని వనరులను కేంద్రం పెట్టుబడిదారులకు దోచిపెడుతోందని విమర్శించారు. నిరుద్యోగ యువతను, సంక్షోభంలోని రైతులను, సమస్యల్లో ఉన్న కార్మికులను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. అదానీ, అంబానీల మేలు కోసమే ప్రభుత్వం పని చేస్తోందని విమర్శించారు. మోడీ హయాంలో అవినీతి దేశ సరిహద్దులు దాటిపోయిందని పేర్కొన్నారు. అందుకు అదానీ ముడుపుల వ్యవహారాన్ని ఉదాహరించారు.

సీపీఐ(ఎం) అండమాన్ నికోబార్ రాష్ట్ర కార్యదర్శిగా డి.అయ్యప్పన్



సీపీఐ(ఎం) అండమాన్ నికోబార్ రాష్ట్ర కార్యదర్శిగా డి. అయ్యప్పన్ ఎన్నికయ్యారు. పోర్ట్ బ్లెయిర్‌లో నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) అండమాన్ నికోబార్ దీవుల 12వ రాష్ట్ర మహాసభ మంగళవారం ముగిసింది. ఈ మహాసభకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు జి. రామకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు సుజన్ చక్రవర్తి హాజరయ్యారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి డి. అయ్యప్పన్ రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా డి.అయ్యప్పన్ తిరిగి ఎన్నికయ్యారు. 19 మంది సభ్యులతో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక కాగా, అందులో ఎనిమిది మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికైంది.

అవి పూర్తిగా ద్వేషపూరిత వ్యాఖ్యలు !

మహారాష్ట్ర మంత్రి రాణే వ్యాఖ్యలపై కేరళ ముఖ్యమంత్రి సహా పాలక నేతల ఖండన



తిరువనంతపురం : కేరళను 'మినీ పాకిస్తాన్' అంటూ మహారాష్ట్ర మంత్రి నితీష్ రాణే చేసిన వ్యాఖ్యలపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సహా పాలక ఫ్రంట్ నేతలు మంగళవారం తీవ్రంగా ఖండించారు ఈ వ్యాఖ్య 'పూర్తిగా ద్వేషపూరితమైనదని, 'తీవ్రంగా ఖండించదగినదని విజయన్ విమర్శించారు. "లౌకికవాదం, మత సామరస్యానికి కంచుకోట అయిన కేరళకు వ్యతిరేకంగా సంఘ్ పరివార్ నిర్వహించే విద్వేష ప్రచారాలను ఈ వ్యాఖ్య ప్రతిబింబిస్తోంది. మతం పేరుతో ప్రజలను విభజించాలన్న సంఘపరివార్ వ్యూహం దీంతో బట్టబయలవుతోంది. కేరళపై జరిగిన ఈ హేయమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాము. సంఘ్ పరివార్ ద్వేషపూరిత ప్రచారానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, లౌకిక శక్తులన్నీ ఏకం కావాలి." అని ఎక్స్‌లో పెట్టిన పోస్టులో పేర్కొన్నారు.

నితీష్ రాణె ఫడ్నవీస్ ప్రభుత్వంలో మత్స్య, ఓడరేవుల అభివృద్ధి శాఖలను నిర్వహిస్తున్నారు. ఒక బహిరంగ సభలో కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలను ఉద్దేశించి నితీష్ రాణె మాట్లాడుతూ, కేరళ మినీ పాకిస్తాన్ అయినందునే వయనాడ్ నుండి వారిద్దరూ ఎంపిలుగా ఎన్నికయ్యారని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులంతా వారికి ఓటేసారని అన్నారు. ఈ వ్యాఖ్యలపై పినరయి విజయన్ సహా పలువురు పాలక, ప్రతిపక్ష నేతలు ఘాటుగా స్పందించారు.

భారతదేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను కాపాడతానని రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన ఒక మంత్రి, దేశంలో భాగమైన ఒక రాష్ట్రాన్ని పాకిస్థాన్ అని, అక్కడి ప్రజలను ఉగ్రవాదులు అని ప్రస్తావించడమేమిటని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అతుల్ లోంధే ప్రశ్నించారు. మంత్రి పదవిలో కొనసాగే నైతిక హక్కు ఆయనకు ఉందా? చెప్పాలని ప్రధాని నరేంద్రమోడీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌లను నిలదీశారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వం మాట్లాడుతూ, మతోన్మాద విషాన్ని చిమ్ముతున్న రాణేను తక్షణమే మహారాష్ట్ర ప్రభుత్వం పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. భారతదేశ లౌకిక రాజ్యాంగ, సమాఖ్య భావనలకు పూర్తి విరుద్ధంగా రాణే వ్యాఖ్యలు వున్నాయన్న విజయన్ వ్యాఖ్యలతో ఆయన ఏకీభవించారు. తిరస్కరించబడిన మనుస్మృతి భావజాలం నుండే బిజెపి సిద్ధాంతాలు వెలువడ్డాయని అన్నారు. మోడీ-షా గ్యాంగ్ రాణే అభిప్రాయాన్ని సరిదిద్దే అవకాశం లేదని అన్నారు. లౌకికవాదానికి, ప్రగతిశీల సామాజిక దృక్పథాలకు కేరళ పర్యాయపదమని వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకోవాలని పేర్కొన్నారు.

ఇటువంటి వ్యాఖ్యలను సమర్థిస్తున్నారా? లేదా? అనే విషయమై బిజెపి స్పష్టతనివ్వాలన్నారు. భారత దేశానికి, కేరళ ప్రజలకు బిజెపి సమాధానం చెప్పాలని ఎన్‌సిపి (శరద్ పవార్ వర్గం) అధికార ప్రతినిధి క్లైడ్ క్రాస్టో దుయ్యబట్టారు. ఈ వ్యాఖ్యలు అవమానకరమని ఆయన వ్యాఖ్యానించారు.

కేంద్రం చర్చలకు ఆహ్వానిస్తే వైద్య చికిత్సకు సిద్ధం

- రైతుల ప్రతిపాదన
- మరో మూడు రోజులు గడువిచ్చిన సుప్రీం



న్యూఢిల్లీ : చర్చలకు కేంద్ర ప్రభుత్వం తమను ఆహ్వానించినట్లైతేనే నిరశన దీక్షలో వున్న జగ్‌జిత్ సింగ్ దల్లేవాల్ వైద్య సాయం తీసుకుంటారని రైతులు కేంద్రానికి లేఖ రాశారని పంజాబ్ ప్రభుత్వం మంగళవారం సుప్రీం కోర్టుకు తెలియచేసింది. తమ పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించడంతో సహా రైతుల డిమాండ్లను ఆమోదించాలని కోరుతూ నవంబరు 26 నుండి దల్లేవాల్ ఖానౌరి సరిహద్దు వద్ద నిరశన దీక్ష చేస్తున్నారు. రైతులు, కేంద్ర ప్రభుత్వం మధ్య చర్చల వెనుక గల పరిస్థితుల గురించి వ్యాఖ్యానించడానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సుధాంశు ధూలియాలతో కూడిన వెకేషన్ బెంచ్ తిరస్కరించింది. "చర్చల గురించి లేదా శాంతి భద్రతల పరిస్థితులపై దేనిమీదా వ్యాఖ్యానించబోం. తెర వెనుక జరిగే వాటిపై వ్యాఖ్యానించాలనుకోవడం లేదు. అది రైతులు, ప్రభుత్వానికి మధ్య అంశం. రైతులకు, సంబంధిత పక్షాలకు ఆమోదయోగ్యమైనది ఏదైనా జరిగితే మాకు కూడా సంతోషమే." అని జస్టిస్ కాంత్ స్పందించారు. రైతు నేతను తక్షణమే నిరశన దీక్షా శిబిరం నుండి ఆస్పత్రికి తరలించాలని పంజాబ్ ప్రభుత్వానికి తాము జారీ చేసిన ఆదేశాలను అమలు చేయడంపైనే కోర్టు ఆందోళన చెందుతోందని న్యాయమూర్తి పేర్కొన్నారు. దల్లేవాల్‌ను ఆస్పత్రికి తరలించడానికి డిసెంబరు 31వరకు గడువు ఇస్తున్నట్లు 28వ తేదీన జరిగిన విచారణ సమయంలో సుప్రీం కోర్టు తెలిపింది. కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైనందుకు పంజాబ్ చీఫ్ సెక్రటరీ, డిజిపి ఇద్దరూ కోర్టు ధిక్కార చర్యలను ఎదుర్కొంటున్నారు. దల్లేవాల్‌ను ఆస్పత్రికి తీసుకెళ్ళేందుకు తాము చేసిన ప్రయత్నాలను రాష్ట్ర అడ్వకేట్ జనరల్ గుర్మిందర్ సింగ్ వివరించారు. పంజాబ్ బంద్‌కు రైతులు పిలుపివ్వడంతో ఆ ప్రయత్నాలు భగ్నమయ్యాయన్నారు. తాజాగా కేంద్రానికి రైతులు లేఖ రాసిన నేపథ్యంలో పరిస్థితులు ఎలా మారతాయో చూసేందుకు తమకు మరో మూడు రోజులు సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కోర్టు అందుకు అనుమతించింది. ఈ కేసు విచారణను జనవరి 2వ తేదీకి వాయిదా వేసింది. పరిస్థితులను, న్యాయ ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని మరింత సమయం కావాలన్న అభ్యర్ధనను ఆమోదించాలని నిర్ణయించినట్లు కోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది.



మణిపూర్ ప్రజలకు ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ క్షమాపణలు

ఇంఫాల్ : సుమారు రెండేళ్ల నుంచి హింసాకాండతో అల్లాడుతున్న మణిపూర్ ప్రజలకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్ క్షమాపణలు చెప్పారు. '2024 ఏడాది మొత్తం దురదృష్టకరం. గత ఏడాది మే 3 నుంచి ఇప్పటి వరకూ జరుగుతున్న దానికి రాష్ట్ర ప్రజలకు నేను క్షమాపణాలు చెబుతున్నాను' అని మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి తెలిపారు. 'అనేక మంది నిరాశ్రయులయ్యారు. నేను చాలా బాధపడుతున్నాను. రాష్ట్ర ప్రజలకు నేను క్షమాపణలు చెబుతున్నాను' అని బీరేన్ సింగ్ అన్నారు. కొన్ని నెలల నుంచి పరిస్థితి మెరుగుపడుతందని, 2025లో సాధారణ పరిస్థితులు నెలకుంటాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఇప్పటి వరకూ దాదాపు 200 మంది మరణించారు. దాదాపు 12,247 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 625 మంది నిందితులను అరెస్టు చేశాం. పేలుడు పదార్థాలతో సహా సుమారు 5,600 తుపాకీలు, ఆయుధాలు, 35 వేల మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నాం' అని ముఖ్యమంత్రి తెలిపారు. తగినంత భద్రతా సిబ్బందిని, నిర్వాసితులకు సహాయం చేయడానికి, వారికి కొత్త ఇళ్ల నిర్మించడానికి తగినన్ని నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చిందని ముఖ్యమంత్రి తెలిపారు.

2023 మే నుంచి మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభమయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మణిపూర్ ప్రభుత్వం కానీ.. కేంద్రం ప్రభుత్వం కానీ వీటిని నివారించలేకపోయింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇక్కడ కనీసం పర్యటన కూడా చేయలేదు. ఇలాంటి నేపథ్యంలో ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పడంపై ప్రజలు పెదవివిరుస్తున్నారు. ముందు కనీసం కొత్త ఏడాదిలోనైనా హింసాకాండకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

స్వేచ్ఛా, సుస్థిర ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం కృషి



నిబద్ధతను పునరుద్ఘాటించిన క్వాడ్ దేశాలు

న్యూఢిల్లీ : స్వేచ్ఛా, పారదర్శక, సుస్థిర ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని ఏర్పాటు చేసే దిశగా కృషి చేయాలన్న తమ దృఢమైన నిబద్ధతను భారత్ సహా క్వాడ్ సభ్య దేశాలు మంగళవారం పునరుద్ఘాటించాయి. ఈ మేరకు క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రులు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. క్వాడ్ సహకారానికి 20ఏళ్లు పూర్తయిన సందర్భంగా వారు సమావేశమయ్యారు. ఇండో-పసిఫిక్ భవిష్యత్ అవసరాలను తీర్చే దిశగా క్వాడ్ కలిసి కృషి చేస్తుందని విదేశాంగ మంత్రులు పేర్కొన్నారు. 2004లో హిందూ మహా సముద్రంలో భూకంపం, సునామీ సంభవించిన నేపథ్యంలో పరస్పరం సహకరించుకునేందుకు 20ఏళ్ళ క్రితం భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లు నిర్ణయించి క్వాడ్‌గా రూపొందాయి. శాంతియుతమైన, సుస్థిరమైన, సంక్షేమంతో కూడిన ఇండో-పసిఫిక్ ప్రాంత దార్శనికతను భాగస్వాములుగా తామందరం పంచుకున్నామని సంయుక్త ప్రకటన పేర్కొంది.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని 10సభ్య దేశాలతో కూడిన ఆసియాన్ గ్రూపు ప్రాముఖ్యత గురించి కూడా మంత్రులు పేర్కొన్నారు. నాలుగు దేశాలు కలిసి 40వేల మంది ఎమర్జన్సీ కార్యకర్తలను అందచేశాయని, ఇండో-పసిఫిక్ ప్రాంత వ్యాప్తంగా ఇతర భాగస్వాములతో కలిసి ఈ విపత్తు వల్ల దెబ్బతిన్న లక్షలాదిమంది ప్రజలకు మద్దతుగా నిలిచేందుకు కృషి చేస్తున్నామని ఆ ప్రకటన పేర్కొంది.

తీవ్ర ప్రకృతి విపత్తుగా ప్రకటనలో జాప్యంతో

సహాయక నిధులపై ప్రభావం : కేరళ మంత్రి



తిరువనతంపురం : వాయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన ప్రమాదాన్ని 'తీవ్ర ప్రకృతి విపత్తు'గా ప్రకటించడంలో కేంద్ర ప్రభుత్వ విపరీతమైన జాప్యాన్ని కేరళ రెవెన్యూ మంత్రి కె.రాజన్ తీవ్రంగా తప్పుపట్టారు.

కేంద్ర ప్రభుత్వ జాప్యం కారణంగా విదేశీ సంస్థల నుంచి సహాయ నిధులను కోరే అవకాశాన్ని కేరళ కోల్పోయిందని మంత్రి తెలిపారు. కొండచరియలు విరిగిపడిన 154 రోజుల తరువాత, రాష్ట్ర ప్రభుత్వం పదేపదే విజ్ఞప్తులు చేసిన తరువాత 'తీవ్ర ప్రకృతి విపత్తు'గా ప్రకటించిందని చెప్పారు.

'ఈ ప్రకటన చేయడానికి నిజంగా 154 రోజులు అవసరమా..?' అని మంత్రి ప్రశ్నించారు. 'వాయనాడ్ విపత్తు సంభవించిన వెంటనే కేంద్రానికి కేరళ చేసిన మూడు అభ్యర్ధనల్లో ఇది ఒకటి. దీన్ని ఇప్పుడు సూత్రపాయంగా ఆమోదించబడింది.

ఈ ప్రకటన రెండు నెలల్లోపు వచ్చి వుంటే, విదేశీ సంస్థల సహాయం కోసం కేరళ ప్రభుత్వం విజ్ఞప్తి చేసి ఉండేది' అని మంత్రి తెలిపారు.

అలాగే, రూ. 1,202 కోట్ల ప్రాథమిక సహాయం కోసం కేరళ చేసిన అభ్యర్ధనను కేంద్రం ఇంకా ఆమోదించలేదని మంత్రి తెలిపారు. వాయనాడ్ ప్రమాదాన్ని 'తీవ్ర ప్రకృతి విపత్తు'గా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది.

ఈ మేరకు కేరళ రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శికి హోం శాఖ సంయుక్త కార్యదర్శికి అధికారికంగా సమాచారం ఇచ్చింది.



అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడి అరెస్టు, సోదాలపై వారంట్లు

సియోల్ : దేశంలో సైనిక పాలన విధించడంపై అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను అదుపులోకి తీసుకుని, ఆయన నివాసంలో, కార్యాలయంలో సోదాలు చేపట్టేందుకు దక్షిణ కొరియా కోర్టు మంగళవారం వారంట్లు జారీ చేసింది. మార్షల్ లా విధించడం తిరుగుబాటు కిందకు వస్తుందా రాదా అనే అంశంపై విచారణ జరుపుతున్నట్లు దేశ అవినీతి నిరోధక సంస్థ తెలిపింది. అయితే యూన్‌ను లాంఛనంగా పదవి నుండి తొలగించనిదే అదుపులోకి తీసుకోవడం గానీ లేదా సోదాలు నిర్వహించడం గానీ చేపట్టడానికి అవకాశాలు లేవని నిపుణులు భావిస్తున్నారు. సెంట్రల్ సియోల్‌లోని అధ్యక్ష కార్యాలయం, యూన్ నివాసంలో తనిఖీలు చేపట్టడంపై సియోల్ వెస్ట్రన్ డిస్ట్రిక్ట్ కోర్టు వారంట్లు జారీ చేసింది. దక్షిణ కొరియా చట్టం ప్రకారం, తిరుగుబాటు నేత దోషిగా తేలినట్లైతే మరణ శిక్ష లేదా యావజ్జీవం పడే అవకాశం వుంది. కానీ యూన్ అధ్యక్షుడైనందున ఆయనకు క్రిమినల్ ప్రాసిక్యూషన్ నుండి రక్షణ వుంది. అయితే ఈ రక్షణ తిరుగుబాటు లేదా దేశద్రోహం ఆరోపణలకు వర్తించదు. ఈ నెల 14న అభిశంసనకు అనుకూలంగా పార్లమెంట్ ఓటు వేసినప్పటి నుండి యూన్‌కు గల అధికారాలను రద్దు చేశారు. కాగా తన చర్య చట్టబద్ధమైన పాలనా చర్యేనని యూన్ వాదిస్తున్నారు. ప్రధాన లిబరల్ అపోజిషన్ డెమొక్రటిక్ పార్టీని హెచ్చరించడం కోసమే ఈ చర్య తీసుకున్నానని చెబుతున్నారు.